
'ప్రతి రైతూ పట్టణ ప్రాంత వ్యక్తితో సమానంగా ఆదాయం పొందాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 | వెల: ₹ 5.50 | సంపుటి: 15 | సంచిక: 213


సోమవారం 24-10-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్‌లో కొనుగోలుదారుల సందడి

దీపావళికు సోనోవిజన్ అందించే డిస్కౌంట్ సేల్‌ను ఈ సంవత్సరం ప్రజలు అనూహ్యంగా ఆదిరిస్తున్నారు. ముఖ్యంగా సోనోవిజన్‌లో లభించే స్క్రాచ్ కార్డ్ స్కీమ్ అందరిని ఆకట్టుకుంటుంది. మాములు డిస్కౌంట్‌తో పాటు కార్డ్ స్క్రాచ్ చేయగా మినిమం 6% పైన కొంతమందికి మరింత ఎక్కువ పర్సంటేజ్ డిస్కౌంట్ రావడంపై కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరియు క్యాష్ బ్యాక్ ఆఫర్స్‌లో 22.5% వరకు అదనంగా డిస్కౌంట్ లభించడం వలన కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంది.


దీపావళి శుభాకాంక్షలతో...
సోనోవిజన్ దీపావళి సేల్
LG
Life's Good
INTRODUCING THE ALL-NEW RANGE OF
LG REFRIGERATORS
STUNNINGLY STYLISH
GC-X257CQES
InstaView – Door-in-Door™
AI ThinQ
Hygiene Fresh+™
Door Cooling+™
UVnano™
Smart Diagnosis™
Non-Plumbing Water & Ice Dispenser
Automatic Ice Maker
Smart Pocket Handle
Spaceplus™ Ice System
Express Freezing
Multi Digital Sensor
Inverter Linear Compressor
Matt Black
Capacity: 674 Litres
GL-T502APZY
Door Cooling+™
Convertible
Smart Diagnosis™
2-Star Rating
Smart Inverter Compressor™
Shiny Steel
Capacity: 471 Litres
GL-T422VESX
AI ThinQ
Door Cooling+™
Hygiene Fresh
Convertible
3-Star Rating
Smart Inverter Compressor™
Ebony Sheen
Capacity: 423 Litres
EXCLUSIVE OFFERS
ADDITIONAL 2 YEAR MAINTENANCE
STARTING AT ₹2* PER DAY
CASHBACK
UP TO 20%*
(On Select Side-by-Side Refrigerator Models)
Mini Bar Refrigerator
(GL-M051RSWC)
*Free Mini Bar Refrigerator with Select Side-by-Side Refrigerator Models.
AI ThinQ | HYGIENE FRESH | DoorCooling+™
* T & C Apply
Go Easy Intelligent!
with AI Direct Drive™
FHP1410Z7P
AI Direct Drive™
Steam+
6 Motion DD
TurboWash™
LG ThinQ™
10-Year Warranty
RPM: Max. 1400
Colour: Platinum/Shiny Rose Gold
FHV1409Z4M
AI Direct Drive™
Steam™
6 Motion DD
LG ThinQ™
10-Year Warranty
RPM: Max. 1400
T80SJRG1Z
Smart Inverter Motor
JetSpray+
Smart Diagnosis™
3 Smart Motions
Soft Closing Door
Colour: Ebony Regal/Black
EXCLUSIVE OFFERS*
CASHBACK
UP TO 20%*
(On Select Models)
FIXED EMI
Starting from
₹888*
ADDITIONAL 2 YEAR MAINTENANCE
STARTING AT ₹2* PER DAY
*Offers valid on Select Washing Machine Models.
* T & C Apply
Care & Delight LG Service
LG 24 x 7 CUSTOMER CARE
1800-315-9999
1800-180-9999 (Toll Free)
5757554 (Send SMS)
www.lg.com/in/support
LG WhatsApp No. 9711709999
LG Service India Mobile App Available at Google Play
www.facebook.com/lgindiapage/
www.twitter.com/LGIndia
To know more about LG, visit www.lg.com/in
For Corporate/Institutional enquiries, please write to corp.enquiries@lge.com
www.lgbrandstore.com/in
LG Greencycle
Regd. Office: LG Electronics India Pvt. Ltd., A-24/6, Mohan Cooperative Industrial Estate, Mathura Road, New Delhi-110044
CIN No. U32107DL1997PTC220109
*T&C apply. Images are for representation purpose only. Actual product and feature may vary from model to model. For complete information, visit www.lg.com/in. *T&C Apply. Up To 20% Cash Back - Limited Period offer on Select Side-by-Side Refrigerator Models. Fixed EMI - Limited Period offer on Select Direct Cool Refrigerator Models. *Additional 2 year Maintenance starting at `2 per day Offer - `2 per day calculation is indicative and derived basis 2 year period on the select entry level models of Refrigerators and ranges up to `6.50 per day on select top end models. Maintenance shall be subject to standard AMC T&Cs. Maintenance does not cover physical damage, aesthetic parts and accessories. Offer valid from 6th Aug to 31st Oct 2022. AMC stands for Annual Maintenance Cost. For more information, please contact LG Customer Care 1800-315-9999 or speak to service engineer at the time of installation or visit www.lg.com/in. Product features may vary from model to model. Image of the product are for illustration purpose only and may differ from actual product.
visit : www.sonovision.in మా టీమ్ ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్ సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నారు.
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన APలో అత్యంత నమ్మకమైన షోరూం సోనోవిజన్
విజయవాడ, ఏలూరు రోడ్, రామమందిరం దగ్గర. 9440804182, 9246666202
విజయవాడ, విజయప్లాజా, ఏలూరు రోడ్, విజయవాడ 9154281648, 649, 650.
విజయవాడ, ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట. 9100991701, 9440804184
విజయవాడ, యం.జి.రోడ్, ఆల్ ఇండియా రేడియో ఎదురు. 9246666203, 9154281640
విజయవాడ, పటమట, మోహన్‌దాస్ థియేటర్ దగ్గర. 9246661616, 9100991702
విజయవాడ, కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్ 9440804183, 9246666209
శ్రీనగర్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ. 8712600531, 32, 33
గొల్లపూడి, ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్. 8333924930, 9154281628
ఎనికేపాడు, ఏలూరు రోడ్. 9100991703, 9154281626
పోరంకి, మెయిన్ రోడ్ సెంటర్. 9154281645, 46, 47
గుడివాడ, ఏలూరు రోడ్. 9154281178, 79
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు. 7331149379, 80, 81
వైజాగ్ డైమండ్ పార్క్ : 9390006608, వైజాగ్ ద్వారకా నగర్ : 9246667474, మధురవాడ : 9246666214, గాజువాక : 9246667575, న్యూగాజువాక : 9440804187, గోపాలపట్నం : 9100991704, శ్రీకాకుళం : 9154281140, విజయనగరం : 9246666208 ★ గుంటూరు జిన్నాటవర్ సెంటర్ : 9246667373, గుంటూరు లక్ష్మీపురం-1 : 9246666204, గుంటూరు లక్ష్మీపురం-2 : 9154867822, గుంటూరు బ్రాడీపేట : 9246666215, రాజమండ్రి కోటిపల్లి బస్టాండ్ : 9246662288, రాజమండ్రి జె.యన్.రోడ్ : 9100991700, రాజమండ్రి ఇన్నీసుపేట జంక్షన్ : 9154281197, కాకినాడ రామయ్య స్ట్రీట్ : 9246665511, కాకినాడ సర్పవరం జంక్షన్ : 7331149376, ఏలూరు బిర్లా పార్క్ ఎదురు : 9246666205, ఏలూరు అశోక్ నగర్ : 9390006620, భీమవరం : 8333924936, తణుకు : 8333924938 ★ తెనాలి బోస్‌రోడ్ : 9246666211, తెనాలి రత్నా టాకీస్ : 8333924937, తాడేపల్లి : 7331149366, రేపల్లె : 9390006609, నెల్లూరు చెన్నయ్ బస్టాండ్ దగ్గర : 9246666206, నెల్లూరు మిని బైపాస్ రోడ్ : 8712600519, ఒంగోలు : 9246666329 ★ తిరుపతి నేతాజీ రోడ్ : 9440804186, తిరుపతి లీలామహల్ సెంటర్ : 9100991707, తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్ : 7331149370, చిత్తూరు : 8712600528 ★ కర్నూలు అమ్మ హాస్పిటల్ సెంటర్ : 8333924947, కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురు : 9154281642, నంద్యాల : 8712600525, అనంతపురం : 9154281191, కడప : 9154281194 ★ ఖమ్మం : 9246666319, ఖమ్మం వైరా రోడ్ : 9100991709, ఖమ్మం వర్తకాల : 8333924931, కొత్తగూడెం, భద్రాచలం రోడ్డు : 9154281635, హైదరాబాద్ పంజాగుట్ట : 9440804181, హైదరాబాద్ కూకట్‌పల్లి : 9154281180, హైదరాబాద్ హైదర్‌నగర్ : 7331149363, హైదరాబాద్ మలక్‌పేట : 8333924932, హైదరాబాద్ ఎల్.బి.నగర్ : 8333924943


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

సంపుటి: 15
సంచిక: 213
పేజీలు: 14+4
వెల: ₹ 5.50

సోమవారం 24-10-2022

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి దీపావళి శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



చరిత్రకెక్కిన జిన్‌పింగ్

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చరిత్ర సృష్టించారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా ప్రధాన కార్యదర్శిగా వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు.

వివరాలు 6లో



ప్రధానిగా పోటీ పడుతున్నా

బ్రిటన్ ప్రధాని రేసులో తాను కూడా ఉన్నట్టు భారత సంతతికి చెందిన రిషి సునాక్ ఆదివారం అధికారికంగా ప్రకటించారు.

వివరాలు 6లో



ఆ సంస్థల లైసెన్స్‌లు రద్దు

సోనియాగాంధీ ఆధ్వర్యంలో నడుస్తున్న రాజీవ్‌గాంధీ ఫౌండేషన్, రాజీవ్ చారిటబుల్ ట్రస్ట్ లైసెన్స్‌లను కేంద్రం రద్దు చేసింది.

వివరాలు 6లో



దేశం రెండుగా విడిపోయింది

దేశం రెండుగా విడిపోయిందని, మళ్లీ ఏకం చేసేందుకే భారత్ జోడోయాత్ర చేపట్టినట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు.

వివరాలు 7లో

న్యూస్‌రీల్

రూ.300 కోట్లతో రిబ్బన్ కంపెనీ



అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం–రాంబిల్లి సెజ్‌లో రూ.300 కోట్లతో యమ రిబ్బన్ కంపెనీని ఏర్పాటు చేయనున్నట్టు రిబెస్ట్ రిబ్బన్ కంపెనీ(బౌస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) డైరెక్టర్ స్టీవ్ వెల్లడించారు. వచ్చే నెలలో శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు.

వివరాలు 2లో ▸

వేగంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసులు



రాష్ట్రంలోని రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను యుద్ధప్రాతిపదికన మంజూరు చేస్తున్నామని ఏపీ తూర్పు, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీ కె.సంతోష రావు తెలిపారు. ఈనాడులో 'కరెంటు కనెక్షనుకు పడిగాపులు' శీర్షికతో ప్రచురితమైన కథనాన్ని ఆయన ఖండించారు.

వివరాలు 11లో ▸

విశాల దృక్పథంతోనే విశాఖ రాజధాని



ఏపీకి పరిపాలన రాజధాని విశాఖపట్నమేనని, దీన్ని సాధించుకోవడమే ధ్యేయమని రౌండ్ టేబుల్ సమావేశాల్లో విద్యావేత్తలు, మేధావులు, వైద్యులు, టీచర్లు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు పునరుద్ఘాటించారు. మూడు ప్రాంతాల అభివృద్ధితోనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు.

వివరాలు 8లో ▸

రామాయపట్నం రయ్.. రయ్



రామాయపట్నం పోర్టులో వేగంగా జరుగుతున్న బ్రేక్ వాటర్ నిర్మాణ పనులు

త్వరితగతిన పోర్టు నిర్మాణానికి స్థానికుల పూర్తి సహకారం

- సొంత గ్రామాలను ఖాళీ చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రజలు
- పరిహారం, పునరావాసం విషయంలో సీఎం ఉదారతే ఇందుకు కారణం
- మంగళవారం నుంచి పునరావాస ప్యాకేజీ అందించనున్న ప్రభుత్వం
- ఎన్నికల ముందు పునాదిరాయి వేసి పట్టించుకోని చంద్రబాబు సర్కారు
- ఈ ప్రభుత్వం శంకుస్థాపన చేసినప్పటి నుంచి పనుల్లో వేగం
- మూడు నెలల్లోనే రూ.150 కోట్ల విలువైన పనులు పూర్తి
- ఇప్పటికే 850 ఎకరాలకు రూ.89 కోట్ల పరిహారం పంపిణీ

సర్కారు పెద్ద మనసు..

- ➤ తాజాగా 3 గ్రామాలకు చెందిన 594 ఇళ్లు ఖాళీ చేయిస్తున్న అధికారులు
- ➤ వీరికి తెట్టుగ్రామం వద్ద 23 ఎకరాల్లో 675 ప్లాట్ల కేటాయింపు
- ➤ మేజర్ పిల్లలు, వృద్ధులు ఉంటే వేరే కుటుంబంగా పరిగణన



- ➤ రూ.19 కోట్లతో పాఠశాల, ఆస్పత్రి, రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పన
- ➤ ఒక్కో కుటుంబానికి రూ.9.96 లక్షలు చొప్పున పునరావాస ప్యాకేజీ
- ➤ ఇప్పుడున్న ఇంటి విస్తీర్ణం విలువ మదింపు చేసి రెట్టింపు పరిహారం

రామాయపట్నం పోర్టు నుంచి చంద్రశేఖర్ మైలవరపు, సాక్షి ప్రతినిధి:

ఎక్కడైనా ఓ అభివృద్ధి పథకం కోసమో.. లేక ప్రాజెక్టు కోసమో ప్రభుత్వం భూ సేకరణకు దిగిందంటే ధర్నాలు, ఆందోళనలు, నిరసనలు పెల్లుబుకుతుంటాయి. అయితే రామాయపట్నం పోర్టు నిర్మాణం విషయంలో మాత్రం అందుకు విరుద్ధంగా స్థానికులే ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తున్నారు. పరిహారం, పునరావాసం విషయంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న మానవతా దృక్పథ విధానం వల్లే స్థానిక గ్రామాల నుంచి పూర్తి మద్దతు వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ పోర్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి. జూలై 20న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసినప్పటి నుంచి ఒక్క రోజు కూడా విరామం లేకుండా రేయింబవళ్లు పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు పైలాన్ ఆవిష్కరించి వెళ్లిపోయిందని, అయితే ఈ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన రోజు నుంచే పనులు ప్రారంభించిందని ప్రశంసిస్తున్నారు. రామాయపట్నం పోర్టు రాక వల్ల తమ ప్రాంతం అభివృద్ధి కానుండటంతో సంతోషంగా తమ గ్రామాలను ఖాళీ చేయడానికి గ్రామస్తులు ముందుకు వస్తున్నారు. భూ సేకరణ దగ్గర నుంచి పునరావాస ప్యాకేజీ వరకు ప్రభుత్వం చాలా ఉదారంగా వ్యవహరించిందని, దీంతో గ్రామాలను ఖాళీ చేయడానికి అంగీకరిస్తున్నామని మొండివారిపాలెం, ఆవులవారిపాలెం, కర్లపాలెం గ్రామస్తులు 'సాక్షి'కి వివరించారు. ప్రభుత్వం పోర్టు కోసం 850 ఎకరాలు సేకరించి, నష్ట పరిహారం కింద రూ.89 కోట్లు చెల్లించింది. ఇప్పుడు పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో మూడు గ్రామాలను ఖాళీ చేయించడంపై దృష్టి సారించింది. మూడు గ్రామాలకు తోడు సమీపంలోని సాలిపేట గ్రామం వద్ద ఉన్న 25 కుటుంబాలతో కలిపి

మిగతా 2వ పేజీలో ▶

కోహ్లి నూర్ విజయం



పాక్‌పై పేలిన 'విరాట్' బాంబ్

కళ్లు చెదిరే షాట్‌లతో అద్వితీయ పోరాటం చేసిన కింగ్ కోహ్లి.. పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం

అద్భుతం.. అసాధారణం.. అనిర్వచనీయం.. ఆదివారం భారత్, పాక్ మధ్య జరిగిన మ్యాచ్‌ను ఏ తీరుగా ప్రశంసించినా తక్కువే. టి20 క్రికెట్ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయేలా దాయాదుల సమరం జరిగింది. ఈ ఉత్కంఠ పోరులో కళ్లు చెదిరే షాట్‌లతో కోహ్లి 82 పరుగులు చేసి ఒంటిచేత్తో భారత్‌కు విజయాన్ని అందించాడు. టి20 ప్రపంచకప్ గ్రూప్-2 లీగ్ మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై గెలిచింది. - వివరాలు 10లో ▸

భక్తులు వెలిగించిన దీపాలతో కాంతులీనుతున్న అయోధ్యలోని సరయూ నదీ తీరం



'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్'కు శ్రీరాముడే స్ఫూర్తి

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- సరయూ నది తీరంలో దీపోత్సవం
- 15.76 లక్షల దీపాలతో గిన్నిస్ రికార్డు

6లో

జేసీల పరిధిలోనూ 'వెబ్‌ల్యాండ్' సమస్యల పరిష్కారం

- ఇప్పటివరకు సీఎంఆర్‌వో ప్రాజెక్ట్ డైరెక్టర్‌కే మార్పులు చేసే అవకాశం
- ఇకపై జాయింట్ కలెక్టర్లకూ మార్పులు చేసే అవకాశం కల్పించిన ప్రభుత్వం
- సర్వే నంబర్ల మార్పు, పట్టా భూములుగా మార్పు వంటి వాటిని సులభతరం చేసేందుకే..
- సర్క్యులర్ జారీ చేసిన సీసీఎల్‌ఏ



సాక్షి, అమరావతి: వెబ్‌ల్యాండ్‌లో భూములకు సంబంధించిన మార్పులు చేసే అవకాశాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్లకు ప్రభుత్వం కల్పించింది. మొన్నటివరకు ప్రాథమిక స్థాయిలో కేవలం తహశీల్దార్లు మాత్రమే వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేసే అవకాశం ఉండేది. ఆ తర్వాత ఉన్నత స్థాయిలో మార్పులు చేయాలంటే చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) కార్యాలయంలోని కంప్యూటరైజేషన్ ఆఫ్ మండల రెవెన్యూ ఆఫీసెస్ (సీఎంఆర్‌వో) ప్రాజెక్ట్ డైరెక్టర్‌కే అవకాశం ఉండేది. అంటే తహశీల్దార్ స్థాయిలో మార్పును తిరస్కరిస్తే దాన్ని పైస్థాయిలో సీసీఎల్‌ఏ కార్యాలయంలోనే మార్చడానికి అవకాశం ఉండేది. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. స్పందన కార్యక్రమంలో దీనిపై ప్రజల నుంచి పెద్దఎత్తున విజ్ఞప్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ అధికారాన్ని


మిగతా 2వ పేజీలో ▶

సీఏఎస్ పోస్టులకు మూడో విడత ఎంపిక జాబితా విడుదల

7లో

తుపానుగా మారిన వాయుగుండం

- సిత్రాంగ్‌గా నామకరణం
- రేపు బంగ్లాదేశ్‌లో తీరాన్ని దాటే అవకాశం
- రాష్ట్రానికి ముప్పు తప్పినట్టే



తుపాను గమనాన్ని తెలిపే ఉపగ్రహ చిత్రం

- వివరాలు 7లో ▸

ధనాధన్ 'జువ్వలు'

- ఒడిదుడుకులున్నా ముందుకే..
- సంవత్ 2079లో నిఫ్టీ@19,425

- వివరాలు IVలో ▸

పథకం ప్రకారమే మంత్రులపై దాడి

- అనుమతి లేకుండా జనసమీకరణ చేసి ర్యాలీ
- దాడిపై ఆరు కేసులు నమోదు
- 100 మంది అరెస్ట్, 82 మంది పరారీ
- పవన్‌తో దురుసుగా ప్రవర్తించలేదు
- మీడియా సమావేశంలో విశాఖ పోలీస్ కమిషనర్ శ్రీకాంత్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

దొండపర్తి (విశాఖ దక్షిణ): జనసేన నాయకులు, కార్యకర్తలు పథకం ప్రకారమే విశాఖ విమానాశ్రయంలో మంత్రులపై దాడిచేశారని నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ చెప్పారు. ఆయన ఆదివారం విశాఖలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విశాఖ పర్యటనలో జరిగిన పరిణామాలపై ఆ పార్టీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను కొట్టిపడేశారు. ఈ నెల 13వ తేదీన జనసేన రాష్ట్ర నాయకుడు కోన తాతారావు జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ జిల్లా పర్యటనకు సంబంధించిన వివరాలతో డీసీపీకి లేఖ ఇచ్చినట్లు చెప్పారు. 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా నోవోటెల్ హోటల్‌కు వెళతారని, 16వ తేదీ పోర్టు కళావాణి ఆడిటోరియంలో జనవాణి కార్యక్రమం, 17వ తేదీన వైఎంసీఏలో జరిగే కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళతారని ఆ లేఖలో పేర్కొన్నారని తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి హోటల్‌కు ర్యాలీ, డీజే, భారీ జనసమీకరణల గురించి ఆ లేఖలో పేర్కొనలేదని, వాటికి అనుమతి కూడా తీసుకోలేదని స్పష్టం చేశారు. డ్రోన్ వినియోగానికి అనుమతి కోరగా.. రిమోట్ పైలెట్ ఎయిర్‌క్రాఫ్ట్ అనుమతి లేకపోవడంతో దాన్ని తిరస్కరించినట్లు చెప్పారు. సెక్షన్ 30 అమలులో ఉన్నప్పటికీ ముందస్తు అనుమతులు లేకుండా భారీ ఎత్తున జనసమీకరణ చేసి విమానాశ్రయానికి తరలించారని పేర్కొన్నారు. విశాఖ గర్జన కార్యక్రమాన్ని ముగించుకుని విమానాశ్రయానికి చేరుకున్న మంత్రులు రోజా, విడదల రజిని, జోగి రమేష్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి..

మిగతా 8వ పేజీలో ▶

సెలవు

దీపావళి సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం

ఇదండీ సంగతి



ఏపీ బడిబాటలో యూపీ

ఇక్కడి విద్యా విధానాల స్ఫూర్తితో ఉత్తరప్రదేశ్‌లో కార్యక్రమాలు

మూడున్నరేళ్ల క్రితం రాష్ట్రంలో పాఠశాలల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టిన విద్యా సంస్కరణలు మంచి ఫలితాలిస్తున్నాయి. ఇందులో భాగంగా వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా విద్యా రంగం నూతన పంథాలో దూసుకుపోతూ దేశానికి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. ఏపీలో నాడు-నేడు స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం 'పీఎం శ్రీ' స్కూళ్లకు ఇటీవల శ్రీకారం చుట్టింది. దేశంలో అన్ని వసతులతో 14,500కు పైగా స్కూళ్లను ఏర్పాటు చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. వసతులు, విద్యార్థుల నైపుణ్యాల పెంపు లక్ష్యంతో ఐదేళ్ల కాల పరిమితితో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని సంకల్పిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఏపీ తరహా మోడల్ అమలుకు ఉత్తరప్రదేశ్ కూడా అడుగులు ముందుకు వేస్తోంది.

- 75 జిల్లాల్లోని 15 వేల పాఠశాలల్లో అమలుకు శ్రీకారం
- కొద్ది రోజుల క్రితం ఏపీలో పర్యటించిన యూపీ అధికారులు
- పరీక్షలు, మధ్యాహ్న భోజనం, ఆంగ్ల మాధ్యమంపై ఆసక్తి
- ఫౌండేషనల్ స్కూళ్ల విధానం గురించి ఆరా
- నాడు–నేడు సహా పలు అంశాల ఆధారంగా నివేదిక



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. అటు కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని తమ ప్రాంత స్కూళ్లలో వాటి అమలుకు శ్రీకారం చుడుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా ఏపీలో ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతున్నారు. డిజిటల్ తరగతులు, ఇంగ్లిష్, సైన్సు ల్యాబ్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు. రూ.16 వేల కోట్లతో ప్రభుత్వ విద్యా సంస్థల రూపురేఖలు మారుస్తున్నారు. తొలివిడతలో 15,715 స్కూళ్లను సర్వాంగ సుందరంగా మార్చేశారు. రెండో విడత పనులూ ప్రారంభం అయ్యాయి.

సమగ్ర అధ్యయనంతో నివేదిక

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో ఏపీ మోడల్‌ను అమలు చేయాలని అక్కడి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. 75 జిల్లాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే 15 వేల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పనితీరును మెరుగు పరిచేందుకు శ్రీకారం చుట్టింది. ఉత్తరప్రదేశ్‌లోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయ్ కిరణ్ ఆనంద్ ఆదేశాల మేరకు యూపీ ఈఎల్టీఐ ప్రిన్సిపల్ స్కంద్ శుక్లా, ప్రొఫెసర్ కులదీప్ పాండేతో కూడిన ఇద్దరు విద్యా శాఖ అధికారుల బృందం కొద్ది రోజుల క్రితం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని విజయవాడ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు పాఠశాలలను సందర్శించింది. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్‌తో పాటు

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా

'చీకటిపై వెలుగుల' విజయానికి ప్రతీక దీపావళి



సాక్షి, అమరావతి: చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, చీకటిపై వెలుగుల ఆధ్యాత్మిక విజయానికి దీపావళి ప్రతీక అని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. దీపావళిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు గవర్నర్ శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి సందర్భంగా వెలిగించే దీపాలు.. దుష్ట ఆలోచనలను నాశనం చేయడానికి, చెడును నిర్మూలించి కొత్త శక్తిని, ఉత్సాహాన్ని నింపుతాయన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందన

36 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఇస్రో శాస్త్రవేత్తలను గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్ ఆదివారం ఓ ప్రకటనలో అభినందించారు. ఇస్రో చరిత్రాత్మక వాణిజ్య ఘట్టానికి శ్రీకారం చుట్టిందని ప్రశంసించారు. ఇలాంటి విజయాలు భవిష్యత్‌లో మరిన్ని సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రతి ఇంటా ఆనంద 'దీపావళి'

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి సీఎం జగన్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ సీఎం వైఎస్ జగన్ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిపై 'వెలుగు', చెడుపై 'మంచి', అజ్ఞానంపై 'జ్ఞానం', దుష్టశక్తులపై 'దైవశక్తి' సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలుగు ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని, దివ్వెల వెలుగులలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో విరాజిల్లాలని అభిలషించారు.

ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలి

అత్యంత బరువైన ఎల్‌వీఎం3–ఎం2 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి 36 ఉపగ్రహాలను కక్ష్యలో పెట్టిన ఇస్రో శాస్త్రవేత్తలను సీఎం జగన్ అభినందించారు. భవిష్యత్‌లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

విజయవంతంగా 'ఫ్యామిలీ డాక్టర్'

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకొస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ రన్ విజయవంతంగా కొనసాగుతోందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ప్రారంభించిన ట్రయల్ రన్‌లో తొలిరోజు 572 మంది ప్రభుత్వ డాక్టర్లు, 82 మంది 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ) వైద్యులు గ్రామాల్లో వైద్యసేవలు అందించినట్టు వివరించారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలకు సూచించారు.

ముగిసిన ఆయుర్వేద వారోత్సవాలు

ఆయుష్ కమిషనర్ రాములు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ఆయుష్ డిస్పెన్సరీల్లో ఈ నెల 17 నుంచి 23 వరకు ఆయుర్వేద వారోత్సవాలు నిర్వహించినట్టు కమిషనర్ రాములు ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఆదివారం డిస్పెన్సరీల్లో ధన్వంతరి పూజ చేసినట్లు తెలిపారు. 'ప్రతిరోజు.. ప్రతి ఇంటా.. ఆయుర్వేదం' నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. చిన్నచిన్న రుగ్మతలకు ఇంట్లోనే తయారు చేసుకోగలిగే ఆయుర్వేద మందులపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అవగాహన సదస్సుల్లో సుమారు 17,000 మంది పాల్గొన్నారని.. మెడికల్ క్యాంపులలో 12,500 మంది వైద్యం పొందారని పేర్కొన్నారు.

ఒకటి నుంచి పట్టణ సర్వే పనులు

- ఆస్తిదారులకు నోటీసుల జారీకి నిర్ణయం
- 123 స్థానిక సంస్థలకు సరిహద్దుల గుర్తింపు
- 648 గ్రామాల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు
- ఆరు నెలల్లో సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని నిర్ణయం
- రికార్డుల్లో 38 లక్షల ఆస్తులు.. ఇందులో మరో 10 శాతం పెరిగే అవకాశం



సాక్షి, అమరావతి : పట్టణ ఆస్తుల సమగ్ర భూ హక్కు సర్వే పనులను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ వేగవంతం చేసింది. నవంబర్ ఒకటో తేదీ నుంచి ఆయా నగరపాలక, పురపాలక సంస్థల పరిధిలోని ఆస్తుల హక్కుదారులకు నోటీసులు జారీచేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్రస్తుతమున్న రికార్డుల ప్రకారం ఆస్తులు, వాటి యజమానుల గుర్తింపు ప్రక్రియ కూడా కొలిక్కి వచ్చింది. మొత్తం 123 స్థానిక సంస్థల్లో 38 లక్షల ఆస్తులున్నాయని, సర్వేలో మరో పది శాతం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రజల ఆస్తులను సర్వేచేసి, సరిహద్దులను గుర్తించి హక్కుదారుకు సమగ్రమైన వివరాలతో కూడిన హక్కు పత్రం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకం' ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా పట్టణాల్లోని ఆస్తుల సర్వే ప్రక్రియను పురపాలక శాఖ చేపట్టింది. ఇప్పటికే 20 వేల మంది వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలతో పాటు ఇతర మున్సిపల్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇప్పించారు. ప్రతి వార్డుకి ఐదుగురు సర్వే సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు.

648 గ్రామాల రికార్డులు పరిశీలన

పట్టణాల్లో జరుగుతున్న భూ ఆక్రమణలతోపాటు ఒకే స్థలం లేదా ఇల్లు రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేయడం వంటి సమస్యలు లేకుండా ఆయా ఆస్తిదారులకు నమ్మకమైన గుర్తింపు పత్రం ఇచ్చేందుకు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ఆస్తుల సర్వేకు సిద్ధమైంది. ఈ ప్రక్రియ పూర్తయినట్లయితే వ్యవసాయ భూములకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఉన్నట్లుగానే. పట్టణాల్లోని స్థలాలు, ఇళ్లకు కూడా గుర్తింపు కార్డులు ఇవ్వడంతోపాటు ఆస్తులకు సమగ్రమైన రికార్డులు సిద్ధమవుతాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 123 నగర, పురపాలక సంఘాలు ఉండగా, వాటిల్లో వందలాది గ్రామాలు చేరాయి. దాంతో పట్టణాల్లో విలీనమైన 648 గ్రామాల రికార్డులు, ప్రస్తుతమున్న రికార్డులతో సరిపోల్చి ఏ ఆస్తి ఎవరి పేరిట నమోదైందో పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారు. సర్వేతో పాటు రెవెన్యూ రికార్డులు, ప్లానింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ కమిషనరేట్‌లో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ (పీఎంయూ)ను ఏర్పాటుచేశారు. ఇందులో రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, సర్వే విభాగాల సిబ్బందితో పాటు మున్సిపల్ సిబ్బందిని నియమించారు. ఇదే తరహాలో 123 మున్సిపాలిటీల్లోనూ పీఎంయూ విభాగాలను ఏర్పాటుచేయనున్నట్లు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) ప్రవీణ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. నవంబర్ ఒకటి నుంచి ఆస్తుల యజమానులకు నోటీసులు జారీ ప్రక్రియ చేపట్టనున్నట్లు చెప్పారు. యజమానుల నుంచి అభ్యంతరాలను సైతం తీసుకుని, వాటిని పరిష్కరించి మొత్తం సర్వే పనులను ఆరు నెలల్లో పూర్తిచేయనున్నట్లు ఆయన వివరించారు.

రికార్డుల్లో 38 లక్షల ఆస్తులు

ఇక ప్రస్తుతం స్థానిక సంస్థల్లో ఉన్న సర్వే నంబర్లు, ఆస్తి పన్ను చెల్లిస్తున్న డేటా ప్రకారం 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 31 లక్షల ఆస్తులు, ఏడు లక్షల ఖాళీ స్థలాలున్నట్లు మున్సిపల్ శాఖ గుర్తించింది. అయితే, సర్వే ప్రక్రియ మొదలైతే రికార్డుల్లోకి రాని ఆస్తులు మరో 10 శాతం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వేలో భవనాలు, రోడ్లు, చెరువులు, కాలువలు, ఖాళీ స్థలాలు.. వేటికవి ప్రత్యేకంగా గుర్తించి డేటా తయారుచేస్తున్నారు. అందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సైతం రూపొందిస్తున్నారు. గత ప్రభుత్వాలు పురపాలక సంఘాల్లో పన్నుల వసూళ్లపై పెట్టిన దృష్టి ఆస్తుల గుర్తింపుపై పెట్టకపోవడంతో కొనుగోళ్లు, అమ్మకం రిజిస్ట్రేషన్ సమయంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇకపై ఈ తరహా సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సమగ్రంగా సర్వే ప్రక్రియను నిర్వహించనున్నారు. ఇప్పటికే అన్ని స్థానిక సంస్థలకు సంబంధించి సరిహద్దుల సర్వేను పూర్తిచేశామని, సర్వేలో పాల్గొనే సిబ్బందికి మూడంచెల్లో మొత్తం 20 వేల మందికి శిక్షణ ఇచ్చామని రీ సర్వే ప్రత్యేకాధికారి బి.సుబ్బారావు 'సాక్షి'కి తెలిపారు. ఆస్తుల రికార్డులను సమగ్రంగా ఆన్‌లైన్ చేస్తున్నట్లు ఆయన వివరించారు.

రూ.300 కోట్లతో రిబ్బన్ కంపెనీ ఏర్పాటు చేస్తాం

8వ వార్షికోత్సవంలో రిబెస్ట్ రిబ్బన్ కంపెనీ డైరెక్టర్ స్టీవ్ ప్రకటన



రిబ్బన్ కంపెనీ వార్షికోత్సవంలో స్టీవ్

అచ్యుతాపురం (అనకాపల్లి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం–రాంబిల్లి సెజ్‌లో యమ రిబ్బన్ కంపెనీని రూ.300 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు రిబెస్ట్ రిబ్బన్ కంపెనీ (బౌస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) డైరెక్టర్ స్టీవ్ చెప్పారు. కంపెనీ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సంస్థ ఉద్యోగులతో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్టీవ్ మాట్లాడుతూ.. యమ రిబ్బన్ కంపెనీలో రెండు వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని తెలిపారు. కాగా రిబెస్ట్ కంపెనీలో 400 రకాల రిబ్బన్లు, బౌస్‌లను తయారు చేస్తున్నారు. కంపెనీకి అనుబంధంగా ఏర్పాటు చేయనున్న యమ రిబ్బన్ కంపెనీకి వచ్చేనెలలో శంకుస్థాపన చేయనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ భారత్ డైరెక్టర్ శివ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జేసీల పరిధిలోనూ 'వెబ్‌ల్యాండ్' సమస్యల పరిష్కారం

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లా జాయింట్ కలెక్టర్లకు సైతం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే నంబర్లు మిస్ అవడం, 22ఏ కేసుల్లో ప్రభుత్వభూమి నుంచి ప్రైవేటు భూమిగా మార్చడం, సివిల్, రెవెన్యూ కోర్టులు ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా చేయాల్సిన మార్పులతో పాటు భూసమీకరణ, భూ యాజమాన్య మార్పు, భూముల కేటాయింపునకు సంబంధించి మార్పులను జేసీల లాగిన్ నుంచి చేసేందుకు తాజాగా అవకాశం కల్పించారు. ఇందుకనుగుణంగా వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేస్తున్నారు. జేసీలు ఈ మార్పులు చేసేముందు నిబంధనల ప్రకారం అన్ని విషయాలు పరిశీలించాలని, ఎందుకు మార్పు జరుగుతుందో వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన తర్వాతే మార్పులు చేసేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు సీసీఎల్‌ఏ సాయిప్రసాద్ ఇటీవల సర్క్యులర్ జారీ చేశారు.

ఆ కేంద్రాలతో రైతులకు భరోసానే..

- రైతుభరోసాపై 'ఈనాడు'ది విషప్రచారం
- గ్రామస్థాయిలో 10,778 ఆర్బీకేల ఏర్పాటు
- ఇప్పటిదాకా 42.22 లక్షల మంది రైతులకు వాటి ద్వారా మేలు
- రూ.157.97 కోట్ల విలువైన 23.74 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు..
- 18.28 లక్షల మంది రైతులకు రూ.744.25 కోట్ల విలువైన ఎరువుల పంపిణీ
- ఇవన్నీ రైతుభరోసా కేంద్రాల నుంచే సరఫరా
- 'ఈనాడు' రాతలను ఖండించిన వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసి రైతులకు అనేక రకాలుగా మేలు చేస్తుంటే ఈనాడు దినపత్రిక తప్పుడు కథనాలు ప్రచురిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై విషప్రచారం చేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేకకమిషనర్ హరికిరణ్ మండిపడ్డారు. రైతులకు అవసరమైన అన్నిరకాల సేవలను సత్వరమే అందించేందుకు గ్రామస్థాయిలో ఏర్పాటుచేసిన రైతుభరోసా కేంద్రాలతో లక్షలాది మంది రైతులు లబ్ధిపొందుతున్నారని ఆయన తెలిపారు. ఆదివారం 'ఈనాడు'లో 'రైతుకు భరోసా ఏది'.. శీర్షికతో ప్రచురించిన వార్తను తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని అనేక రాష్ట్రాలతోపాటు అంతర్జాతీయంగా పలు దేశాలు రాష్ట్రంలోని ఆర్బీకేలను మోడల్‌గా తీసుకుని అమలుచేస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించడానికి, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం గ్రామస్థాయిలో 10,778 ఆర్బీకేలను ఏర్పాటుచేసి వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి నాణ్యమైన ఉత్పాదకాలు అందించడంతో పాటు రైతులకు అవసరమైన విజ్ఞానాన్ని వాటి ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. అలాగే ఆయన ఇంకా ఏం చెప్పారంటే..

- ఆర్బీకేల ద్వారా 42.22 లక్షల మంది రైతులకు రూ.157.97 కోట్ల విలువైన 23.74 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను, 18.28 లక్షల మంది రైతులకు రూ.744.25 కోట్ల విలువైన 6.69 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను పంపిణీ చేశాం.
- 1.5 లక్షల మంది రైతులకు రూ.14.01 కోట్ల విలువైన 1.36 లక్షల లీటర్ల పురుగు మందులను కూడా అందించాం.
- ఎరువుల లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా ఖర్చుల కోసం ఒక్కో బస్తాకు రూ.20 ఆదా అవుతోంది. ఆ లెక్కన గడిచిన రెండేళ్లలో పంపిణీ చేసిన 6.69 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా ద్వారా రైతులకు రూ.27 కోట్లు ఆదా అయింది.
- ఆర్బీకేల్లో 6,321 మంది వ్యవసాయ, 2,356 ఉద్యాన, 378 మంది పట్టు, 4 వేల మందికి పైగా పశు సంవర్థక, 756 మంది మత్స్య సహాయకులు పనిచేస్తుండగా, మిగిలిన పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ ద్వారా చర్యలు చేపట్టాం.
- 9,277 మంది బ్యాంకు సహాయకులను ఆర్బీకేలకు అనుసంధానం చేసి గ్రామస్థాయిలోనే ఎక్కడికక్కడ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం.
- ఆర్బీకేల ద్వారా 1.59 కోట్ల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులను 18.18 లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేశాం.
- 4.75 లక్షల కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను జారీచేసి రూ.3,595 కోట్ల రుణాలను పంపిణీ చేశాం.
- 34,550 మంది రైతులతో కమ్యూనిటీ హైరింగ్ గ్రూపులను ఏర్పాటుచేసి రూ.240.67 కోట్ల సబ్సిడీతో యంత్ర పరికరాలు అందించాం.

..ఇలాంటివెన్నో రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నా 'ఈనాడు' పత్రిక వాటిని పట్టించుకోకుండా తప్పుడు కథనాలను ప్రచురించడం తగదని హరికిరణ్ హితవు పలికారు.

ఏపీ బడిబాటలో యూపీ

▶ మొదటి పేజీ తరువాయి

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని స్వయంగా పరిశీలించింది. ఏపీలో అమలుచేస్తున్న విద్యాభివృద్ధి కార్యాక్రమాలను అధ్యయనంచేసి, అక్కడి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలన్నింటినీ ఆ నివేదికలో పొందుపరిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని 44,512 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మూడేళ్ల క్రితం ఆంగ్ల మాధ్యమ పాఠశాలలుగా మారడంతోపాటు కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు చేపట్టిన నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి, ఆంగ్లమాధ్యమం, బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్ వంటి కార్యక్రమాల గురించి నివేదించారు. పాఠశాలల నిర్వహణ ఎలా ఉందో స్పష్టంగా వివరించారు. కొత్తగా పాఠశాలల్లో ప్రవేశ పెడుతున్న ఫౌండేషనల్ స్కూళ్ల విధానం గురించి కూడా పేర్కొన్నారు.

పరీక్షల విధానమూ భేష్..

ఏపీలోని పరీక్షల విధానం చాలా బాగుందని కమిటీ పేర్కొంది. విద్యార్థులకు ప్రతి మూడు నెలలకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్, ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమ్మేటివ్ అసెస్‌మెంట్ ఉంటుంది. యూపీలో ఆరు నెలలకు ఒకసారి, చివరి పరీక్షల ద్వారా విద్యార్థులను సంవత్సరానికి రెండుసార్లు మాత్రమే అంచనా వేస్తారు. ఏపీలో ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సబ్జెక్టుల వారీగా బోధన ఉండగా, ఇప్పుడు ఫౌండేషనల్ విధానంలో 3వ తరగతి నుంచి ఈ బోధన అందుబాటులో ఉంటుంది.

బదిలీల్లో పారదర్శకత

ఉపాధ్యాయుల బదిలీలు, పోస్టింగ్‌లు పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉన్నాయని కమిటీ పేర్కొంది. ఎటువంటి మాన్యువల్ జోక్యం లేదని, అవినీతికి ఆస్కారం లేదని వివరించింది. 1–5 తరగతుల విద్యార్థుల కోసం డిజిటల్ తరగతులకు వీలుగా స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ప్యానెల్‌లు ఏర్పాటు చేయిస్తున్నారని, ఆన్‌లైన్ బోధనా విధానంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో బోధనకు ఏర్పాట్లు చేశారని నివేదికలో పేర్కొన్నారు.

నాడు–నేడు అద్భుతం

2019–20 నుండి మూడేళ్ల వ్యవధిలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, పాఠశాలల్లోని ప్రస్తుత మౌలిక సదుపాయాలను మిషన్ మోడ్‌లోకి మార్చడానికి 'నాడు–నేడు' మోడల్‌తో అమలు చేస్తున్న కార్యక్రమాలు చాలా అద్భుతంగా ఉన్నాయని యూపీ బృందం పేర్కొంది. రన్నింగ్ వాటర్‌తో టాయిలెట్లు, తాగునీటి సరఫరా.. పెద్ద, చిన్న మరమ్మతులతో పాటు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుదీకరణ, విద్యార్థులు.. సిబ్బందికి ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డ్‌లు, పాఠశాల భవనాలకు పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్‌లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం చేపట్టారని. వివిధ శాఖల సమన్వయం ద్వారా ఈ పనులు చేస్తున్నారని వివరించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, పాఠశాల విద్య, పంచాయతీ రాజ్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, గిరిజన సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, జువైనల్ సంక్షేమం, మత్స్య శాఖలతో సహా వివిధ శాఖల పరిధిలోని మొత్తం 44,512 పాఠశాలలను నాడు–నేడు ప్రాజెక్ట్ కవర్ చేస్తున్నట్లు నివేదికలో పొందుపరిచారు. ఈ నివేదికలోని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని పాఠశాలల్లో సంస్కరణలు చేపట్టేందుకు అక్కడి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

సత్వరమే ఫిర్యాదుల పరిష్కారం

- ఐదు సేవలపై 104 కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదుల స్వీకారం
- జూన్‌లో ప్రారంభించిన వైద్య శాఖ
- ఇప్పటివరకు 6,336 ఫిర్యాదులు
- నిర్దేశిత సమయంలోగా 5,918 సమస్యల పరిష్కారం



104 కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులు ఇలా..

అంశం	ఫిర్యాదులు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా	4,740
108 అంబులెన్స్	1,366
104 ఎంఎంయూ	143
వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్	59
మహాప్రస్థానం	28

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్య సేవల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే ప్రజలు ఫిర్యాదు చేయడానికి వీలుగా ప్రవేశపెట్టిన 104 కాల్‌సెంటర్ చక్కగా పనిచేస్తోంది. సత్వరమే ఫిర్యాదులను పరిష్కరిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో 104 కాల్ సెంటర్‌ను వైద్య శాఖ ఏర్పాటు చేయగా ఇప్పటివరకు 6,336 ఫిర్యాదులు అందాయి. ఇందులో 5,918 ఫిర్యాదులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించారు. మరో 235 ఫిర్యాదులు నిర్దేశిత సమయానికి కొంత ఆలస్యంగా పరిష్కారమయ్యాయి. కాల్‌సెంటర్‌లో 30 మంది సిబ్బంది 24/7 పనిచేస్తున్నారు. వీరు కాల్ సెంటర్‌కు వచ్చిన సమస్యలు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు.

ఐదు సేవలపై ఫిర్యాదులకు..

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి వైద్య రంగంపై రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తోంది. అయితే ఒకటి రెండు చోట్ల అధికారుల ఉదాసీన వైఖరి, క్షేత్ర స్థాయి సిబ్బంది, ఆస్పత్రుల యాజమాన్యాల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైద్య సేవలను పొందడంలో ఎక్కడైనా సమస్యలు, ఇబ్బందులు తలెత్తితే ప్రజలు ఫిర్యాదు చేయడానికి 104 ఫిర్యాదుల కాల్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ–ఆరోగ్య ఆసరా, 104 మొబైల్ మెడికల్ యూనిట్స్ (ఎంఎంయూ), 108 అంబులెన్స్, వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, మహాప్రస్థానం ఈ ఐదు సేవలపై ఫిర్యాదులు స్వీకరించడం ప్రారంభించారు. కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులను తీవ్రతను బట్టి ఎంత సమయంలోగా పరిష్కరించాలి.. పరిష్కరించడానికి బాధ్యులు ఎవరనే దానిపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని రూపొందించారు. 104 కాల్ సెంటర్ సేవలను ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం, ఇతర సేవలపై ఫిర్యాదుల స్వీకారం దిశగా విస్తరించనున్నారు. ఈ మేరకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఫిర్యాదులు ఇలా చేయొచ్చు..

- ఐదు సేవల్లో ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేయాలనుకుంటే తొలుత 104కు కాల్ చేయాలి.
- కాల్ చేసిన వెంటనే వైద్య సేవలపై ఫిర్యాదుల కోసం 1, సమాచారం కోసం 2 నొక్కాలని ఐవీఆర్ఎస్ సూచిస్తుంది.
- అప్పుడు ఫిర్యాదులు చేయాల్సినవారు 1 నొక్కాలి.
- అనంతరం కాల్ సెంటర్‌లోని ఎగ్జిక్యూటివ్ ఫిర్యాదు స్వీకరిస్తారు.

ఉన్నత స్థాయిలో పర్యవేక్షణ..

కాల్‌సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు, వాటి పరిష్కారంపై డ్యాష్‌బోర్డ్ ద్వారా ఉన్నత స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులను ఎస్‌వోపీలో నిర్దేశిత సమయంలోగా పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ డిప్యూటీ ఈవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లోని హెల్ప్ డెస్క్‌లు, 104 ఎంఎంయూ, 108 అంబులెన్స్, మహాప్రస్థానం వాహనాలపై ఫిర్యాదుల నంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు తలెత్తితే ఆ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రామాయపట్నం రయ్.. రయ్..

▶ మొదటి పేజీ తరువాయి

మొత్తం 594 కుటుంబాలను ఖాళీ చేయించనున్నారు. తొలి దశలో మొండివారిపాలెం, ఆవులవారిపాలెంకు చెందిన 220 కుటుంబాలకు మంగళవారం నుంచి పరిహారం చెక్కుల పంపిణీ ప్రారంభించనున్నారు. పునరావాస ప్యాకేజీ కింద ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.9.96 లక్షలు, 5 సెంట్ల భూమిని ఇవ్వనుంది. ఒక కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ఆడ లేదా మగ పిల్లలు ఉన్నా, లేక పెద్ద వయసుఉన్న తల్లిదండ్రులు ఉన్నా.. వారిని వేరే కుటుంబాలుగా లెక్కించి పరిహారం అందించడాన్ని గ్రామస్తులు స్వాగతిస్తున్నారు. ఈ విధంగా 594 ఇళ్లకు గాను సుమారు 675 కుటుంబాలుగా పరిగణించి, పునరావాస ప్యాకేజీ అందిస్తున్నారు. ఇంటి విస్తీర్ణం ప్రకారం విలువ లెక్కించి మార్కెట్ విలువ కంటే రెట్టింపు పరిహారం ఇస్తున్నారు. పునరావాస ప్యాకేజీ కింద రూ.160 కోట్ల వరకు చెల్లించాల్సి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది.

23 ఎకరాల్లో పునరావాస గ్రామ నిర్మాణం

రామాయపట్నం పోర్టుకు సమీపంలోని తెంటు గ్రామం వద్ద ప్రభుత్వం 23 ఎకరాల్లో పునరావాస గ్రామాన్ని అభివృద్ధి చేస్తోంది. ప్రతి కుటుంబానికి 5 సెంట్ల భూమి చొప్పున 675 మందికి కేటాయిస్తూ.. ఇందుకు అనుగుణంగా రహదారులు, విద్యుత్, తాగునీరు, మురుగు నీటి సరఫరా వంటి మౌలిక సౌకర్యాలు కల్పిస్తోంది. దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, పాఠశాల, వైద్యశాల, కమ్యూనిటీ భవనాలు వంటి అన్ని సదుపాయాలు ఉండేలా ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోంది. కేవలం మౌలిక వసతుల కల్పనకే రూ.19 కోట్లు వ్యయం చేస్తోంది. ఇప్పటికే 23 ఎకరాలను చదును చేసి, ప్లాట్లుగా విభజించే కార్యక్రమం మొదలు పెట్టారు. గ్రామస్తులు తామే ఇంటిని నిర్మించుకుంటామని చెప్పడంతో ఆ విధంగా పునరావాస ప్యాకేజీ అందిస్తున్నామని, రెండు గ్రామాల ప్రజలు దీనికి అంగీకరిస్తూ సంతకాలు చేసినట్లు రామాయపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రతాప్ రెడ్డి తెలిపారు.

రూ.3,600 కోట్లతో పోర్టు అభివృద్ధి

సుమారు రూ.3,600 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు తొలిదశలో నాలుగు బెర్తుల నిర్మాణానికి రూ.2,634 కోట్ల విలువైన పనులకోసం అరబిందో నవయుగ గ్రూపు భాగస్వామ్య కంపెనీ టెండర్ దక్కించుకుంది. ఇందులో ఒకటి కేవలం బొగ్గు దిగుమతికి సంబంధించిన కోల్ బెర్తు కాగా, మిగతా మూడు మల్టీమోడల్ బెర్తులు. ఇప్పటికే 850 ఎకరాల భూమిలోని చెరువులను పూడ్చి చదును చేయడంతో పాటు, పోర్టులో కీలకమైన బ్రేక్‌వాటర్ పనులు చేపట్టారు. ఉత్తర, దక్షిణాలకు చెందిన బ్రేక్ వాటర్ పనులు అర కిలోమీటరు పైగానే పూర్తయ్యాయి. త్వరలో డ్రెడ్జింగ్‌తో పాటు, భవన నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధిపై దృష్టి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా కొత్తగా నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టారు. గత ప్రభుత్వం వలే శంకుస్థాపనలకు పరిమితం కాకుండా, రామాయపట్నం పోర్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పోర్టుకు ఆనుకొనే రూ.43,000 కోట్లతో ఇండోసోల్ భారీ సోలార్ విద్యుత్ ఉపకరణాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. త్వరలోనే మచిలీపట్నం, భావనపాడు పోర్టు పనులు కూడా ప్రారంభిస్తాం.

– గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమలు, పెట్టుబడుల శాఖ మంత్రి

గత ప్రభుత్వం సర్వే కూడా చేయలేదు



గత ప్రభుత్వం ఎన్నికల ముందు రామాయపట్నం పోర్టు పైలాన్ ఆవిష్కరించి వెళ్లిపోయింది. ఏ ఒక్క అనుమతి రాలేదు. సర్వే కూడా చేయలేదు. ఈ ప్రభుత్వం పర్యావరణ అనుమతులతో సహా అన్ని తెచ్చి, భూ పరిహారం ఇచ్చిన తర్వాత పనులు ప్రారంభించింది. గత మూడు నెలలుగా పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. అనేక మంది స్థానికులకు ఉపాధి లభిస్తోంది. పోర్టు ప్రారంభమైన తర్వాత విద్యార్హతలను బట్టి 50 శాతం ఉద్యోగాలు స్థానిక గ్రామ ప్రజలకే ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ బాగా ఇవ్వడం వల్లే గ్రామాన్ని ఖాళీ చేయడానికి అంగీకరించాం.

– కొల్లూరి సుధాకర్, స్థానిక రైతు, మొండివారిపాలెం

వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి తొలిషిప్



నిర్దేశిత లక్ష్యం కంటే ముందుగానే పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 2023 డిసెంబర్ నాటికి తొలి ఓడను రామాయపట్నం పోర్టుకు తీసుకొస్తాం. తొలి దశలో నాలుగు బెర్తులకు అదనంగా మరో క్యాపిటివ్ బెర్త్ నిర్మాణం కోసం చర్చలు జరుగుతున్నాయి. వర్షాకాలం ముగియడంతో పనుల్లో వేగం మరింత పెంచుతాం.

– ప్రతాప్ రెడ్డి, ఎండీ, రామాయపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్

కొంచెం బాధ.. అంతకంటే ఎక్కువ సంతోషం

నాలుగు తరాలుగా ఇక్కడే ఉంటున్నా. గతంలో తుపాను సమయంలో ఇండ్లు కూలిపోతే రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారు. అటువంటి గ్రామాన్ని ఖాళీ చేయాలంటే కొంచెం బాధగా ఉన్నప్పటికీ, ఈ పోర్టు వల్ల అందరం అభివృద్ధి చెందుతామని రెట్టింపు ఆనందంగా ఉన్నాం. చివరి రోజు గ్రామస్తులందరం రాములోరి సంబరం చేసుకొని కలశం తీసుకొని తెంటు గ్రామానికి వెళ్లిపోతాం.

– పోలయ్య, గ్రామపెద్ద, మొండివారిపాలెం



Reliance
Reliance digital
PERSONALISING TECHNOLOGY
మై కైండ్ ఆఫ్ దీవాలి ఆఫర్స్
ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్
NOW OPEN AT:
• LEPL CENTRO MALL, OPP HOTEL FORTUNE MURALI
• PATAMATA, OPP DURGA MAHAL THEATER
STORE OPENS AT 9AM
10% ఇన్‌స్టెంట్ డిస్కౌంట్*
AXIS BANK
citi
HDFC BANK
ICICI Bank
IndusInd Bank
kotak
₹5 000* డిస్కౌంట్
10% డిస్కౌంట్ వౌచర్*
తదుపరి కొనుగోలుపై రెడీమ్ చేసుకోవచ్చు
₹5 000* డిస్కౌంట్
TELEVISIONS
3 Year
OLED
Neo QLED
SAMSUNG
FREE**
Samsung Galaxy S22 Ultra worth ₹131999
LG
FREE**
106 cm (42) OLED worth ₹139990
*On select OLEDs
SONY
UP TO 30% INSTANT CASHBACK*
*Up to ₹25000/-
81 CM (32) HD ₹7990*
109 CM (43) ANDROID ₹14990*
139 CM (55) QLED ₹36990*
165 CM (65) UHD ₹49990*
BPL Hisense OnePlus TCL
MAX 20% CASHBACK UP TO ₹20000/-*
HDFC BANK citibank SBI card
HOME APPLIANCES
SAMSUNG
Up to 20% cashback*
Free* Galaxy devices
on select models*
LG
Up to 20% cashback*
(On select debit/credit cards)
Free Direct Cool Worth ₹22299*
on Side-by-side Refrigerator*
REFRIGERATORS & WASHING MACHINES
SIDE BY SIDE Starting from ₹41990*
FRONT LOAD Starting from ₹17990*
LAPTOPS
Laptops starting from
Windows 11
AMD
INTEREST FREE EMI
GAMING
CORE i5 ₹49 999*
AMD R5 ₹53 999*
AMD R7 ₹65 999*
THIN & LIGHT
CORE i3 ₹24999*
CORE i5 ₹38999*
AMD R5 ₹41999*
CONVERTIBLE
CORE i3 ₹49999*
AMD R5 ₹58999*
CORE i5 ₹63999*
SMART SIM
CORE i3 ₹39999*
CORE i5 ₹48999*
100 GB JIO DATA WORTH ₹1500 FREE**
APPLE
MACBOOK AIR ₹82900*
MACBOOK PRO ₹1 08 900*
MACBOOK M1P ₹1 63 499*
ASUS DELL hp Lenovo SAMSUNG
*Prices Inclusive of Cashback
WEARABLES
SMART WATCH Starting from ₹999
BLUETOOTH CALLING WATCH Starting from ₹1499
WATCH Starting from ₹14990*
amazfit boAt FIRE-BOLTT GIZMORE noise SAMSUNG
SMARTPHONES
LIMITED PERIOD OFFER
iPhone 12 (64 GB) ₹45990*
iPhone 12 (128 GB) ₹49990*
iPhone 14 Plus (128 GB) ₹84900*
*Prices include HDFC bank cashback
SAMSUNG | 5G DEALS
M13 5G 6/128 ₹15999 ₹13999*
*Price post in-store discount & SBI card cashback
S22 Starting from ₹52999*
S22+ Starting from ₹59999*
S22 ULTRA Starting from ₹91999*
*Price post upgrade & cashback
New Launch
VIVO V25 SERIES Starting from ₹27999*
*Additional bank cashback of 10% upto ₹2500 on CC/DC transactions
OnePlus
9 5G ₹49999 Starting from ₹31999*
9 Pro 5G ₹64999 Starting from ₹42999*
*Price post bank cashback, Additional bank cashback of 10% upto ₹2500 on CC/DC transactions
SHOP ANY ELECTRONICS AT MY JIO STORE
Jio DIGITAL LIFE
1000 ఇన్‌స్టెంట్ డిస్కౌంట్
MobiKwik Paytm PhonePe
resQ
పర్సనలైజ్డ్ గైడెన్స్ | సర్వీస్ | మెయింటైనెన్స్
1800 889 1044 Download the resQ app on
reliancedigital.in
VISIT US AT VIJAYAWADA : • PATAMATA, GROUND & FIRST FLOOR, SRI CHAKRA TOWERS, OPP DURGA MAHAL THEATER PH: 0866-2466000 | 6301970107 • VIJAYAWADA: LEPL CENTRO MALL, MG ROAD, OPP HOTEL FORTUNE MURALI, BACK SIDE OF LIFESTYLE, LABBIPET PH: 0866-2466603/2466604 • VIJAYAWADA: BHAVANIPURAM, ADJACENT TO SRIRASTU FUNCTION HALL, CHURCH CENTER PH: 0866-2417013/14 • VIJAYAWADA: TADEPALLI, NEAR PATHUR CROSSROADS, MAIN ROAD, TADEPALLI, PH: 6281113898 | 8074582587 • VIJAYAWADA: ENIKEPADU, NH 5 OPP: SRI SHAKTI PELLI PANDIRI PH: 0866-2843355/56 • ALSO VISIT US AT: VIJAYAWADA | VIZAG | TIRUPATI | NELLORE | RAJAHMUNDRY | KAKINADA | GUNTUR | ADONI | MADANAPALLI | CHITTOOR | KADAPA | PRODDATUR | ANANTHAUR | GUNTAKAL | KURNOOL | PIDUGURALLA | ONGOLE | CHIRALA | ELURU | VIZIANAGARAM | TADEPALLIGUDEM | BHEEMAVARAM | ANAKAPALLI | AMALAPURAM | NARSARAOPETA | TO LOCATE YOUR NEAREST MYJIO STORE SMS LOCATE <PINCODE> TO 56161



మీరు ఎవరినైనా ప్రేమించినప్పుడు, ఆ వ్యక్తి ఎలా ఉన్నారో అలాగే ప్రేమిస్తారు. అంతేగానీ మీరు ఎలా ఉండాలనుకుంటున్నారో అలా కాదు.

– లియో టాల్‌స్టాయ్

సాక్షి

సోమవారం, అక్టోబర్, 24

గ్రహణాలు వీడాలి!

దీపాలు లేని లోకాన్ని ఊహించగలమా? దీపాలే లేకుంటే రోజులో సగం చీకటిమయమయ్యేది; జీవితాల్లో సగం అంధకారబంధురమయ్యేది. నాగరకత ఇంకా నత్తనడకనే కొనసాగే లోకంలో అలముకున్న తిమిరాన్ని తరిమికొట్టేవి దీపాలే! నిప్పు రాజెయ్యడం నుంచి వివిధ తైలాలతో ప్రమిదలను నింపి దీపాలు వెలిగించడం వరకు సాగిన పరిణామ క్రమానికి సహస్రాబ్దాల కాలం పట్టింది. విద్యుద్దీపాలను కనుగొన్న తర్వాత నాగరకత విద్యుద్వేగాన్ని పుంజుకుంది.

'దీపం జ్యోతి పరబ్రహ్మ' అంటూ దీపాన్ని పరబ్రహ్మ స్వరూపంతో పోల్చారు మన పూర్వులు. పరంజ్యోతి అంటే పరబ్రహ్మమే! మనుషుల్లో అజ్ఞానం తొలగిపోవాలంటే, జ్ఞాన దీపాలను వెలిగించాల్సిందే! దీపావళి పండుగ గురించి అనేక పురాణగాథలు ప్రచారంలో ఉన్నాయి. వాటిలో నరకాసుర వధకు సంబంధించిన గాథ ప్రసిద్ధమైనది. రావణ వధా నంతరం రాముడు అయోధ్యకు చేరుకుని ఈరోజే పట్టాభిషిక్తుడయ్యాడనే గాథ ప్రచారంలో ఉంది. బలి చక్రవర్తిని వామనుడు ఇదేరోజు పాతాళానికి అణగదొక్కాడని పురాణాల్లో ఉంది. దీపావళి ముందురోజు చతుర్దశినాడు యమధర్మరాజును దీపాలు పెట్టి పూజించితే పితృదేవతలు నరక విముక్తులవుతారని, అందువల్లనే దీనికి 'నరక చతుర్దశి'గా పేరు వచ్చిందని కూడా చెబుతారు. పితృదేవతలను నరక విముక్తులను చేసే పర్వదినంగానే దీపావళిని జరుపుకోవడం మొదలైందని సురవరం ప్రతాపరెడ్డి 'హిందువుల పండగలు'లో అభిప్రాయపడ్డారు. ఆరుద్ర కూడా సురవరం అభిప్రాయాన్నే బలపరుస్తూ 'వాస్తవానికి నరకాసురుడికీ, దీపావళికి సంబంధం లేదు. బలి చక్రవర్తితో కొంత సంబంధం ఉంది' అంటూ 'వ్యాసపీఠం'లో ప్రాచీన ధర్మశాస్త్ర గ్రంథాలను ఉటంకిస్తూ రాశారు. నరకాసుర వధ తదితర గాథలను తదనంతర కాలంలోనే దీపావళికి ఆపాదించుకున్నారని అనుకోవచ్చు. కథలూ గాథలూ ఎలా ఉన్నా, జనాలందరూ వేడుకగా జరుపుకొనే పండుగ దీపావళి.

దీపావళికి మన సంస్కృతిలోనే కాదు, దేశంలోని వివిధ భాషల సాహిత్యంలోనూ ఇతోధిక స్థానం ఉంది. దీపావళి ఆలంబనగా కొందరు హర్షాతిరేకాలను ప్రకటిస్తే, మరికొందరు నిరాశా నిర్వేదాలను పలికించారు. పురాణ ప్రబంధ సాహిత్యాల్లో దీపావళి వర్ణన పెద్దగా కనిపించదు గాని, ఆ తర్వాత వెలువడిన సాహిత్యంలో దీపావళి ప్రస్తావన కనిపిస్తుంది. 'గౌతమీ కోకిల' వేదుల సత్యనారాయణశాస్త్రి తొలికావ్యం 'దీపావళి'. 'లోన జ్వలియించు చున్న మహానలమున/ కొక స్ఫులింగమె కాద యీ యుత్సవాగ్ని/ శైశవమ్మాది ప్రేమ శ్మశానమైన/ జీవి కొకనాటి కేటి దీపావళి యిక' అంటూ నిర్వేదాన్ని పలికిస్తారు. సరిగా అరవయ్యేళ్ల కిందట– 1962లో చైనాతో యుద్ధం జరుగుతున్నప్పుడు తిలక్ చైనాను నరకాసురుడితో పోలుస్తూ 'మళ్లీ ఒక దీపావళి' కవిత రాశారు. 'మన ప్రధాని శ్రీకృష్ణుడు, ప్రజాశక్తి సత్యభామ/ దొంగచాటు బందిపోటు చైనాసురుడొరుగుతాడు/ మన పతాక హిమగిరిపై మళ్లీ ఆడుతుంది–/ మళ్లీ ఒక దీపావళి మళ్లీ ఒక దీపావళి'ని మనసారా ఆకాంక్షించారు. దాదాపు అదేకాలంలో మల్లవరపు జాన్ 'కుమతులై దేశమును దురాక్రమణ జేయు/ ద్రోహచిత్తులు భీతిల్లి తొలగిపోవ/ ఢమ ఢమ యటంచు నశని పాతముల బోలి/ ధ్వని జనించె; దీపావళి దినముఖమున' అంటూ దీపావళి విజయోత్సవ సంరంభాన్ని వర్ణించారు. హైదరాబాద్ విలీనమై తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు వానమామలై వరదాచార్యులు 'దీనికె రాములు సెట్టి/ జీవితమును ముడిబెట్టి/ కడకు విశాలాంధ్ర గలుప/ కాస్త అయ్యెను పొట్టి... ఈ దీపావళి వెలుగున/ ఇరువురమును సోదరులుగ/ తెలిసికొంటి మెడద నెడద/ కలిపికొంటి మొకటైతిమి' అంటూ 'అపూర్వ దీపావళి'కి ఆహ్వానం పలికారు. ప్రపంచ దారుణాలకు మనసు చెదిరిన బైరాగి 'పీడిత దరిద్ర శాపంతో/ క్రుంగిన ధరిత్రి కడుపు పగిలి/ వెలిగిన ప్రళయ ప్రదీపావళి/ దీపావళి వచ్చిందండీ' అంటూ 'చీకటి నీడలు'లో నిష్ఠుర పోయాడు. అమావాస్య రోజున వచ్చే వెలుగుల పండుగ దీపావళి. మన కవులలో కొందరు దీపావళిలో అమావాస్య చీకట్లనే చూస్తే, ఇంకొందరు ఆశల వెలుగులను తిలకించారు. వెలుగులు, చీకట్లను చూసిన కవులూ తమ సమకాలీన చారిత్రక పరిణామాలను నమోదు చేయడం విశేషం.

ఈసారి దీపావళి గ్రహణాన్ని వెంటబెట్టుకుని వస్తోంది. దీపావళి, సూర్యగ్రహణం ఒకేసారి రావడం చాలా అరుదు. ఇలాంటి పరిణామం ఇరవై ఏడేళ్ల కిందట ఒకసారి ఏర్పడింది. గ్రహణం శుభ సంకేతం కాదని చాలామంది నమ్ముతారు. అమావాస్య రోజు సూర్యగ్రహణం, పున్నమి రోజున చంద్రగ్రహణం ఏర్పడతాయి. భూమికి సూర్యుడికి మధ్యగా చంద్రుడు వచ్చినప్పుడు సూర్య గ్రహణం, సూర్యుడికి చంద్రుడికి మధ్యగా భూమి వచ్చినప్పుడు చంద్రగ్రహణం ఏర్పడతాయని ఖగోళ శాస్త్రవేత్తలు శతాబ్దాల కిందటే కనుగొన్నారు. అయినా గ్రహణాల చుట్టూ అల్లుకున్న నమ్మకాలు జనాల్లో ఈనాటికీ సజీవంగానే ఉన్నాయి. ఖగోళ పరిణామాల వల్ల ఏర్పడే గ్రహణాల సంగతి అలా ఉంచితే, మనుషులు నిత్యం ఎదుర్కొనే గ్రహణాలు చాలానే ఉన్నాయి. రెండేళ్లుగా ప్రపంచాన్ని పట్టి పీడించి, అతలాకుతలం చేసిన 'కరోనా' గ్రహణం ఇప్పుడిప్పుడే వీడింది. అంతమాత్రాన సమాజానికి గ్రహణమోక్షం లభించిందని సంతోషించే పరిస్థితులు లేవు. ఆకలి బాధలు, ఆర్థిక అసమానతలు, అవినీతి, బంధుప్రీతి, కుల మత లింగ వివక్షలు, నేరాలు ఘోరాలు వంటి గ్రహణాలు సమాజాన్ని ఇంకా పట్టి పీడిస్తూనే ఉన్నాయి. ఇలాంటి దారుణ గ్రహణాలు వీడినప్పుడే మానవాళికి అసలైన దీపావళి! అంతవరకు ఆశల దీపాలను వెలిగించి ఉంచుదాం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, తిథి: బ.చతుర్దశి సా.4.45 వరకు తదుపరి అమావాస్య, నక్షత్రం: హస్త ప.3.01 వరకు, తదుపరి చిత్త వర్జ్యం: రా.11.04 నుండి 12.41 వరకు, దుర్ముహూర్తం: ప.12.08 నుండి 12.55 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.11 వరకు అమృతఘడియలు: ఉ.8.48 నుండి 10.27 వరకు, నరకచతుర్దశి.

సూర్యోదయం : 5.59
సూర్యాస్తమయం : 5.31
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

మన మందులు మంచివేనా?

కామెంట్



కరణ్ థాపర్

ఒక భారతీయ కంపెనీ తయారుచేసిన దగ్గు సిరప్‌ల వల్ల గాంబియా దేశంలో 66 మంది పిల్లలు చనిపోయారన్న వార్త దేశ ప్రతిష్ఠను దెబ్బతీసింది. భారతదేశంలో తయారయ్యే ఔషధాలు ఎల్లవేళలా సురక్షితంగానూ, సమర్థంగానూ పనిచేస్తున్నాయా? భారతీయ తయారీ జనరిక్ ఔషధాలు ఒరిజినల్ మందులంత మంచివేనా? దురదృష్టవశాత్తూ ఈ ప్రశ్నలకు సమాధానం 'అవును' కాదు. మన తయారీ నాసిరకపు ఔషధాల వల్ల పేద దేశాల్లోని రోగులే కాదు, లక్షలాది మంది భారతీయులు కూడా ప్రభావితం అవుతున్నారు. లేబుల్ మీద ప్రకటించినంత మందు తీరా మాత్రలో ఉండకపోవడం, ఔషధాల్లో కలిసే అవకాశమున్న విష రసాయనాలను గుర్తించే యంత్రసామగ్రి లేకపోవడం, అసలు మొత్తంగానే ఒక కఠినమైన తనిఖీ వ్యవస్థ లేకపోవడం లాంటి ఎన్నో కారణాలు దేశీయుల ఉసురు తీస్తున్నాయి. భారతీయ ఔషధ పరిశ్రమలోని లోపాలను ఎత్తిచూపుతూ దినేష్ ఎస్. ఠాకూర్, టి.ప్రశాంత్ రెడ్డి రాసిన 'ద ట్రూత్ పిల్: ద మిత్ ఆఫ్ డ్రగ్ రెగ్యులేషన్ ఇన్ ఇండియా' ఎన్నో దిగ్భ్రాంతికరమైన విషయాలను వెల్లడించింది.

మెయిడెన్ ఫార్మాస్యూటికల్స్ తయారు చేసిన దగ్గు సిరప్‌లు గాంబియా దేశంలో 66 మంది పిల్లల మరణాలకు దారితీశాయని వచ్చిన వార్తలు ఇండియాను ఇబ్బందికి గురిచేశాయి. భారతదేశంలో ఔషధాలను ఎలా తయారుచేస్తున్నారో, ఎలా క్రమబద్ధీకరిస్తున్నారో తెలిపే దుర్భరమైన వాస్తవానికి ఇది ఒక సంకేతం మాత్రమే. ఈ నెలలోనే ప్రచురితమైన 'ద ట్రూత్ పిల్: ద మిత్ ఆఫ్ డ్రగ్ రెగ్యులేషన్ ఇన్ ఇండియా' అనే పుస్తకం దీనికి సంబంధించిన పూర్తి కథనాన్ని వెల్లడించింది. ఈ పుస్తక రచయితలు దినేష్ ఎస్. ఠాకూర్, టి. ప్రశాంత్ రెడ్డి రెండు కీలక ప్రశ్నలను లేవనెత్తారు. ఒకటి, భారతీయ మందులు ఎల్లవేళలా సురక్షితంగానూ, సమర్థంగానూ పనిచేస్తున్నాయా? రెండు, భారతీయ తయారీ జనరిక్ ఔషధాలు ఒరిజినల్ మందులంత మంచివేనా?

సమాధానం 'లేదు' అనే చెప్పాల్సి ఉంటుంది. తొలి ప్రశ్నకు ఈ పుస్తక రచయితలు చెప్పిన సమాధానం ఏమిటంటే... ''మార్కెట్లో పంపిణీ అవుతున్న నాసిరకపు మందుల సునామీని భారతదేశం విప్పారిన నేత్రాలతో చూస్తోంది... దీనివల్ల ప్రభావితులైన రోగుల మొత్తం సంఖ్య... వందలు, వేలు మాత్రమే కాదు బహుశా లక్షల్లో ఉంటుందని మేం అనుమానిస్తున్నాం.'' ఇక రెండో ప్రశ్నకు జవాబుగా వారు సింపుల్‌గా చెప్పిందేమిటంటే: ''మేము అలా భావించడం లేదు'' అనే.

ఈ పుస్తకంలోని వివరణాత్మకమైన, చక్కటి పరిశోధనతో కూడిన 500 పేజీల అధ్యయనం విస్తృతమైన అంశాలను తడిమింది. దేశంలో ఔషధాలు తయారు చేస్తున్న విధానం ఎంత లోపభూయిష్ఠంగా ఉందో ఈ పుస్తకం వివరించింది. కొన్ని కంపెనీలు తప్పుడు ప్రకటనలు చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు అయితే ఎలాంటి లైసెన్సు లేకుండానే మందులను ఉత్పత్తి చేస్తున్నాయి. అవసరమైన పరీక్షలు చేయడానికి సమర్థమైన యంత్ర సామగ్రి కూడా వీటివద్ద లేకపోవడం గమనార్హం. అనేక తప్పుడు విధానాలు అవలంబిస్తున్న కొన్ని కంపెనీల బండారం బయటపడుతున్నప్పటికీ వాటిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

భారతీయ మందుల దుర్భరమైన క్రమబద్ధీకరణ వ్యవస్థ గురించిన సమగ్ర వివరాలను కూడా ఈ పుస్తకం పొందుపర్చింది. మన రెగ్యులేటర్లు అరుదుగా, ఎప్పుడో తప్ప ఔషధ తయారీ కర్మాగారాలను భౌతికంగా తనిఖీ చేయరు. దీనికి బదులుగా వాళ్లు ప్రశ్నించదలచిన మందుల తయారీ బ్యాచ్ రికార్డుల కాపీని మాత్రమే అడుగుతుంటారు. వారు అనుసరించే మార్గదర్శకాలు న్యాయ విచారణను సైతం నిరుత్సాహపరుస్తుంటాయి. ఇంకా ఘోరమైన





విషయం ఏమిటంటే, వ్యవహారం కోర్టు వరకూ వెళ్లినప్పుడు, చాలా మామూలు శిక్షలు మాత్రమే పడుతుంటాయి. 'కోర్టు ముగిసే వరకూ విధించే సాధారణ శిక్ష' లాంటిది. అది అసలు శిక్షే కాదని చెప్పవచ్చు కూడా!

ఈ పుస్తక రచయితలు తమ ముందుమాటలో ఇచ్చిన ఉదాహరణతో ఒక భయానక స్థితి గురించి నన్ను వర్ణించనివ్వండి. 2019 సంవత్సరంలో డైయాథిలిన్ గ్లైకాల్ (డీఈజీ)ను కలిగివున్న దగ్గు సిరప్ తీసుకున్న 21 మంది చిన్నపిల్లలు చనిపోయారు. దీన్ని తయారుచేసింది డిజిటల్ విజన్ కంపెనీ. డైయాథిలిన్ గ్లైకాల్ అనేది పారిశ్రామిక ద్రావణి(సాల్వెంట్). దీన్ని 'ఆంటీఫ్రీజ్'గానూ, 'బ్రేక్-ఫ్లూయిడ్'గానూ ఉపయోగిస్తుంటారు. 1972 నుంచి డీఈజీ అనేది పిల్లలకు విషంగా మారిన ఘటనలు అయిదుసార్లు సంభవించాయి. అయినప్పటికీ ఔషధాల్లో దీని జాడను ఎవరూ కనుగొనలేక పోతున్నారు. కారణం... భారతీయ ఔషధ కంపెనీలు ఔషధ తయారీకి ముందు తమ ముడి సరుకును గానీ, తయారయ్యాక ఉత్పత్తిని మార్కెట్లోకి పంపడానికి ముందుగానీ పరీక్షించడంలో తరచుగా విఫలమవుతుండటమే!

ఇది డిజిటల్ విజన్ కంపెనీ తొలిసారి చేసిన క్షమించరాని తప్పేమీ కాదు. 2012–19 మధ్యకాలంలో ఈ కంపెనీ ఉత్పత్తి చేసిన మందులు నాణ్యతా పరీక్షల్లో మొత్తంమీద 19 సందర్భాల్లో విఫలమయ్యాయి. హిమాచల్ ప్రదేశ్ డ్రగ్ కంట్రోలర్ పరిధిలోకి వచ్చే డిజిటల్ కంపెనీ వ్యవహారాలకు సంబంధించి ఆ డ్రగ్ కంట్రోలర్ డీఈజీ మిశ్రమాలను పరీక్షించడానికి తగిన ఏర్పాట్లు కంపెనీ చేయనేలేదని హైకోర్టుకు తెలిపారు. అయితే ఆ డ్రగ్ కంట్రోలర్ ఈ విషయాన్ని కనుగొనడానికి అంతకుముందు 19 సార్లు అవకాశాలు వచ్చినప్పటికీ అలా పరీక్షించడంలో విఫలమయ్యారు. డ్రగ్ కంట్రోలర్ తనిఖీ సమయంలోనే ఈ లోపాలను కనిపెట్టి ఉండాలనీ, అలా చేసివుంటే కంపెనీ మాన్యుఫ్యాక్చరింగ్ లైసెన్సును తక్షణమే రద్దు చేసి ఉండేవారనీ ఈ పుస్తక రచయితలు పేర్కొన్నారు.

ఇంకో సంగతి. మరి, ఒక ఔషధం దాని లేబుల్ మీద ప్రకటించిన మేరకు లేకపోతే దాని పరిణామాలేమిటి? ఈ పుస్తకం అజిత్రోమైసిన్‌కు సంబంధించి ఒక విషయం పేర్కొంటోంది. ఆల్కేర్ లేబొరేటరీస్ తయారుచేసే అజిత్రోమైసిన్‌లో లేబుల్ ప్రకారం నిజానికి 200 మిల్లీగ్రాముల అజిత్రోమైసిన్ ఉండాలి. కానీ అందులో ఉన్నది 25.69 గ్రాములే. అంటే కేవలం 12.85 శాతమే. ఇలాంటి మందులు వాడినప్పుడు ఉండదగిన పరిణామం గురించి రచయితలు ఇలా వ్యాఖ్యానిస్తారు: ''రోగి చనిపోవడానికి అత్యధిక అవకాశాలున్నాయి. ఎందుకంటే, ఆ మాత్రలో ఇన్ఫెక్షన్‌ను నిరోధించడానికి అవసరమైన 'చాలినన్ని' యాక్టివ్ ఇన్‌గ్రేడియెంట్లు లేవన్న మామూలు కారణంతో.''

భారతదేశంలో చౌక ధరలకు లభ్యమవుతూ జనాదరణ పొందిన జనరిక్ మందులు నిజానికి అసలు మందులతో సమానం కాకపోతే జరిగేదేమిటో కూడా ఈ పుస్తకం వివరించింది. నిర్దిష్టంగా చెప్పాలంటే జనరిక్ మందులపై జీవ సమానత్వ (బయో ఈక్వలెన్స్) పరీక్ష చేపట్టాల్సిన అవసరం ఉంది. కానీ ఈ పరీక్ష అరుదుగానే జరుగుతుంది. ''తప్పనిసరిగా చేయవలసిన జీవసమానత్వ పరీక్ష లేమి కారణంగా దేశంలో వందలాది కాదు, వేలాది జనరిక్ మందుల బ్రాండ్లను ఆమోదించవలసి వచ్చింది. ఇలా ఆమోదం పొందిన చాలా బ్రాండ్లు ఎందరో రోగుల జీవితాలను తీవ్రంగా దెబ్బతీయడానికి అవకాశం ఉంది'' అని ఈ పుస్తక రచయితలు చెబుతున్నారు.

అనేక భారతీయ ఔషధ ఉత్పత్తి సంస్థలు నాణ్యతతో పాటు, విధానపరమైన నియంత్రణ, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించాయన్నదే ఈ పుస్తకానికి ముగింపు అని నేను చెబుతాను. అయినప్పటికీ, ప్రజలను దెబ్బతీస్తున్న లేదా చంపుతున్న నేరాలకు పాల్పడిన ఈ కంపెనీలు అరుదుగా కూడా భౌతిక శిక్షలు ఎదుర్కోవడం లేదు. ఇదే నిజానికి అత్యధికంగా భయపెడుతోంది. కానీ ప్రభుత్వం ఏ చర్యలకూ ఉపక్రమించకపోతే, మనం చేయగలిగేది ఏమీ ఉండదు కదా!

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సెలవు దినం



భారతదేశపు దీపాల పండుగ దీపావళి 2023 నుంచి అమెరికాలోని న్యూయార్క్ నగరంలో సాధారణ పాఠశాల సెలవు దినం కానుంది.

– సీమా మోదీ, రిపోర్టర్

ఇంతకు దిగజారారు



ప్లేట్‌లెట్స్ అని లేబుళ్లు వేసివున్న ప్యాకెట్లలో కొందరు బత్తాయి రసం పోసి అమ్మేవాళ్లున్నారు ఇండియాలో– డెంగ్యూ వ్యాప్తిలో లాభాల ఆర్జన కోసం! ఆత్మలు చచ్చిన మనుషులు వారు.

– సంగీతా నంబి, రచయిత్రి

రుచికరమైన జీవితం



డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు), డిసీజ్ (రోగాలు), డల్ నెస్ (నిరుత్సాహం) – మూడు 'డీ'లకు వ్యతిరేకంగా మనకు ఉన్న మొదటి రక్షక వ్యవస్థ ఏమిటంటే– ఇంటి వంట!

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

ఇవే ముఖ్యం



ఇవి చేస్తే మీ తొంభై శాతం సమస్యలు వాటి కవే పోతాయి. శుభ్రంగా తినడం, వ్యాయామం చేయడం, ఘర్షణకు దూరంగా ఉండటం, మాట్లాడే ముందు ఆలోచించడం, అభిప్రాయం పంచుకునే ముందు జాగ్రత్తగా ఉండటం. ప్రాథమికాంశాల మీద దృష్టి పెట్టడం.

– కమిల్లా, డేటింగ్ కోచ్

పలకడం రాదా?



ప్రియమైన ఉత్తరాది న్యూస్ యాంకర్లు: చోళ్ కాదు, చోళ. కేరళ్ కాదు, కేరళ. కర్ణాటక్ కాదు, కర్ణాటక. ఒక దేశం, ఒక భాష? ముందు పేర్లను సరిగ్గా పలకండి. ఒకరిపై బలవంతాన రుద్దడం అనుసంధానం కాదు.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

పరిస్థితి ఊహించండి



ఒక మాజీ ముఖ్యమంత్రి (జయలలిత) మరణానికి సంబంధించిన సరైన నివేదికనే ఒక రాష్ట్రం ఇవ్వలేకపోతే, ఇక తమిళనాడులో సాధారణ జనాలకు న్యాయం దక్కే అవకాశం ఎంత?

– కమలా త్యాగరాజన్, కాలమిస్ట్

అధికార చిత్రం



చైనా మాజీ అధ్యక్షుడు హు జింటావోను కమ్యూనిస్టు పార్టీ సమావేశం నుంచి బలవంతంగా బయటికి పంపిన ఘటనలో మనం చూసింది ఏమంటే – అందరూ జింగ్‌పింగ్ మనుమలతో కూడిన బృందం మాత్రమే అధికారంలో ఉండటం! దశాబ్దాలుగా ఉన్న నియమాలను ఉల్లంఘించడం! ఎల్లలు లేని ఒక సుప్రీంలీడర్ ఆవిర్భవించడం! ఇవేమీ పెద్ద ఆశ్చర్యం కలిగించలేదుగానీ అధికారాన్ని జింగ్‌పింగ్ చేజిక్కించుకుంటున్న తీరు మన ఊహలకు కూడా అందనిది. జింగ్‌పింగ్ ఇప్పుడు నిజమైన ఆధునిక చక్రవర్తి!

– యాంగ్ ఝూంగ్, సోషియాలజీ ప్రొఫెసర్

పండగ సంతోషం



సోమవారం రానున్న నా దీపావళి మిఠాయిల కోసం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

– హసన్ సజ్వానీ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

తెలుగు తెరకు... ఆయన గోరింటాకు!

అభిరుచి గల మురారి... ఆద్యంతం సాహిత్య సంగీతాల్ని ప్రేమించిన మురారి... మంచి చిత్రాల నిర్మాత 'యువచిత్ర' మురారి వెళ్ళిపోయారు. మూడు దశాబ్దాల స్నేహంలో ఎన్నో ఘటనలు మనసులో రీళ్ళు తిరిగాయి. మురారిది కమ్యూనిస్ట్ కుటుంబం. బెజవాడలో బాగా డబ్బున్న కాట్రగడ్డ కుటుంబం. సినీ నిర్మాణానికి పంపిణీ వ్యవస్థే మూలస్తంభమైన రోజుల్లో ప్రతిష్ఠాత్మక నవయుగ ఫిల్మ్స్ అధినేతకు అన్న కొడుకు. ఆ కొంగుచాటులన్నీ దాటుకొని, కష్టపడి, ఒక్కో మెట్టూ పేర్చుకుంటూ మురారి తనదైన కీర్తి, అపకీర్తుల సౌధం కట్టుకున్నారు. వి. మధుసూదనరావు వద్ద దర్శకత్వ శాఖలో సహాయకుడైన మురారికి అనంతరకాల అగ్ర దర్శకుడు కోదండరామిరెడ్డి సహపాఠీ. జెమినీ వాసన్, విజయా చక్రపాణి వద్ద నిర్మాణ మెలకువలు నేర్చుకున్నారు. కొట్లాడే దర్శకుడు కాబోయి, తిట్టి మరీ చెప్పి చేయించుకొనే నిర్మాతగా మారడమే తెలివైన పని అని గ్రహించారు. తనకు నచ్చిన సినిమాలే తీశారు. తనకు నచ్చినట్టే తీశారు. పంతం పట్టి రీషూట్లూ చేశారు. పారితోషికం పెంచి ఇస్తూ, పని చేయించుకున్నారు. 'తిడతాడు.. డబ్బుతో కొడతాడు' అనిపించుకున్నారు. సమకాలికుల్లో విలక్షణంగా నిలిచారు. బ్యానరే ఇంటిపేరైన కొద్ది నిర్మాతల్లో ఒకరయ్యారు.

మద్రాస్ మెరీనా బీచ్‌లోని దేవీప్రసాద్ రాయ్ చౌధురి 'శ్రామిక విజయం' శిల్పం తమ సంస్థకు చిహ్నంగా పెట్టుకోవడం మురారి పెరిగిన వాతావరణపు ఆలోచన. నవలల్ని తెర పైకి తెచ్చినా, ఇంగ్లీష్ ఇతివృత్తాల్ని తెలుగు కథలుగా మలిచినా అది ఆయన పెంచుకున్న అభిరుచి. 'సీతామాలక్ష్మి, గోరింటాకు, త్రిశూలం, సీతారామ కల్యాణం' వగైరా అన్నీ కలిపి తీసినవి 9 సినిమాలే! విజయ బాపినీడుతో కలసి నిర్మించిన 'జేగంటలు' తప్ప అన్నీ సక్సెస్‌లే. నందులతో సహా అనేక అవార్డులు తెచ్చినవే. ఆయన పాటలు అందమైన హిందోళాలు. ఎవర్‌గ్రీన్ హిట్లు. ఒకే నిర్మాత సినిమాల్లోని సాహిత్య విలువలపై 20 ఏళ్ళక్రితమే విశ్వవిద్యాలయ పరిశోధన జరిగింది ఒక్క 'యువచిత్ర' సినిమాలకే! 'మామ' మహదేవన్ లేకుండా సినిమా తీయనన్న మురారి, మామ పోయాక నిజంగానే సినిమా తీయలేకపోయారు. కీరవాణి సంగీతంతో కథ, సంగీత చర్చలు జరిగినా ముందుకు సాగలేదు.

మూగబోయిన కృష్ణశాస్త్రిని ఆరాధిస్తూ బాంబే బ్రెడ్ టోస్ట్ చేసిచ్చినా, ప్రతిభకు తగ్గ ప్రతిఫలం దక్కని పాలగుమ్మి పద్మరాజును ఆస్థాన రచయితగా పోషించినా, కనుమరుగైన మహానటి సావిత్రితో 'గోరింటాకు'లో పట్టుబట్టి వేషంవేయించినా, జగ్గయ్య సారథ్యంలో 'మనస్విని' ట్రస్ట్–అవార్డులతో మరణించిన ఆత్రేయను కొన్నేళ్ళు ఏటా స్మరించినా, ఎస్పీబీ – సత్యానంద్ – జంధ్యాల – ఓంకార్‌లతో గాఢంగా స్నేహించినా... అది మురారి మార్క్ ప్రేమ. కృష్ణశాస్త్రి మరణించాక 'ఇది మల్లెల వేళ' అంటూ ఎంపిక చేసిన 11 పాటల్ని ఎల్పీ రికార్డుగా హెచ్‌ఎంవీతో పట్టుబట్టి రిలీజ్ చేయించారు. ఆత్రేయ సాహిత్యం వెలికి రావడంలో పాత్ర పోషించారు. ప్రొడ్యూసరంటే కాంబినేషన్లు కుదిర్చే క్యాషియరనే కాలం వచ్చాక, అభిరుచి చంపుకోలేక మూడు దశాబ్దాల క్రితమే నిర్మాతగా స్వచ్ఛంద విరమణ చేశారు. సంపాదించిన డబ్బు సినిమాల్లో 'సన్' స్ట్రోక్‌కు ఆవిరి కారాదని తంటాలు పడ్డారు.

ప్రతిభను గుర్తించి, నెత్తికెత్తుకోవడం మురారి నైజం. 22 ఏళ్ళ క్రితం ఓ సికింద్రాబాద్ కుర్రాడు సినిమా తీస్తే, ఉత్తమ తొలి చిత్రదర్శకుడిగా నేషనల్ అవార్డ్ వచ్చింది. వార్త చదివిన మురారి ఆ కుర్రాణ్ణి చెన్నైకి పిలిపించి, అభినందించి, ఆతిథ్యమిచ్చి మరీ పంపారు. ఆ సినిమా 'డాలర్ డ్రీమ్స్'. ఆ సంగతి నేటికీ తలుచుకొనే అప్పటి ఆ కుర్రాడే – ఇవాళ్టి శేఖర్ కమ్ముల. హీరోయిన్లు తాళ్ళూరి రామేశ్వరి, వక్కలంక పద్మ, గౌతమి, రచయిత సత్యమూర్తి (దేవిశ్రీ ప్రసాద్ తండ్రి), కళా దర్శకుడు రాజులను మురారే తెరకు పరిచయం చేశారు. అగ్ర హీరోలు, దర్శకులతో పని చేసినా వారి కన్నా రచయితలతోనే ఆయనకు స్నేహం. డాక్టర్ జివాగో లాంటి నవలలు, వాటిని తెరకు మలిచిన తీరు గురించి మురారి చెబుతుంటే, డబ్బులు కాదు.. మనసు పెట్టినవాడే మంచి నిర్మాతనే మాటకు సాక్ష్యం అనిపించేది. నాటి 'వేయిపడగలు' నుంచి నేటి 'అర్ధనారి' దాకా బాగున్న ప్రతి నవల మురారి చదవాల్సిందే. చర్చించాల్సిందే. సందేహనివృత్తికి జగ్గయ్య, వీఏకె రంగారావు, గొల్లపూడి, పైడిపాల, కాసల నాగభూషణం లాంటి వార్ని సంప్రతించాల్సిందే.

మురారితో మాటలన్నీ పోట్లాటలే! మాట తీరే అంత. చూపులకు కోపధారి. తెలియనివాళ్ళకు తిక్క మనిషి. సన్నిహితమైతే తెలిసేది– మాటలోనే కారం కానీ మనసు నిండా మమకారమే అని! ఒక దశ దాటాక...





నివాళి

'యువచిత్ర' మురారి (1944-2022)

ఆయన ప్రేమించి, గౌరవించే హీరో శోభన్‌బాబు, దర్శకుడు దాసరి లేరు. సలహా చెప్పే స్నేహశీలి ఓంకార్ ముందే వెళ్ళిపోయారు. చెన్నైగా మారిన మద్రాసులో తెలుగు చిత్రసీమ ఖాళీ అయింది. పాత మిత్రులు లేరు. కొత్తగా మిత్రులు కారు. ఊరవతల సముద్రపుటొడ్డు నివాసంలో విచిత్రమైన ఒంటరితనం. సోషల్ మీడియాలో స్నేహాన్నీ, సాహిత్యంలో సాంత్వననూ వెతుక్కున్నారు. తోటలో తామరలు, ఇంట్లో కుక్కలతో సేద తీరాలనుకున్నారు. ఎఫ్బీలో నోరు చేసుకుంటూ వచ్చారు.


దశాబ్దిన్నర క్రితం 'తెలుగు చలనచిత్ర నిర్మాతల చరిత్ర' కళ్ళు చెదిరే ఖరీదైన గ్రంథంగా రావడంలోనూ మురారి సంపాదకత్వ అభిరుచి కనిపిస్తుంది. తెలుగు నిర్మాతల వెల్ఫేర్ ట్రస్ట్ చేపట్టిన ఆ బరువైన రచనలో బలమైన ఆయన ఇష్టానిష్టాలు, చెలరేగిన వాదాలు, వివాదాలు మరో పెద్ద కథ. తోచుబడి కావట్లేదన్నప్పుడు, తరచూ చెప్పే పాత కబుర్లనే కాగితంపై పెట్టమన్న సలహా మురారిలోని రచయితను నిద్ర లేపింది. ఎన్నో చేదునిజాలు, నాణేనికి ఒకవైపే చూపిన కొన్ని అర్ధసత్యాలను గుదిగుచ్చిన ఆయన జ్ఞాపకాల కలబోత 'నవ్విపోదురు గాక' సంచలనమైంది. పదేళ్ళలో 12 ముద్రణలు జరుపుకొంది. డ్రాఫ్ట్ రీడింగ్‌లో పలువురు ప్రముఖులు సందేహించినా, ఆటోబయోగ్రఫీల్లో అది నేటికీ టాప్‌సెల్లర్. ఆ రచనకు ప్రేరకులం, తొలి శ్రోతలమైన ఓంకార్‌నూ, అస్మదీయుడినీ పదుగురిలో పదేపదే గుర్తుచేసుకోవడం మురారి సంస్కారం.

ఆవేశభరిత మురారిది జీవితంలో, సినిమాల్లోనూ ముళ్ళదారి. ముక్కుసూటి తత్వం, మార్చుకోలేని అభిప్రాయాలు, మాట నెగ్గించుకొనే ఆభిజాత్యంతో సహచరుల్ని దూరం చేసుకోవడం మురారి జీవలక్షణాలు. చరమాంకంలో తప్పు తెలుసుకున్నారు. 'ఆఖర్న మోయడానికి నలుగురినైనా మిగుల్చుకోవాలయ్యా' అనేవారు. అప్పటికే లేటైంది. ఆయన పోయారు. ఆయన దర్శక, హీరోలెవరూ రాలేదు. సంతాపాలూ చెప్పలేదు. అవసరాలే తప్ప అభిమానాలు తక్కువైన రంగుల లోకంలోని ఆ సంగతీ మురారికి ముందే తెలుసు. ''ఏవయ్యా రేపు నే పోయాక పేపర్లో రాస్తావా? చదవడానికి నేనుండను కానీ, నా గురించి ఏం రాస్తావో ఇప్పుడే చెప్పచ్చుగా!'' అనేవారు. ఇంత తొందరగా ఆయన కోరిక నెరవేరుస్తానను కోలేదు. రాశాను... చదివి చీల్చిచెండాడడానికి ఆయన లేరు. మద్రాస్ తెలుగు సినిమా ఆఖరి అనుబంధాల్లో మరొకటి తెగిపోయింది. చిన్ననాటి నుంచి చివరి రోజుల దాకా జీవితంతో నిత్యం సంఘర్షిస్తూ, అలసిపోయిన డియర్ మురారి గారూ... రెస్ట్ ఇన్ పీస్ ఎట్లీస్ట్ ఇన్ దిస్ లాస్ట్ జర్నీ!

– రెంటాల జయదేవ

వెలిగే దీపాల సందేశం

'దీపజ్యోతి పరబ్రహ్మ స్వరూపం. దీపం అన్ని విధాల తమస్సు (చీకటు)లనూ తొలగిస్తుంది. దీపం వలన సర్వమూ సాధించచ్చు. అలాంటి దీపానికి నమస్కారం' అని ఆర్యోక్తి. చిమ్మచీకట్లో కూర్చొని అయోమయంలో భయాందోళనలలో మగ్గిపోతున్న వాడికి ఎవర యినా దీప జ్యోతిని అందిస్తే, ఎంత ఊరట, ఎంత ఆనందం! చీకట్లు పోకార్చి మార్గం చూపే సూర్య చంద్రులు ఎల్లవేళలా అన్ని చోట్లా ఉండరు కనక, దీపం అనే గొప్ప వరాన్ని మనిషికి ఈశ్వ రుడు ప్రసాదించాడు. 'దీపావళు'లు వెలిగించి ఏటికోసారి దివ్వెల పండుగ జరుపుకోవడంలో ఔచిత్యం ఉంది.



పిల్లలకు దీపావళి అంటే అభ్యంగన స్నానాల హడావిడులూ, కొత్త బట్టల కోలాహలాలూ, తీపి పిండి వంటల మధురానుభవాలూ! ఇవన్నీ వాళ్ళకు ఏటా దీపావళి జరుపుకొనేందుకు ప్రేరణలుగా నిలుస్తాయి. 'దీపం లేకపోతే లోకంలో సౌందర్యం లేదు. సౌందర్యం లేకపోతే జీవితం నిస్సారం. నీ జీవితంలో సారాన్నీ, సౌందర్యాన్నీ, వెలుగునూ నింపుకొనే బాధ్యత నీది. ఆ శక్తి కూడా నీకుంది' అని వయసులో ఉన్న గృహస్థులకు గుర్తు చేస్తుంది దీపావళి. 'అన్ని కళలకూ ఆలవాలమైన మహాలక్ష్మిని, నువ్వు వెలిగించిన దివ్వెల కాంతులతో ఆరాధిస్తే, ఆమె నీ చిన్న జీవితానికి అన్ని సిరులనూ సమకూరుస్తుంది' అని నడివయసు వారికి సూచిస్తుంది. ప్రాయం పడమటి దిశకు మళ్లిన పెద్దలకు దీపావళి నాటి బయటి వెలుగులన్నీ, 'లోపలి' వెలుగుకు జ్ఞాపికలు. 'ఒకే పరమాత్మ అందరిలో వెలిగే ప్రకాశం. అంతఃకరణమనే అద్దం మీద మద మత్సరాలూ, కామక్రోధాల మాలిన్యం తొలగించి, ఆ లోపలి వెలుగును దర్శించి అదే నీ అసలు రూపమని గ్రహించు. 'నీవు–నేను' భేదాలు లేని నిత్యా నంద స్థితిని చేరడం మనిషి జన్మకు పరమ గమ్యమని మరచిపోవద్దు' అంటాయి దీపావళి వెలుగులు.

– ఎం. మారుతి శాస్త్రి

'కసుమూరు' గంధ మహోత్సవానికి ఏఆర్ రెహమాన్ హాజరు


కసుమూరు దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేన్, ఏఆర్ రెహమాన్

వెంకటాచలం: దక్షిణభారత దేశంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా 245వ గంధ మహోత్సవానికి ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం హాజరయ్యారు. దర్గాలో కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బాణసంచా కోసం వెళ్లి ముగ్గురు మృత్యువాత

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- ఎదురెదురుగా ఢీకొన్న బైకులు.. ఎన్టీఆర్ జిల్లాలో ఘటన


కొమ్మినేని శ్రీకాంత్, వర్షిత్, నాగలక్ష్మి (ఫైల్ ఫొటోలు)

గంపలగూడెం (తిరువూరు): దీపావళి బాణసంచా సామగ్రి కోసం వెళ్లి ముగ్గురు మృత్యువాత పడగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడులో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే... తునికిపాడు గ్రామానికి చెందిన కొమ్మినేని శ్రీకాంత్ (35), అతని కుమారుడు కొమ్మినేని వర్షిత్ (7), కర్నాటి ఉదయ్‌కుమార్ (16) ఒక బైక్‌పై తెలంగాణ రాష్ట్రం మధిర పట్టణానికి వెళ్లి సరుకులు, దీపావళి సామగ్రి కొనుగోలు చేసి తిరిగి ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన గజ్జల మురళి తన కుమారుడు విఘ్నేష్, కుమార్తె నాగలక్ష్మి (7)తో కలిసి బాణసంచా కొనుగోలుకు మధిర వెళ్తున్నారు. గ్రామంలోని మలుపు వద్ద వేగంగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొమ్మినేని శ్రీకాంత్ (35), కొమ్మినేని వర్షిత్ (7), గజ్జల నాగలక్ష్మి(7) అక్కడికక్కడే మృతి చెందారు. గజ్జల మురళికి కాళ్లు, కంటి వద్ద తీవ్రగాయమైంది. గజ్జల విఘ్నేష్, కర్నాటి ఉదయ్‌కుమార్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు మధిర ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

'చదరంగ భారతి' శిక్షణ ప్రారంభం

సాక్షి, అమరావతి: ఏపీలో చదరంగం క్రీడ వ్యాప్తిలో భాగంగా 'చదరంగ భారతి' పేరుతో పైలట్ ప్రాజెక్ట్ కింద ఏపీ చెస్ ఇన్ స్కూల్స్ ట్రైనర్స్ కార్యక్రమం ఆదివారం జూమ్‌లో నిర్వహించారు. శాప్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అఖిల భారత సమాఖ్యకు అనుసంధానంగా తొలిసారి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మొదటి శిక్షణలో రాష్ట్ర వ్యాప్తంగా 36 మంది పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో హనుమాన్ ఆలయ నిర్మాణం

బీదలహళ్లిలో భూమి పూజ చేసిన లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి


శిలాన్యాస్‌ను ఆవిష్కరించిన లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండల సరిహద్దున కర్ణాటక రాష్ట్రం చింతామణీ తాలూకాలోని బీదలహళ్లిలో రూ.3 కోట్లతో కార్యసిద్ధి పంచముఖి హనుమాన్ ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆదివారం నిర్మాణ పనులకు లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి భూమిపూజ చేసి శిలాన్యాస్‌ను ఆవిష్కరించారు. ఆధ్యాత్మికతతో ప్రజలు ప్రశాంత జీవితం సాగించాలని కోరారు. ఆలయ నిర్మాణం చేపట్టిన ఆడిటర్ ఈ.మంజునాథ్‌ను కోలార్ ఎంపీ ఎస్.మునుస్వామి, శిద్దలగట్ట మాజీ మంత్రి, ఎమ్మెల్యే వి.మునియప్ప అభినందించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక లోకాయుక్త రిజిస్ట్రార్ ఎం.వి.చెన్నకేశవరెడ్డి, తహసీల్దార్ హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

చనిపోయాడనుకున్న బిడ్డ తిరిగొచ్చాడు

- 4 రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు
- చెరువులో మృతదేహం లభ్యమవ్వడంతో తమ కుమారుడిదేనని అంత్యక్రియలు
- తంతు జరుగుతుండగానే తిరిగొచ్చిన బిడ్డను చూసి అవాక్కైన కుటుంబ సభ్యులు


తిరిగొచ్చిన సతీష్

మనుబోలు: ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమారుడు చనిపోయాడు అనుకుని గుర్తు తెలియని మృతదేహానికి కుటుంబీకులు అంత్యక్రియలు చేసిన ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వడ్లపూడిలో ఆదివారం జరిగింది. వడ్లపూడి సర్పంచ్ పాలేటి రమాదేవికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు సతీష్ (25) ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇతనికి మానసికపరమైన సమస్యలు ఉన్నాయి. నాలుగు రోజుల కిందట సతీష్ ఇంట్లో అలిగి బైక్ తీసుకుని బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు సతీష్ ఆచూకీ తెలియకపోవడంతో శుక్రవారం మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంతలో శనివారం వెంకటాచలం మండలం కసుపూరు చెరువులో గుర్తుపట్టలేని విధంగా ఉన్న యువకుడి మృతదేహం బయటపడింది. ఎత్తు, బరువు సతీష్ లాగే ఉండడంతో అతనేనని భావించిన కుటుంబ సభ్యులు ఆ మృతదేహాన్ని వడ్లపూడికి తీసుకొచ్చి దహన సంస్కారాలు నిర్వహించారు. చిన్న కర్మ జరుపుతుండగా సతీష్ ప్రత్యక్షమయ్యాడు. అతన్ని చూసి అందరూ అవాక్కయ్యారు.

సీఎం జగన్ చిత్రపటానికి టీచర్ల క్షీరాభిషేకం



మహారాణిపేట (విశాఖ దక్షిణ): డీఎస్సీ–2008 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా అవకాశం కల్పించినందుకు గాను విశాఖలో సీఎం చిత్రపటానికి ఏపీ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ఆదివారం క్షీరాభిషేకం చేసింది.

చురుగ్గా జగనన్న స్పోర్ట్స్ క్లబ్స్ రిజిస్ట్రేషన్లు

- ఇప్పటివరకు 4 వేల స్పోర్ట్స్ క్లబ్స్, 8 వేల మంది క్రీడాకారుల పేర్లు నమోదు
- 40కి పైగా క్రీడాంశాల్లో రిజిస్ట్రేషన్లు
- ప్రత్యేక యాప్ ద్వారా నమోదు ప్రక్రియ చేపట్టిన శాప్

సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని ప్రతిభ గల క్రీడాకారులకు చిరునామాగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ప్రత్యేక చర్యలు చేపట్టింది. క్రీడాకారులకు అండగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన 'జగనన్న స్పోర్ట్స్ క్లబ్స్'కు విశేష స్పందన లభిస్తోంది. 40కి పైగా క్రీడాంశాల్లో రిజిస్ట్రేషన్లు చురుగ్గా జరుగుతున్నాయి. సుమారు 4వేల క్లబ్‌లు, దాదాపు 8 వేల మంది క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కబడ్డీలో అత్యధికంగా 1,050, క్రికెట్, వాలీబాల్‌లో 900 చొప్పున, బ్యాడ్మింటన్‌లో 400 వరకు స్పోర్ట్స్ క్లబ్స్ నమోదయ్యాయి. గోల్ఫ్, క్యారమ్స్, యోగా, వాటర్ స్పోర్ట్స్ తదితర విభాగాల్లోనూ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ఎన్టీఆర్, నంద్యాల, చిత్తూరు, ఏలూరు, విశాఖ, అనకాపల్లి, బాపట్ల జిల్లాలు రిజిస్ట్రేషన్లలో ముందున్నాయి.

అందరి భాగస్వామ్యంతో..

పంచాయతీ స్పోర్ట్స్ అథారిటీ, మండల స్పోర్ట్స్ అథారిటీలతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేల సహకారంతో స్పోర్ట్స్ క్లబ్స్ కార్యకలాపాలు సాగించేలా ప్రణాళిక తయారు చేశారు. స్కూళ్లు, కాలేజీల పీఈటీలు, పీడీలు, ఔత్సాహిక క్రీడాకారులను కూడా భాగస్వాములను చేశారు. క్లబ్స్ రిజిస్ట్రేషన్‌కు శాప్.. ప్లే స్టోర్‌లో 'జగనన్న స్పోర్ట్స్ క్లబ్స్' పేరుతో యాప్‌ను అందుబాటులో ఉంచింది.

క్రీడాకారులంతా ఒకే వేదికపైకి..

రాష్ట్రంలోని క్రీడాకారులందరినీ జగనన్న స్పోర్ట్స్ క్లబ్స్ ద్వారా ఒకే వేదికపైకి తీసుకొస్తున్నాం. క్రీడలపై మక్కువ ఉండి.. ప్రోత్సాహం లేనివారికి చేయూతనిస్తాం. గ్రామ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ స్పోర్ట్స్ క్లబ్స్ యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. వీరిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయిలో మెగా స్పోర్ట్స్ టోర్నీలు నిర్వహిస్తాం.
– బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, శాప్ చైర్మన్

సామరస్యాన్ని పెంచే దీపావళి: రాష్ట్రపతి

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు పరస్పర సహకారం, సామరస్యాన్ని బలోపేతం చేసుకునేందుకు దీపావళి ఒక సందర్భమని పేర్కొన్నారు. పరస్పర సహకారం, సామరస్యం వెల్లివిరిసేందుకు ఇది తగిన సందర్భమన్నారు. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ కూడా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దివ్వెల వెలుగులు ఆశ, సంతోషం, ఆరోగ్యం, సామరస్యతను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇస్సాక్ హెర్జోగ్ ముర్ముకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ''ముర్ముకు, భారతీయులకు ఇజ్రాయెల్ ప్రజల తరఫున దీపావళి శుభాకాంక్షలు'' అంటూ ట్వీట్ చేశారు.



కాళీ పూజ సందర్భంగా కాంతులీనుతున్న కోల్‌కతాలోని దక్షిణేశ్వర్ వద్ద కొలువైన ప్రఖ్యాత కాళీ మందిరం



పశ్చిమబెంగాల్లోని నాదియాలో రంగవల్లులు తీర్చి దీపాలతో అలంకరిస్తున్న మహిళలు



దీపావళి సందర్భంగా విద్యుద్దీపాలంకరణలో మెరిసిపోతున్న అమృత్‌సర్ స్వర్ణ దేవాలయం

న్యూయార్క్‌లో స్కూళ్లకు... దీపావళి సెలవు

హర్షం వ్యక్తం చేసిన ప్రియాంకా చోప్రా

లాస్‌ఏంజెలెస్: న్యూయార్క్‌లోని పాఠశాలలకు దీపావళి పండుగ రోజును సెలవుగా ప్రకటించడంపై బాలీవుడ్ నటి, నిర్మాత ప్రియాంకా చోప్రా జొనాస్ హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని పబ్లిక్ స్కూళ్లకు 2023 నుంచి దీపావళి రోజున సెలవు ఉంటుందని న్యూయార్క్ మేయర్ ఎరిక్ ఆడమ్స్ గురువారం ప్రకటించడంపై శనివారం రాత్రి ప్రియాంక ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించారు. తన చిన్నతనంలో న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో స్కూలుకు వెళ్లినప్పటి రోజులను గుర్తుకు వచ్చి ఏడ్చేశానని పేర్కొన్నారు. న్యూయార్క్ నగరంలో భారత సంతతికి చెందిన సుమారు 2 లక్షల మంది హిందూ, సిక్కు, బౌద్ధ, జైన మతస్తులున్నారు. వీరంతా దీపావళి పండుగను జరుపుకుంటారని, అందుకే సెలవుగా ప్రకటించాలని నిర్ణయించామని మేయర్ ఎరిక్ ఆడమ్స్ తెలిపారు. ప్రియాంకా చోప్రా ప్రస్తుతం లాస్‌ఏంజెలెస్‌లో నివాసం ఉంటున్నారు.

క్లుప్తంగా...

అమితాబ్ బచ్చన్‌కు గాయం

ముంబై: ఇటీవల తన ఎడమ కాలికి గాయమైందని బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ తెలిపారు. ఇనుప ముక్క కాలిపిక్కను చీల్చడంతో విపరీతంగా రక్తస్రావమైందని, కుట్లు కూడా పడ్డాయని ఆదివారం తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నడవొద్దని డాక్టర్లు గట్టి సలహా ఇచ్చినా గాయం కట్టుతోనే కౌన్ బనేగా కరోడ్‌పతి చిత్రీకరణలో పాల్గొన్నట్లు చెప్పారు. ఎడమ కాలి పిక్కకు బ్యాండేజీతో కౌన్ బనేగా కరోడ్‌పతి సెట్స్‌లో పరుగెత్తుతున్న ఫొటోలను శనివారం ఆయన పోస్ట్ చేశారు.

కర్ణాటక అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మామని కన్నుమూత



శివాజీనగర: కర్ణాటకలో బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ ఆనంద మామని(56) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బెంగళూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో శనివారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆయనకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. 1990ల్లో డిప్యూటీ స్పీకర్‌గా చేసిన ఆయన తండ్రి చంద్రశేఖర్ కూడా ఆ పదవిలో ఉండగానే కన్నుమూశారు! ఆనంద మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు.

ఆసియాలోని కాలుష్య నగరాల్లో 8 భారత్‌వే

న్యూఢిల్లీ: ఆసియాలోని అత్యంత కాలుష్యమైన టాప్-10 నగరాల్లో ఎనిమిది భారత్‌లోనే ఉన్నాయి. చలికాలం వస్తూ ఉండడంతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. వరల్డ్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ గణాంకాల ప్రకారం హరియాణాలోని గురుగ్రామ్ మొదటి స్థానంలో ఉంటే బీహార్‌లోని ధారుహెరా రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో రాజధాని ఢిల్లీ లేదు. ఇక గాలిలో నాణ్యతా ప్రమాణాలు అత్యుత్తమంగా ఉన్న నగరాల్లో ఆసియా మొత్తంగా తీసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం ఒక్కటే నిలవడం విశేషం. గురుగ్రామ్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) ఆదివారం ఉదయం 679 ఉంటే ధరుహెరలో 543గా ఉంది. ఆ తర్వాత స్థానాల్లో లక్నో (298), ఆనందపూర్ బెగుసరాయ్ (269) భోపాల్ (266) ఖడక్‌పడ (256), దర్శన్ నగర్, చాప్రా (239) ఉన్నాయి.

చరిత్రకెక్కిన జిన్‌పింగ్

చైనా అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి ఎన్నిక



కమ్యూనిస్టు పార్టీ నేతగా 1988లో పొలం పనుల్లో పాల్గొంటూ...

మావో తర్వాత అరుదైన ఘనత
- కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా జిన్‌పింగ్ ఎన్నిక
- మిలటరీ కమిషన్ చైర్మన్‌గా కూడా
- 24 మందితో సీపీసీ పొలిట్‌బ్యూరో
- ఏడుగురితో స్టాండింగ్ కమిటీ

బీజింగ్: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ (69) చరిత్ర సృష్టించారు. అధికార కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) ప్రధాన కార్యదర్శిగా వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. పార్టీ వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ తర్వాత ఈ ఘనత సాధించిన తొలి నాయకుడు ఆయనే! బీజింగ్‌లోని ఆర్నేట్ గ్రేట్ హాల్‌లో ఆదివారం సీపీసీ 20వ సెంట్రల్ కమిటీ ప్లీనరీ జిన్‌పింగ్ అధ్యక్షతన జరిగింది. 203 మంది సెంట్రల్ కమిటీ సభ్యులు, 168 మంది ప్రత్యామ్నాయ సభ్యులు పాల్గొన్నారు. జిన్‌పింగ్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆయన ఐదేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. 24 మందితో సీపీసీ పొలిట్‌బ్యూరోకూ సెంట్రల్ కమిటీ ఆమోదముద్ర వేసింది. జిన్‌పింగ్ సహా ఏడుగురు సభ్యులతో అత్యంత శక్తిమంతమైన స్టాండింగ్ కమిటీనీ ఎన్నుకున్నారు. ఇందులో జిన్‌పింగ్ మద్దతుదారులకే స్థానం దక్కింది. పార్టీ ప్రధాన కార్యదర్శిగా మళ్లీ ఎన్నికయ్యాయని జిన్‌పింగ్ స్వయంగా ప్రకటించారు. సీపీసీ షాంఘై అధ్యక్షుడు లీ ఖియాంగ్.. జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరుగాంచారు. చైనా ప్రీమియర్ (ప్రధానమంత్రి) లీ కెఖియాంగ్ వచ్చే ఏడాది మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో నూతన ప్రీమియర్‌గా లీ ఖియాంగ్ బాధ్యతలు చేపడతారన్న ప్రచారం సాగుతోంది.

కమ్యూనిస్ట్ పార్టీ.. చైనా ప్రజలకు వెన్నెముక

ప్రపంచానికి చైనా అవసరం, చైనాకు ప్రపంచం అవసరం ఉందని షీ జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మూడోసారి ఎన్నికైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచానికి దూరంగా ఒంటరిగా ఉంటూ చైనా అభివృద్ధి చెందలేదని అన్నారు. అలాగే ప్రగతి పథంలో ముందుకు సాగాలంటే ప్రపంచానికి చైనా కావాలని చెప్పారు. తమ ఆర్థిక వ్యవస్థ నమ్మదగినది, స్వేచ్ఛాయుతమైనది అని పేర్కొన్నారు. పునాది బలంగా ఉందని వివరించారు. దేశ విదేశీ పెట్టుబడుల కోసం తలుపులు తెరిచి ఉంచామని వెల్లడించారు. సంస్కరణల విషయంలో స్థిరంగా ముందుకు కదులుతున్నామని చెప్పారు. సౌభాగ్యవంతమైన చైనా బాహ్య ప్రపంచం కోసం ఎన్నో అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు. మార్క్సిజం వైపు మొగ్గు చూపుతుండడంతోపాటు చైనాను ఆధునిక సోషలిస్టు దేశంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని జిన్‌పింగ్ ఇప్పటికే ప్రకటించారు. నూతన శకంలో సోషలిజం అభివృద్ధిలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాలని కమ్యూనిస్ట్ పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. వందేళ్ల చరిత్ర ఉన్న.. ప్రపంచంలో అతిపెద్ద పార్టీ అయిన కమ్యూనిస్ట్ పార్టీ స్వయం సంస్కరణ ద్వారా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. మన పార్టీ చైనా ప్రజలకు ఒక బలమైన వెన్నుముకగా మారాలన్నారు. ఘన కీర్తి కలిగిన చైనా అద్భుతమైన కలలతో సుదీర్ఘ ప్రయాణం సాగిస్తోందని జిన్‌పింగ్ వివరించారు. మార్గసూచి(రోడ్‌మ్యాప్) తయారు చేసుకున్నామని, శంఖం పూరించామని చెప్పారు. మన దేశానికి మెరుగైన భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. కమ్యూనిస్ట్ పార్టీకి పక్షపాతానికి తావులేని వాస్తవికమైన ప్రచారం కల్పించాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు.

మూడు అత్యున్నత పదవులు

అత్యంత శక్తిమంతమైన సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ) చైర్మన్‌గా జిన్‌పింగ్‌ను కమ్యూనిస్ట్ పార్టీ పొలిట్‌బ్యూర్ మరోసారి నియమించింది. ఆయనకు మూడు అత్యున్నత పదవులు దక్కాయి. దేశాధ్యక్షుడిగా, కమ్యూనిస్ట్ పార్టీ అధినేతగా, సీఎంసీ చైర్మన్‌గా ఆయన వ్యవహరిస్తారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్‌ఏ) జనరల్స్ ఝాంగ్ యుషియా, హీ వీడాంగ్‌ను సీఎంసీ వైస్ చైర్మన్లుగా నియమించారు. పలువురు సైనిక ఉన్నతాధికారులకు సెంట్రల్ మిలటరీ కమిషన్‌లో సభ్యులుగా అవకాశం లభించింది. ఆదివారం సెంట్రల్ కమిషన్ ఫర్ డిసిప్లిన్ ఇన్‌స్పెక్షన్ (సీసీడీఐ) స్టాండింగ్ కమిటీ కార్యదర్శి, ఉప కార్యదర్శులు, సభ్యులను కూడా ఎన్నుకున్నారు. 24 మందితో కూడిన సీపీసీ పొలిట్‌బ్యూరోలో మహిళలకు స్థానం కల్పించకపోవడం చర్చనీయాంశంగా మారింది.



1989లో భార్య పెంగ్ లీ యువాన్‌తో జిన్‌పింగ్

కూతురిని సైకిల్‌పై కూచోబెట్టుకుని... (ఫైల్)

అంచెలంచెలుగా...

చైనా అధినేత షీ జిన్‌పింగ్ 1953 జూన్ 15న శాన్షీ ప్రావిన్స్‌లో జన్మించారు. ఆయన తండ్రి షీ షీ ఝూంగ్‌షువాన్ కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడిగా, చైనా ఉప ప్రధానమంత్రిగా పనిచేశారు. జిన్‌పింగ్ బాల్యం ఎక్కువగా యావోడాంగ్ అనే పల్లెటూరిలో గడిచింది. తండ్రి ఆదేశాల మేరకు సాంస్కృతిక విప్లవ సమయంలో రైతులతో కలిసి సాధారణ జీవితం గడిపారు. వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు. ప్రాథమిక విద్య అనంతరం సింగువా యూనివర్సిటీలో కెమికల్ ఇంజనీరింగ్ అభ్యసించారు. 1974లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా సభ్యుడిగా చేరారు. పార్టీ శాఖ కార్యదర్శిగా రాజకీయ జీవితం ఆరంభించారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. 1985లో ఫుజియాన్ ప్రావిన్స్‌లోని షియామెన్ నగర ఉప మేయర్‌గా ఎన్నికయ్యారు. 1979లో కే లింగ్లింగ్‌ను వివాహం చేసుకున్నారు. మనస్పర్థల కారణంగా కొద్ది కాలానికే ఆమె నుంచి విడిపోయారు. 1987లో ప్రముఖ జానపద గాయని పెంగ్ లియువాన్‌ను వివాహం చేసుకున్నారు. వారికి కుమార్తె షీ మింగ్‌జే ఉన్నారు. ఆమె అమెరికాలో చదువుకుంటున్నారు. జిన్‌పింగ్ 1999 నుంచి 2002 దాకా ఫుజియాన్ గవర్నర్‌గా, 2002 నుంచి 2007 దాకా ఝెజియాంగ్ గవర్నర్‌గా వ్యవహరించారు. 2007లో కమ్యూనిస్ట్ పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ(పీఎస్సీ)లో చేరారు. 2008 నుంచి 2013 దాకా చైనా ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. తొలిసారిగా 2012లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా ప్రధాన కార్యదర్శిగా, 2013లో చైనా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

పొగడ్తలు, తెగడ్తలు...

1949 అక్టోబర్ 1న పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ఆవిర్భవించింది. ఆ తర్వాత జన్మించిన తొలి సీపీసీ ప్రధాన కార్యదర్శి జిన్‌పింగే. పార్టీలో ఎన్నో సంస్కరణలకు ఆయన శ్రీకారం చుట్టారు. క్రమశిక్షణకు, అంతర్గతంగా ఐక్యతకు పెద్దపీట వేశారు. అవినీతిపై ఉక్కుపాదం మోపారు. సొంత పార్టీ మాజీ నేతలకు కూడా శిక్షలు విధించారు. ఇది చైనాలో ప్రశంసలందుకుంది. కానీ ఆయన విదేశాంగ విధానంపై భిన్న స్వరాలు వినిపించాయి. పదేళ్ల జిన్‌పింగ్ పాలనలో అమెరికాతో చైనా సంబంధాలు క్షీణించాయి. భారత్‌తో సరిహద్దు వివాదాలు పెచ్చరిల్లాయి. తైవాన్ విషయంలో జిన్‌పింగ్ దూకుడు విమర్శలపాలవుతోంది. హాంకాంగ్‌లో నేషనల్ సెక్యూరిటీ చట్టం విషయంలోనూ ఆరోపణలు ఎదుర్కొన్నారు. కరోనా పుట్టుకకు చైనాయే కారణమన్న నిందను మోయాల్సి వచ్చింది. జీరో-కోవిడ్ పాలసీ వల్ల చైనా ఆర్థిక వ్యవస్థ దిగజారుతోందన్న వాదనలున్నాయి. జిన్‌పింగ్ తయారీ రంగాన్ని ప్రోత్సహించారు. ఫలితంగా చైనా గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఎదిగింది.

మహిళపై చేయిచేసుకున్న కర్నాటక మంత్రి

వీడియో వైరల్ కావడంతో క్షమాపణలు

సాక్షి, బనశంకరి: ''సార్, మీకు దండం పెడతా, నాకు ఇంటి స్థలం ఇప్పించండి, అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు'' అని ఒక మహిళ కర్ణాటక గృహ నిర్మాణ శాఖ మంత్రి వి.సోమణ్ణని విజ్ఞప్తి చేస్తే అందరి ముందే మంత్రి ఆమెపై చేయి చేసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చామరాజనగర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అయిన సోమణ్ణ హంగాలా గ్రామంలో భూ పట్టాల పంపిణీ కార్యక్రమానికి శనివారం హాజరయ్యారు. ఆ కార్యక్రమం జరుగుతుండగా కెంపమ్మ అనే మహిళ తనకు అన్ని అర్హతలు ఉన్నా ప్రభుత్వ స్థలం దక్కలేదని, వితంతువైన తనకు జాగా కేటాయించాలంటూ మంత్రికి విజ్ఞప్తి చేయడానికి ఆయన దగ్గరకు వెళ్లింది. ఇదే విషయాన్ని ఆమె పదే పదే చెప్పడంతో కోపోద్రిక్తుడైన సోమణ్ణ ఆమె చెంప ఛెళ్లుమనిపించడంతో అందరూ అవాక్కయ్యారు. వెంటనే ఆ మహిళ మంత్రి కాళ్లపై పడడం కూడా కనిపించింది. మంత్రి తీరుపై సోషల్ మీడియాలోను, విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్



నేత సిద్ధరామయ్య బాధ చెప్పుకోవడానికి వచ్చిన మహిళను కొట్టే వ్యక్తి మంత్రి పదవికి అనర్హుడని అన్నారు. ఎవరికైనా బాధ కలిగితే క్షమాపణ కోరుతున్నానని మంత్రి చెప్పారు. ''ఆమె పదేపదే వేదిక మీదకి వస్తుంటే సమస్య పరిష్కరిస్తానని చేతితో పక్కకు తోశానంతే. దాడి చేయాలనే ఉద్దేశం లేదు'' అని సోమణ్ణ చెప్పారు.

సోనియా ఆధ్వర్యంలోని స్వచ్ఛంద సంస్థల... లైసెన్సులు రద్దు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్వచ్ఛంద సంస్థలు రాజీవ్ గాంధీ ఫౌండేషన్, రాజీవ్ చారిటబుల్ ట్రస్ట్ లైసెన్సులను కేంద్రం రద్దు చేసింది. ఆర్థిక నిబంధనలు ఉల్లంఘించిందందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. దీంతో ఇక నుంచి ఈ సంస్థలకు విదేశీ విరాళాలందవు. ఈ సంస్థల ఐటీ రిటర్నుల్లో అవకతవకలు, విదేశీ విరాళాల దుర్వినియోగం, చైనా సహా నుంచి నగదు అక్రమ రవాణా వంటి ఆరోపణలపై హోం శాఖ కమిటీ రెండేళ్ల పాటు విచారణ జరిపింది. 1991లో ఏర్పాటైన ఆర్‌జీఎఫ్ విద్య, ఆరోగ్యం తదితరాలపై పని చేస్తోంది. 2002లో ఏర్పాటైన ఆర్‌జీసీటీ గ్రామీణ నిరుపేదల అభ్యున్నతి కోసం పని చేస్తోంది. ఇందిరాగాంధీ మెమోరియల్ ట్రస్ట్‌పైనా విచారణ జరిపినా దానిపై చర్యలు తీసుకోలేదు. భారత్ జోడో యాత్ర నుంచి, సమస్యల నుంచి జనం దృష్టి మళ్లించేందుకే బీజేపీ ప్రభుత్వం ఇలాంటి చౌకబారు పనులు చేస్తోందని కాంగ్రెస్ దుయ్యబట్టింది. గాంధీ కుటుంబం, వారి ఎన్జీవోలు చట్టానికి అతీతం కారని బీజేపీ ఘాటుగా బదులిచ్చింది.

బ్రిటన్ ప్రధాని రేసులో ఉన్నా: రిషి

లండన్: బ్రిటన్ ప్రధాని రేసులో ఉన్నానని భారత సంతతికి చెందిన మాజీ ఆర్థిక మంత్రి రిషి సునాక్ ఆదివారం ప్రకటించారు. పోటీకి కనీసం 100 మంది కన్జర్వేటివ్ పార్టీ ఎంపీల మద్దతు అవసరం. కాగా రిషికి ఇప్పటికే 128 మంది మద్దతుంది. ''బ్రిటన్ ఇప్పుడు కనీవినీ ఎరుగని సంక్షోభంలో ఉంది. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని అనుకుంటున్నా. అందుకే బరిలో దిగా'' అంటూ రిషి ట్వీట్ చేశారు. తనకు అవకాశమివ్వాలని కోరారు. తాజా మాజీ హోం మంత్రి సుయెల్లా బ్రేవర్మన్ కూడా రిషికి మద్దతు ప్రకటించారు.

జాన్సన్, సునాక్ భేటీ ?

మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ కూడా ఈ సారి ప్రధాని పదవికి పోటీ పడతారని వార్తలొస్తున్నా ఆయన అధికారికంగా ప్రకటన చేయలేదు. నామినేషన్‌కు సోమవారం మధ్యాహ్నం 2 దాకా గడువుంది. ఈ నేపథ్యంలో జాన్సన్, సునాక్ కలిసి మాట్లాడుకున్నారని ప్రచారం జరుగుతోంది. దీనిపై ఇరు వర్గాలూ పెదవి విప్పడం లేదు. జాన్సన్ మద్దతుదారులుగా ఉన్న ఎంపీలు కొందరు ఈసారి సునాక్‌కు జై కొడుతున్నారు. పెన్నీ



మోర్డంట్‌కు 23 మంది ఎంపీల మద్దతే లభించినందున ఆమె రేసులో లేనట్టే. సునాక్, జాన్సన్ రాజీకి వచ్చి ఒకరు ప్రధాని అయి మరొకరు మంత్రివర్గంలో కీలక బాధ్యతలు తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే సోమవారం సాయంత్రానికల్లా బ్రిటన్ తదుపరి ప్రధాని ఎవరో తేలిపోతుంది.

రేకుల పైకప్పు గదిలో... నిద్రించిన ప్రధాని మోదీ

డెహ్రాడూన్: సముద్ర మట్టానికి 11,300 అడుగుల ఎత్తున రేకుల పైకప్పుతో నిర్మించిన తాత్కాలిక గదిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాత్రి పూట నిద్రించారు. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌ఓ) కార్మికుల కోసం వండిన కిచిడీని ఆరగించారు. శనివారం ఉత్తరాఖండ్ పర్యటనలో ఈ విశేషాలు చోటుచేసుకున్నాయి. మనా పట్టణ సమీపంలో బీఆర్‌ఓ డిటాచ్‌మెంట్ సెంటర్‌ను మోదీ సందర్శించిన సంగతి తెలిసిందే. ఓ కార్మికుడు సిద్ధం చేసిన కిచిడీ, మాండ్వే కీ రోటీ, స్థానిక పచ్చడి, జాగోర్ కీ ఖీర్‌ను ఆహారంగా తీసుకున్నారని అధికారులు చెప్పారు. అంతేకాకుండా రేకుల పైకప్పుతో అప్పటికప్పుడు నిర్మించిన తాత్కాలిక నిర్మాణంలో సేదతీరారని వెల్లడించారు. ఈ గదిలో చిన్నపాటి ఎలక్ట్రిక్ హీటర్ మాత్రం ఉంది. రోడ్ల నిర్మాణంలో పాలుపంచుకుంటున్న కూలీలతో మోదీ సంభాషించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ బీఆర్‌ఓ సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నారని ప్రశంసించారు. శ్రమయేవ సర్వం సాధ్యం (శ్రమతో ఏదైనా సాధ్యమే) అని విజిటర్స్ బుక్‌లో రాశారు.

ఇక వాణిజ్య ప్రయోగాలే

ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ వెల్లడి

సూళ్లూరుపేట: ఎల్‌వీఎం3-ఎం2 ప్రయోగం విజయంతో ఇస్రోకు ఒక రోజు ముందుగానే దీపావళి పండగ వచ్చిందని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. ప్రయోగానంతరం ఆదివారం తెల్లవారుజామున ఆయన మీడియాతో మాట్లాడారు. న్యూ స్పేస్ ఇండియా, వన్‌వెబ్ సహకారంతో ఆదివారం ఎల్‌వీఎం3-ఎం2 ద్వారా ప్రయోగించిన 36 యూకేకి చెందిన కమ్యూనికేషన్ ఉపగ్రహాలు విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టగలిగామని తెలిపారు. క్రయోజనిక్ దశలో 36 ఉపగ్రహాలను ఒకేసారి కాకుండా నాలుగు దిశల్లో నాలుగేసి ఉపగ్రహాలు చొప్పున కక్ష్యలోకి విడిపోయేలా ఈ ప్రయోగంలో కొన్ని కీలకమైన సైంటిఫిక్ పరికరాలతో రూపొందించామని చెప్పారు. ఈ ప్రయోగంలో ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరడం కీలకం కావడంతో 36 ఉపగ్రహాలు విడిపోవడానికి 1.30 గంటల సమయం తీసుకున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రయోగంతో ప్రపంచ దేశాల నుంచి ఎక్కువ మంది కస్టమర్లు రావడానికి అవకాశం ఏర్పడిందని చెప్పారు. వన్‌వెబ్ కంపెనీతో న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ ఒప్పందం మేరకు మరో 36 ఉపగ్రహాలను, మళ్లీ ఇంకో 36 ఉపగ్రహాలను ఇదే తరహాలోనే ప్రయోగిస్తామని



తెలిపారు. ఇస్రో విజయంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

వాణిజ్య ప్రయోగాలే లక్ష్యం

ఇకపై వాణిజ్యపరంగా విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడమే లక్ష్యమని న్యూ స్పేస్ ఇండియా సీఎండీ రాధాకృష్ణన్ అన్నారు. దీన్ని చరిత్రాత్మక ప్రయోగంగా వన్‌వెబ్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ అభివర్ణించారు. ఇప్పటికే 648 ఉపగ్రహాలను వివిధ దేశాల నుంచి ప్రయోగించామని గుర్తు చేశారు. ఇది కొత్త అధ్యాయానికి శ్రీకారమని పవన్ గోయెంకా (వన్‌వెబ్ కంపెనీ) చెప్పారు. ''36 కమ్యూనికేషన్ ఉపగ్రహాలను ఒకే రాకెట్ ద్వారా పంపడం కూడా అద్భుతం. వాణిజ్యపరంగా ఇస్రో మరో అడుగు ముందుకేయడం శుభ పరిణామం'' అని ఆయన చెప్పారు.

శ్రీరాముడే స్ఫూర్తి: మోదీ

అయోధ్యలో రామ్‌లల్లా సందర్శన
- సరయూ తీరంలో దీపోత్సవం
- 15.76 లక్షల దీపాలతో గిన్నిస్ రికార్డు

అయోధ్య: ప్రభుత్వ నినాదం 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్'కు శ్రీరాముడి పాలన, ఆయన అందించిన విలువలే స్ఫూర్తి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయన ఆదివారం సాయంత్రం ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలోని సరయూ నది ఒడ్డున దీపోత్సవంలో పాల్గొన్నారు. ప్రజలు వెలిగించిన 15.76 లక్షల దీపాలతో సరయూ తీరం వెలుగులతో కనువిందు చేసింది. ఈ కార్యక్రమం గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించింది. 3డీ హోలోగ్రాఫిక్ ప్రొజెక్షన్ మ్యాపింగ్ షోను, మ్యూజిక్ షోను మోదీ తిలకించారు. భవ్య రామమందిర నిర్మాణానికి ఆయన 2020 ఆగస్టు 5న భూమిపూజ చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆయన అయోధ్యకు రావడం ఇదే తొలిసారి. తొలుత రామజన్మభూమి స్థలంలోని తాత్కాలిక ఆలయంలో రామ్‌లల్లాను మోదీ దర్శించుకున్నారు. దీపం వెలిగించారు. ప్రత్యేక పూజలు చేశారు. హారతి అందుకున్నారు. అనంతరం రామ మందిర నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. రామకథా పార్కులో శ్రీరాముడు, సీతల ప్రతీకాత్మక పట్టాభిషేక కార్యక్రమంలో మోదీ పాలుపంచుకున్నారు. పుష్పక విమానం(హెలికాప్టర్) నుంచి రాముడు, లక్ష్మణుడు, సీత పాత్రధారులు దిగడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. రాముడి ఆశయాలు, విలువలు రాబోయే 25 ఏళ్లలో మన లక్ష్యాల సాధనకు దిక్సూచి అని చెప్పారు. మన రాజ్యాంగ ఒరిజినల్ కాపీపై రాముడు, లక్ష్మణుడు, సీతామాత చిత్రాలు ఉన్నాయని గుర్తుచేశారు. మన రాజ్యాంగ హక్కులకు అది మరో గ్యారంటీ అని అభివర్ణించారు.



దీపావళి సందర్భంగా అయోధ్యలో రామ మందిర కాంప్లెక్స్‌పై లేజర్ షో ద్వారా ప్రదర్శితమవుతున్న రామాయణాన్ని, సెల్ ఫోన్లలో బంధిస్తున్న వేలాది మంది భక్తులు.



అయోధ్యలో రామునికి మోదీ పూజలు

క్లుప్తంగా

శ్రీసిటీలో జపాన్ బృందం



జపాన్ ప్రతినిధుల బృందానికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

వరదయ్యపాళెం: జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమలశాఖకు చెందిన ట్రేడ్ అండ్ ఎకనామిక్ కో–ఆపరేషన్ బ్యూరో డైరెక్టర్ ఓట మినికో నేతృత్వంలో అసోసియేషన్ ఫర్ ఓవర్‌సీస్ టెక్నికల్ కో–ఆపరేషన్ అండ్ సస్టెయినబుల్ పార్ట్‌నర్‌షిప్స్ అధికారుల బృందం ఆదివారం శ్రీసిటీని సందర్శించింది. వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీలోని రెసిడెన్షియల్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ అయిన జపాన్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ మాన్యుఫాక్చరింగ్ (జిమ్)ను సమీక్షించడానికి వచ్చిన వారికి అభినందనలు తెలిపారు.

క్యాన్సర్ కేర్ సలహాదారుగా చంద్రశేఖర్‌రావు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ సలహాదారు (క్యాన్సర్ కేర్)గా సర్జికల్ అంకాలజీలో 33 ఏళ్ల అనుభవం గల డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ అంకాలజీలో సభ్యుడుగా చంద్రశేఖర్‌రావు ఉన్నారు. రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్యాన్సర్ వైద్యాన్ని బలోపేతం చేయడంతోపాటు వ్యాధి నియంత్రణకు సర్కార్ గట్టి చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే చంద్రశేఖర్‌రావును ప్రభుత్వ సలహాదారుగా నియమించారు.

నేడు ఆర్జిత సేవలు రద్దు

రేపు శ్రీవారి ఆలయం మూత



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా సోమవారం 'దీపావళి ఆస్థానాన్ని' టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. దీపావళి నాడు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం జరుగుతుంది. ఆస్థానంలో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి ఘంటా మండపంలో ఏర్పాటు చేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారిని కూడా స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ అభిముఖంగా వేంచేపు చేస్తారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది. కాగా సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. దీపావళి ఆస్థానం కారణంగా 24న కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా మంగళవారం సూర్యగ్రహణం కారణంగా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సుమారు 12 గంటల పాటు శ్రీవారి ఆలయం తలుపులు మూసివేయనున్నారు. ఈ కారణంగా బ్రేక్ దర్శనం కూడా రద్దు చేశారు. అనంతరం సామాన్య భక్తులకు దర్శనానికి అనుమతిస్తారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శ్రీవారి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతుంది.

శ్రీశైలానికి 2,45,776 క్యూసెక్కుల నీరు

- 7 గేట్లు ఎత్తి సాగర్‌కు నీటివిడుదల
- నాగార్జునసాగర్ 8 గేట్ల ద్వారా దిగువకు నీరు



7 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్‌కు విడుదల అవుతున్న నీరు

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్/సత్రశాల(రెంటచింతల): శ్రీశైలం జలాశయానికి జూరాల, సుంకేసుల నుంచి ఆదివారం సాయంత్రం సమయానికి 2,45,776 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో ఏడుగేట్లను పదడుగులు ఎత్తి 1,95,559 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి అనంతరం 67,949 క్యూసెక్కులను దిగువకు వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 5,750 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,137 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 884.70 అడుగుల మట్టంలో 213.8824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ జలాశయానికి 2,11,357 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఎనిమిది గేట్లు, విద్యుదుత్పాదన అనంతరం మొత్తం 1,53,035 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలు, ఎస్‌ఎల్‌బీసీ, వరద కాల్వలకు మొత్తం 16,822 క్యూసెక్కులు వదులుతున్నారు. సాగర్ జలాశయంలో నీటిమట్టం 589.80 అడుగులకు చేరింది. నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి ఆరు గేట్లు, విద్యుదుత్పత్తి అనంతరం 1,15,339 క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

● తెలంగాణ

దేశం రెండుగా విడిపోయింది

- మళ్లీ ఏకం చేసేందుకే భారత్ జోడో యాత్ర
- అన్ని వర్గాలకు న్యాయం, ఉపాధి దొరికే భారతదేశం కావాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- తెలంగాణలోకి ప్రవేశించిన పాదయాత్ర..
- తొలిరోజు గంటలోనే ముగిసిన యాత్ర.. ఢిల్లీకి పయనం.. మళ్లీ 27 నుంచి పునఃప్రారంభం..



సాక్షి, హైదరాబాద్: 'వేళ్ల మీద లెక్కపెట్టగలిగిన ధనవంతుల భారతదేశం ఓ వైపు.. కోట్లాది మంది కార్మికులు, కర్షకులు, నిరుద్యోగులు, యువత, మహిళలు, చిరు వ్యాపారులుండే దేశం మరోవైపు.. ఇప్పుడిలా భారతదేశం రెండుగా విడిపోయి ఉంది. మనకు రెండుగా విడిపోయిన దేశం వద్దు. ఒక్కటే భారత్ కావాలి. కార్మిక లోకానికి, యువతకు, అన్ని వర్గాలకు న్యాయం, ఉపాధి దొరికే భారతదేశం కావాలి. రెండుగా విడిపోయిన దేశాన్ని ఏకం చేసేందుకే భారత్ జోడో యాత్ర చేపట్టాను' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. ఆయన చేపట్టిన పాదయాత్ర ఆదివారం తెలంగాణలోకి ప్రవేశించింది. తొలిరోజున కర్ణాటక, తెలంగాణ సరిహద్దుల్లో కృష్ణా వంతెన నుంచి 4 కిలోమీటర్లు నడిచిన రాహుల్.. నారాయణపేట జిల్లా కృష్ణా మండలం టైరోడ్ జంక్షన్ వద్ద పార్టీ శ్రేణులు, అభిమానులను ఉద్దేశించి మాట్లాడారు. దేశాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తుల నుంచి కాపాడేందుకు, మతతత్వ భావజాలానికి, దేశంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా.. ధరల పెరుగుదల, నిరుద్యోగ అంశాలను ప్రశ్నిస్తూ తన యాత్ర సాగుతోందని చెప్పారు. దీనిని ఎవరూ ఆపలేరన్నారు. తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పతాకాన్ని అందుకున్న రేవంత్

ఆదివారం కర్ణాటకలోని రాయచూరు జిల్లా నుంచి మొదలైన రాహుల్ యాత్ర నారాయణపేట జిల్లా కృష్ణా మండలం గూడబల్లేరు గ్రామ సమీపంలోని కృష్ణా నదిపై వంతెన మీదుగా ఉదయం 8:50 గంటలకు తెలంగాణలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, సీనియర్ నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, వీహెచ్, గీతారెడ్డి, చిన్నారెడ్డి, మల్లు రవి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సీతక్క తదితరులు రాహుల్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ జాతీయ పతాకాన్ని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి అందజేశారు. సుమారు గంటపాటు పర్యటించిన రాహుల్‌గాంధీ కొద్దిసేపు పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం తెలంగాణలో తొలిరోజు భారత్ జోడో యాత్ర ముగిసింది. అనంతరం సుమారు 9:50 గంటల సమయంలో టైరోడ్ జంక్షన్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ప్రత్యేక హెలికాప్టర్ ఎక్కి రాహుల్ శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో రాహుల్ ఢిల్లీకి వెళ్లిపోయారు. ఈ నెల 27న ఉదయం 6:30 గంటలకు మళ్లీ యాత్ర ప్రారంభమై.. వచ్చే నెల 7వ తేదీ వరకు కొనసాగనుంది.

ఓటర్లకు ప్రలోభాలపై ఈసీ సీరియస్!

- డబ్బులిచ్చినా, తీసుకున్నా కేసులు
- విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మునుగోడు అసెంబ్లీ ఉపఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు తాయిలాలు అందిస్తున్నారని, ప్రలోభాలకు గురిచేస్తున్నారని వస్తున్న ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. విచ్చలవిడిగా డబ్బులు, మద్యం, ఇతర తాయిలాలను పంపిణీ చేస్తున్నవారిపై, తీసుకున్నవారిపై ఐపీసీ సెక్షన్ 171(బీ) కింద కేసులు నమోదు చేయాలని ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఎవరైనా అభ్యర్థిని/ఓటరును/మరే ఇతర వ్యక్తిని బెదిరించినా, గాయపర్చినా సెక్షన్ 171(సీ) కింద కేసు పెట్టాలని సూచించింది. ఈ రెండు కేసుల్లో ఏడాది జైలుశిక్ష లేదా జరిమానా లేదా రెండింటిని విధించే అవకాశం ఉంటుందని హెచ్చరించింది. ఈ నిబంధనలపై విస్తృత ప్రచారం కల్పించాలని ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను ఆదేశించింది. ఉప ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) వికాస్‌రాజ్ ఆదివారం వెల్లడించారు.

మునుగోడుకు అదనంగా పరిశీలకులు

ఎన్నికల అదనపు పరిశీలకులుగా ఐఆర్‌ఎస్ అధికారి సుభోత్ సింగ్, ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ఐఆర్‌ఎస్ అధికారి సమత ముళ్లపూడిని తాజాగా నియమించింది.

ఆడియో.. వీడియో.. షోకాజ్

- ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్టానం సన్నద్ధం
- బీజేపీకి ఓటేయాలని చెప్పడాన్ని సీరియస్‌గా తీసుకున్న అధిష్టానం
- పది రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ వెంకటరెడ్డికి షోకాజ్ నోటీస్

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: మునుగోడు ఉప ఎన్నికలో తన తమ్ముడు, బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి గెలుస్తాడంటూ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపుతూనే ఉన్నాయి. ప్రతిష్టాత్మక ఉప ఎన్నిక ఓవైపు, రాహుల్ గాంధీ పాదయాత్ర మరోవైపు ఉన్న సమయంలో వెంకటరెడ్డి వ్యవహరించిన తీరు కాంగ్రెస్ అధిష్టానం ఆగ్రహం తెప్పించింది. ఆయన వ్యాఖ్యలకు సంబంధించి బహిర్గతమైన ఆడియో, వీడియోల ఆధారంగా చర్యలు చేపట్టేందుకు అధిష్టానం సిద్ధమైంది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారంటూ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కాంగ్రెస్ షోకాజ్ నోటీసు జారీ చేసింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా.. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం మెంబర్ సెక్రెటరీ తారిఖ్ అన్వర్ ఈ నోటీస్ జారీ చేశారు. "మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని స్థానిక కాంగ్రెస్ నేతతో మాట్లాడినట్టు ఓ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

మగవాళ్లకు విస్కీ, మహిళలకు బీరు!

మునుగోడులో ఓటర్లకు మద్యం, మాంసం పంపిణీ

మునుగోడు: మునుగోడు ఉప ఎన్నికలో ఓటర్లని ప్రలోభాలకు గురిచేసేందుకు రాజకీయ పార్టీలు మద్యం, మాంసం పంపిణీ చేస్తున్నాయి. నిన్నటి వరకు కేవలం బూత్‌స్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తలకు మాత్రమే మద్యం తాగించిన నాయకులు ఆదివారం ఓటర్లకు మద్యం పంపిణీ ప్రారంభించారు. ఓ పార్టీకి చెందిన నాయకులు.. ఓటు హక్కు కలిగిన పురుషులకు క్వాటర్ విస్కీ, మహిళలకు బీరు సీసా చొప్పున ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. దీంతోపాటు సోమవారం ఉదయం రెండు ఓట్లకు అరకిలో, నాలుగు ఓట్లు కలిగిన ఇంటికి ఒక కిలో చొప్పున చికెన్ పంపిణీ చేస్తామని చెప్పినట్లు తెలిసింది. ఈ పంపిణీ అంతా ఇతర జిల్లాల నుంచి వచ్చి ప్రచారం చేస్తున్న ఇన్‌చార్జీలు, స్థానికంగా ఉన్న నాయకులల్లో కొందరి సహాయం తీసుకొని చేస్తున్నట్లు తెలిసింది. అయితే, తమకు క్వాటర్ విస్కీ, బీరు ఇస్తే సరిపోదని, కనీసం ఇంటికి ఒక ఫుల్ బాటిల్ విస్కీ, నాలుగు బీర్ల చొప్పున ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. పోలింగ్‌కు పది రోజుల ముందు నుంచే మద్యం, మాసం పంపిణీ జరుగుతుంటే.. ముమ్ముందు పంపిణీ ఇంకా ఎలా ఉంటోందనని ఓటర్లు చర్చించుకుంటున్నారు.

తుపానుగా మారిన వాయుగుండం

రాష్ట్రానికి ముప్పు తప్పినట్టే

సాక్షి, విశాఖపట్నం/అమరావతి: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తూర్పుమధ్య ప్రాంతానికి ఆనుకుని కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ఆదివారం సాయంత్రానికి అదే ప్రాంతంలో తుపానుగా బలపడింది. దీనికి థాయ్‌లాండ్ సూచించిన 'సిత్రాంగ్' అనే పేరు పెట్టారు. ఆదివారం రాత్రి 8 గంటలకు ఈ తుపాను పోర్టుబ్లెయిర్‌కు వాయవ్యంగా 730 కి.మీ., పశ్చిమ బెంగాల్‌లోని సాగర్ ద్వీపానికి దక్షిణంగా 580 కి.మీ., బంగ్లాదేశ్‌లోని బరిసాల్‌కు దక్షిణ నైరుతి దిశలో 740 కి.మీ. దూరంలో కొనసాగుతోంది. ఇది ఉత్తర ఈశాన్య దిశగా పయనిస్తూ సోమవారం నాటికి తీవ్ర తుపానుగా మారనుంది. అనంతరం బంగ్లాదేశ్‌లోని టింకోనా ద్వీపం, సాండ్విప్ మధ్య బారిసాల్‌కు సమీపంలో ఈ నెల 25 వేకువజామున తీరాన్ని దాటుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి బులెటిన్‌లో వెల్లడించింది.

సీఏఎస్ పోస్టులకు మూడో విడత ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలో సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా మూడో విడత ఎంపిక జాబితాను ఆదివారం విడుదల చేశారు. డీహెచ్, ఏపీవీవీపీ, డీఎంఈలో 846 పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మెరిట్ ఆధారంగా పలువురిని ఎంపిక చేసి ఇప్పటికే రెండు జాబితాలు విడుదల చేసి పోస్టింగ్‌లు ఇచ్చింది. వివిధ కారణాల వల్ల కొందరు జాయిన్ అవ్వలేదు. ఈ నేపథ్యంలో తుది మెరిట్ జాబితాలో అర్హులైన మరో 211 మంది అభ్యర్థులతో మూడో విడత ఎంపిక జాబితాను విడుదల చేశారు. వీరికి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇస్తామని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. విజయవాడలోని హెల్త్ యూనివర్సిటీలో కౌన్సెలింగ్ ఉంటుందని.. ధ్రువపత్రాలతో రావాలని కోరారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



ధన్వంతరి జయంతి సభలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

భవానీపురం (విజయవాడ పశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని, బీసీలకు పెద్దపీట వేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించటమే ఇందుకు నిదర్శనమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. భగవాన్ ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నాయీబ్రాహ్మణ సంఘీయుల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాయీబ్రాహ్మణులు నిర్వహించే షాపులకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్, షాపుల యజమానులకు ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తూ వారి అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. దేవాలయాల పాలక మండళ్లలో నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వివరించారు. తమ సమస్యలను చెప్పుకునేందుకు సచివాలయానికి వెళ్లిన నాయీబ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానంటూ అవమానించిన ఘనుడు చంద్రబాబు అని గుర్తుచేశారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకుని అన్యాయం చేసిందని, జగనన్న ప్రభుత్వం బీసీలకు చట్టసభల్లో స్థానం కల్పించిందని పేర్కొన్నారు. ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.కనకారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నవరత్నాలు అమలు కమిటీ వైస్ చైర్మన్ అంకమరెడ్డి నారాయణమూర్తి, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, డీసీపీ కార్యాలయం జేడీ ఆఫ్ ట్రజరీస్ కె.సురేంద్రబాబు, ఎ.ఎస్.వి. నాంచారరావు, పి.మురళీకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ సంఘానికి చెందిన సీనియర్ వైద్యులను సత్కరించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

ర్యాబిస్‌పై వీఎంసీ ప్రత్యేక దృష్టి

- వీధి కుక్కలకు వ్యాధినివారణ వ్యాక్సిన్లు
- రాష్ట్రీయ కృషి యోజన ద్వారా సరఫరా
- కుక్కకాటు రహిత దేశం కోసం ప్రణాళిక



పటమట (విజయవాడ తూర్పు): ప్రతి తొమ్మిది నిమిషాలకు ప్రపంచ వ్యాప్తంగా సగటున ఓ వీధి కుక్క కాటు నమోదవుతోంది. విజయవాడ నగరంలో రోజుకు మూడు నుంచి నాలుగు చొప్పున ఏటా 1500 నుంచి రెండు వేల కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ యానిమల్ హెల్త్ ఆధ్వర్యంలో దేశంలో, రాష్ట్రంలో, విజయవాడలో ర్యాబిస్‌ను నిరోధించేందుకు పకబడ్బందీగా ఏర్పాటు చేస్తోంది. ఇందుకు ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల స్థానిక సంస్థల వెటర్నరీ అధికారులతో బెంగళూరులో సమీక్ష నిర్వహించింది. వీధికుక్కలకు తప్పనిసరిగా ర్యాబిస్ వ్యాక్సిన్లు వేయాలని, అందుకు అవసరమైన మౌలిక వసతులు, నిధులను గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు కల్పించాలని ఆ సమావేశం సూచించింది.

కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం

కుక్కలు, నక్కలు వంటి జంతువుల కాటు వల్ల దేశ వ్యాప్తంగా రోజుకు సగటున రెండు నుంచి నాలుగు మరణాలు సంభవిస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మరణాలను నిరోధించేందుకు రాష్ట్రాల్లో డాగ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధివిధానాలు, ప్రణాళికలను 2023 మార్చి నాటికి నివేదించాలని, 2030 నాటికి వీధి కుక్కకాట్ల రహిత దేశం కోసం చర్యలు తీసుకోవాలని సూచించింది.

విజయవాడలో ఇలా..

ఇటీవల జరిగిన సర్వే ప్రకారం నగరంలోని 64 డివిజన్లలో 3,500 పైచిలుకు వీధికుక్కలు ఉన్నాయి. సగటున రోజుకు 40 కుక్కలకు స్టెరిలైజేషన్ చికిత్స జరుగుతోంది. నగర శివారు ప్రాంతాలైన రామవరప్పాడు, కానూరు, యనమలకుదురు, నున్న, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి, గొల్లపూడి నుంచి వచ్చే వీధికుక్కలు సమస్యాత్మకంగా మారుతున్నాయని వీఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. వీధి కుక్కలకు తప్పనిసరిగా ర్యాబిస్ వ్యాక్సిన్లు వేయాలని వీఎంసీ నిర్ణయించింది. అజిత్‌సింగ్‌నగర్‌లో ఉన్న క్లినిక్‌తోపాటు మూడు సర్కిళ్ల పరిధిలో మరికొన్ని క్లినిక్‌లు ఏర్పాటు చేయనుంది. ఆయా క్లినిక్‌లలో అవసరమైన మౌలిక వసతులను వీఎంసీ కల్పిస్తుండగా ఆర్‌కేవీవై (రాష్ట్రీయ కృషి వికాస్ యోజన) నిధుల నుంచి వ్యాక్సిన్లు సరఫరా చేయనున్నారు.

ప్రత్యేక ప్రణాళిక

కుక్క కాటులపై అవగాహన కార్యక్రమాల నిర్వహణ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు విస్తృత ప్రచారం, నేషనల్ యానిమల్ డిసీజ్ రిపోర్టింగ్ సిస్టమ్ పోర్టల్‌లో కుక్కకాటు కేసు నమోదు, ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల డిపార్టుమెంట్ ఆఫ్ మైక్రోబయాలజీ ఆధ్వర్యంలో ర్యాబిస్ డయాగ్నోస్టిక్స్ ఏర్పాటు, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న డాష్‌బోర్డులో నివేదికల నమోదు, ర్యాపిడ్ రెస్పాన్స్, టాస్క్‌ఫోర్స్ టీంల ఏర్పాటు, ఏబీసీలుగా క్లస్టర్లు ఏర్పాటు చేసి మూడు నెలల్లో పూర్తిస్థాయిలో కుక్కలకు ర్యాబీస్ వ్యాక్సిన్ వేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.

మూడు నెలల్లో కుక్కలకు వ్యాక్సిన్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం మార్చి 2023 నాటికి కుక్కలకు పూర్తి స్థాయిలో ర్యాబిస్ వ్యాక్సిన్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. నగరంలో వీధి కుక్కలకు వ్యాక్సిన్లు వేసినప్పటికీ శివారు ప్రాంతాలైన నున్న, కానూరు, రామవరప్పాడు, గొల్లపూడి, యనమలకుదురు నుంచి వచ్చే కుక్కల వల్ల సమస్య మరింత జటిలంగా మారుతోంది. దీనిపై దృష్టిసారించి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎ.రవిచంద్, వెంటర్నరీ అసిస్టెంట్ సర్జన్, వీఎంసీ

'ఏ ఫార్మర్స్ వాయిస్ ఇన్ పార్లమెంట్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ, వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ, పాత్రికేయులు రామచంద్రమూర్తి, అమిర్నేని హరికృష్ణ తదితరులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): మాజీ మంత్రి, మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు రాసిన 'ఏ ఫార్మర్స్ వాయిస్ ఇన్ పార్లమెంట్' అందరూ చదవాల్సిన పుస్తకమని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథి జస్టిస్ గోపాల గౌడ పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. ఈ పుస్తకం రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కోర్టుల్లోని గ్రంథాలయాల్లో ఉండాలన్నారు. వ్యవసాయం రంగానికి సంబంధించిన అంశాలే కాకుండా వివిధ కుంభకోణాలకు సంబంధించిన ఎంతో విలువైన సమాచారాన్ని ఈ పుస్తకంలో రాశారని వివరించారు. విశిష్ట అతిథిగా హాజరైన సీబీఐ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. సివిల్స్‌కు సిద్ధమవుతున్న యువత ఈ పుస్తకాన్ని తప్పకుండా చదవాలన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన ఆల్ ఇండియా పవర్‌మెన్ ఫెడరేషన్ ప్రతినిధి కె.అశోక్‌రావు మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొస్తున్న విద్యుత్ సంస్కరణల వల్ల భవిష్యత్‌లో అనేక సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. సభకు అధ్యక్షత వహించిన పాత్రికేయుడు కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. వడ్డే శోభనాద్రీశ్వరరావు ఎంపీగా ఉన్న సమయంలో తాను పార్లమెంట్ సమావేశాలను కవర్ చేశానన్నారు. ఆ సమయంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు చేసే ప్రసంగాలను చాలా ఆసక్తిగా వినేవారమని, హిందీ, ఇంగ్లిషు భాషలకు చెందిన వివిధ పత్రికా ప్రతినిధులు సైతం వడ్డే దగ్గరకు వచ్చి తమ సందేహాలను నివృత్తి చేసుకునే వారని గుర్తుచేసుకున్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంటేశ్వరరావు, అమిర్నేని హరికృష్ణను అతిథులు సత్కరించారు. పుస్తక రచయిత వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎస్‌వీడీఎస్ లా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.దివాకర్‌బాబు పాల్గొన్నారు.

జాతీయ సాంస్కృతిక ఉత్సవాలకు తెనాలి బాల



డాక్టర్ బాలత్రిపుర సుందరి

తెనాలి: ఉన్నత చదువులు చదివి క్యాంపస్‌లోనే సాఫ్ట్‌వేర్ కొలువు ఆహ్వానించినా, ఊహతోనే అల్లుకున్న నాట్యబంధానికి కట్టుబడిందా యువతి. నాలుగేళ్ల వయసునుంచి అల్లుకున్న 'కూచిపూడి' బంధాన్ని ఉద్యోగం పేరుతో వదులుకునేందుకు మనసొప్పుకోలేదు. శ్వాస, ధ్యాసగా మారిన కూచిపూడి నాట్య వెలుగు ఉజ్వలంగా ప్రకాశించేందుకు కృషిచేయాలన్న సంకల్పం తీసుకుంది. ఆ క్రమంలో ఎన్నో ప్రతిష్టాత్మక వేదికలపై నర్తించింది.గర్వించదగ్గ పురస్కారాలను వరించింది. తాజాగా భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ జాతీయ సాంస్కృతిక వేడుకలకు ఆంధ్రప్రదేశ్ నుంచి తన బృందంతో ఎంపికవడం విశేషం. ఆ యువకళాకారిణి డాక్టర్ చల్లా బాలత్రిపురసుందరి. కూచిపూడి నృత్యకళలో పరిణితి చెందిన కళాకారిణి, నాట్యగురువు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్, తంజావూర్, గుజరాత్ రాష్ట్రప్రభుత్వంతో కలిసి సంయుక్తంగా ఈనెల 31న 'రాష్ట్రీయ ఏక్తా దివస్'ను నిర్వహించనుంది. గుజరాత్‌లోని కేవడియాలో జరిగే ఈ వేడుకలు 27వ తేదీనుంచి ఆరంభమవుతాయి. కూచిపూడి నృత్యప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ నుంచి డాక్టర్ బాలత్రిపుర సుందరికి ఆహ్వానం లభించింది. ఈ ప్రతిష్టాత్మక జాతీయ వేడుకలో తన బృందంతో సహా డాక్టర్ బాల నర్తించనుంది.

అమ్మవారి పేరుకు తగినట్టే ...

బాలత్రిపురసుందరి తలిదండ్రులు చల్లా వెంకట విజయలక్ష్మి, గురునాథరావు. తమ ఏకైక కుమార్తెను బడిలో వేసిందగ్గర్నుంచి నాట్యం నేర్పిస్తూ వచ్చారు. ఇటు చదువు, అటు నాట్యసాధనను కొనసాగిస్తూ వచ్చిన బాల, భరతనాట్యం, ఆంధ్ర నాట్యం, జానపద నృత్యరీతుల్లో ప్రావీణ్యం సంపాదించారు. ఎమ్మెస్సీ (కంప్యూటర్స్) ఫైనలియర్‌లో 'విప్రో'లో ఉద్యోగం వచ్చినా, నాట్యంపై అనురక్తితో కాదనుకున్నారు. కూచిపూడి, యక్షగానంలో డిప్లొమాలు చేసి, పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్‌లో ఎంఏ పూర్తిచేశారు. దూరదర్శన్ కళాకారిణి కూడా. అమ్మవారి పేరుకు తగినట్టే తన కనకదుర్గమ్మను తన హావభావాలతో సాక్షాత్కరింపజేసి, ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే ప్రతిభ బాల సొంతం. ప్రేమ, వాత్సల్యం, కరుణ, రౌద్రరసాలను అలవోకగా అభినయించగలిగేలా తనను తాను తీర్చిదిద్దుకున్నారు.

ఆర్యవైశ్యులకు మేలు చేసిన ఘనత సీఎం జగన్‌దే

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్

చిలకలూరిపేట: రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు మేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని దేవదాయ, ధర్మాదాయ శాఖ మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్యవైశ్య సత్రాలు, దేవాలయాలను ఆర్యవైశ్యులే నిర్వహించుకొనేలా జీఓ విడదల చేశారని తెలిపారు. చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి పాత్ర ఆర్యవైశ్యులను అవమానించే విధంగా ఉన్న నేపథ్యంలో చింతామణి నాటకాన్ని నిషేధించి ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని నిలిపారని కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించే విధంగా చట్టం తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల సమస్యలు పరిష్కరించే విషయంలో ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ రేపాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉన్నప్పుడే సమాజంలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమానికి రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఆవోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్టి శ్రీరాములు అధ్యక్షత వహించారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా కొప్పురావూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దామిశెట్టి నాగేంద్రం, కోశాధికారిగా పొత్తూరి బ్రహ్మానందం, చీఫ్ ఆర్గనైజర్‌గా మురికిపూడి ప్రసాద్, ఇతర కార్యవర్గ సభ్యులతో ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అడ్డగిరి ద్వారకా వాసు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు పోలిశెట్టి మస్తాన్‌రావు, మాజీ చైర్మన్ మాజేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విశాల దృక్పథంతోనే విశాఖ రాజధాని



శ్రీకాకుళం రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు



నెల్లూరు రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మేధావులు

మూడు ప్రాంతాల అభివృద్ధితోనే అందరికీ న్యాయం

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ నిర్ణయం
- విశాఖకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వాళ్లని ద్రోహులుగానే చూడాలి
- శ్రీకాకుళం, నెల్లూరు రౌండ్ టేబుల్ సమావేశాల్లో మేధావుల ఉద్ఘాటన

శ్రీకాకుళం అర్బన్/నెల్లూరు (వీఆర్సీ సెంటర్) : ఆంధ్రప్రదేశ్‌కు పరిపాలన రాజధాని విశాఖపట్నమేనని, దీన్ని సాధించుకోవడమే ఉత్తరాంధ్ర వాసుల ధ్యేయమని విద్యావేత్తలు, మేధావులు, వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు పునరుద్ఘాటించారు. కేంద్రం ప్రతిపాదించిన విధంగా పునర్విభజన చట్టం సెక్షన్-6 అన్నది పరిపాలన వికేంద్రీకరణను ధ్రువీకరిస్తోందని, హ్యాజ్ క్యాపిటల్ అన్నది ఎక్కడా పెట్టకూడదని చెప్పిందని వారు స్పష్టంచేశారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న విశాల దృక్పథంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించారని.. అప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని వారు ముక్తకంఠంతో అభిప్రాయపడ్డారు. విశాఖ పరిపాలన రాజధాని కావాలని కాంక్షిస్తూ ఆదివారం విశాఖ రాజధాని సాధన ఐక్య వేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో.. అలాగే, నెల్లూరు జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని సీపీఆర్ కల్యాణ మండపంలో రౌండ్‌టేబుల్ సమావేశాలు జరిగాయి. శ్రీకాకుళం సమావేశంలో వక్తలు ప్రసంగిస్తూ.. రాష్ట్ర విభజనానంతరం నాటి సీఎం చంద్రబాబునాయుడు అప్పటి మంత్రి నారాయణ నేతృత్వంలో కమిటీ వేశారని.. చట్టబద్ధత ఉన్న కేంద్ర కమిటీ నిర్ణయాలను కాదని, బాబు తన కమిటీ నివేదిక ఆధారంగా అమరావతిని రాజధానిగా అని ఎలా నిర్ణయించారని ప్రశ్నించారు. ఆ రోజున మూడువేలకు పైగా జీఓలు జారీచేసి అమరావతికి అనుకూలంగా నిర్ణయం వెలువరించారన్నారు. జల, వాయు, రైల్వే, రోడ్డు మార్గాలు రవాణాకు అనుకూలంగా ఉన్నాయని, దీనివల్ల విశాఖతో పాటు ఉత్తరాంధ్ర కూడా అభివృద్ధి చెందుతుందని వారు చెప్పారు.

విపక్షాల రాద్ధాంతం శోచనీయం

ఐక్యసమితి కన్వీనర్ డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ.. ఆనాటి పాలకులు ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష, కోరికను గుర్తించలేదని, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆకాంక్ష, కోరికను గుర్తించి విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటిస్తే విపక్షాలు రాద్ధాంతం చేయడం శోచనీయమన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఇంకా వెనుకబడే ఉండాలా అని ప్రశ్నించారు. ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, సీనియర్ పాత్రికేయులు నల్లి ధర్మారావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులు సన్నశెట్టి రాజశేఖర్ ప్రసంగిస్తూ.. గతంలో ఒక్క హైదరాబాద్‌నే అభివృద్ధి చేయడంవల్ల ఎంతగా నష్టపోయామో మనందరికీ తెలుసన్నారు. గత 30 ఏళ్లుగా ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై గళం విప్పుతూనే ఉన్నామని, ఇప్పుడు సీఎం జగన్ విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించడం హర్షణీయమన్నారు. ఇందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక ఈ సమావేశానికి సంఘీభావం తెలిపేందుకు విచ్చేసిన మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. విశాఖకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వాళ్లని ద్రోహులుగానే చూడాలన్నారు.

మూడు రాజధానులవల్లే రాష్ట్రాభివృద్ధి

మరోవైపు.. నెల్లూరు సమావేశంలో జేఏసీ కన్వీనర్ షంషుద్దీన్ మాట్లాడుతూ.. మూడు రాజధానులతోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది, రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని స్పష్టంచేశారు. రాష్ట్రానికి రాజధాని విషయంలో గత పాలకులు మోసం చేశారని, ప్రజల మనోభావాలు పట్టించుకోకపోవడంతో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ప్రజల ఆకాంక్షకు అద్దంపట్టేలా ఉందన్నారు. భావితరాల కోసం మూడు రాజధానుల అవసరం ఉందని, ముఖ్యమంత్రి నిర్ణయానికి జేఏసీ పూర్తి మద్దతిస్తుందని, అందుకు జేఏసీ తీవ్రంగా పోరాడుతుందన్నారు. హైకోర్టు నిబంధనలతో అమరావతి రైతుల పాదయాత్ర నకిలీ రైతుల పాదయాత్రగా తేలిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మేరిగ మురళి, ఏపీ స్టేట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ చైర్మన్ సైదానిరియాజ్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వల్లూరు కృష్ణారెడ్డి, జేఏసీ కో కన్వీనర్లు రమేష్‌బాబు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా 3 రాజధానుల ఏర్పాటు

ఓటుకు నోటు కేసుతో భయపడిన చంద్రబాబు అమరావతికి పారిపోయి ఆ ప్రాంతాన్ని సింగపూర్‌లా చేస్తానని గ్రాఫిక్స్‌తో ప్రజలను మభ్యపెట్టాడు. కానీ, అన్ని వర్గాలు ప్రశాంతంగా ఉంటూ, అభివృద్ధి చెందిన విశాఖపట్నాన్ని కాదని మోసం చేశాడు. మూడు రాజధానుల ఏర్పాటును ఒక ఉద్యమంలా చేపట్టాలి.
– మేరిగ మురళి, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్

సీఎంకు అందరూ మద్దతివ్వాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర తెలుసుకున్నారు కాబట్టే మూడు రాజధానులను ఏర్పాటుచేసేందుకు సిద్ధమయ్యారు. అమరావతితో పాటు, కర్నూలు, వైజాగ్‌లను కూడా రాజధానులుగా చేసే ఆయన ప్రయత్నానికి రాష్ట్ర ప్రజలందరూ భావితరాల కోసం సంపూర్ణ మద్దతు ఇవ్వాలి.
– పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి

సీఎం నిర్ణయం శుభపరిణామం

ఒక ప్రాంతాన్నే రాజధానిని చేసి.. ఒకేచోట పెట్టుబడులు పెడితే ఆ ప్రాంతవాసులే అభివృద్ధి చెందుతారు. తద్వారా మిగిలిన ప్రాంతాలు వెనుకబడిపోయి అక్కడి ప్రజలు నష్టపోతారు. ముందుచూపుతో ముఖ్యమంత్రి మూడు రాజధానులను ఏర్పాటుచేయాలనుకోవడం శుభ పరిణామం.
– రమేష్‌బాబు, మూడు రాజధానుల మద్దతు జేఏసీ కోకన్వీనర్

మహిళలకు బ్యాంకుల రెట్టింపు రుణాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళలకు బ్యాంకులు పెద్దపీట వేశాయి. ఒక్క ఏడాదిలోనే రెట్టింపు రుణాలను మంజూరు చేశాయి. గత ఏడాది మార్చి నెలాఖరు నాటికి బ్యాంకులు రూ.51,127 కోట్ల మేర రుణాలు మంజూరు చేయగా అదే ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఏకంగా రూ.1,05,399 కోట్లు ఇచ్చాయి. అంటే ఏడాదిలోనే బ్యాంకులు మహిళలకు రెట్టింపుకు పైగా రూ.54,272 కోట్లు (106 శాతం) మేర రుణాలను మంజూరు చేశాయి. నిజానికి.. ఆర్‌బీఐ నిబంధనల మేరకు మొత్తం రుణాల మంజూరులో ఐదు శాతం మేర రుణాలను మహిళలకు ఇవ్వాలని ఉంది. కానీ, రాష్ట్రంలో మహిళలకు ఆర్‌బీఐ నిబంధనలకు మించి 20.95 శాతం మేర రుణాలను మంజూరు చేశాయని ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నివేదిక వెల్లడించింది. ఇందుకు ప్రధాన కారణం మహిళల జీవనోపాధి మెరుగుదల.. మహిళా సాధికారత సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం వారికి అమలుచేస్తున్న పథకాలేనని స్పష్టమవుతోంది. ఇందులో భాగంగానే.. ఎన్నికల్లో హామీఇచ్చిన మేరకు స్వయం సహాయక సంఘాల మహిళలకు ఎన్నికల నాటికి ఉన్న రుణాలను నాలుగు విడతల్లో తిరిగి ఇచ్చేందుకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలుచేస్తున్న విషయం తెలిసిందే. అంతేకాక.. సకాలంలో రుణాలు చెల్లించే స్వయం సహాయక సంఘాల మహిళలకు సున్నా వడ్డీని ప్రభుత్వం క్రమం తప్పకుండా అమలు చేస్తోంది. దీంతో పొదుపు సంఘాల మహిళల్లో క్రమశిక్షణ పెరిగింది. ఈ నేపథ్యంలో.. చేయూత, ఆసరా పథకాల మహిళలకు బ్యాంకులు గత మూడేళ్ల నుంచి లక్ష్యానికి మించి రుణాలు మంజూరు చేశాయి.

ఇంటి నిర్మాణానికీ పావలా వడ్డీకే రుణం

అలాగే, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరు చేసిన 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను మహిళల పేరిటే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో పేదల ఇళ్ల నిర్మాణాల నిమిత్తం బ్యాంకులు ఒక్కో ఇంటి లబ్ధిదారునికి రూ.35 వేల చొప్పున పావలా వడ్డీకే రుణాలిస్తున్నాయి. ఇలా గత నెలాఖరు నాటికి 5.21 లక్షల మంది ఇళ్ల లబ్ధిదారులైన మహిళలకు బ్యాంకులు రూ.1,836 కోట్లు మంజూరు చేశాయి.

క్లుప్తంగా

విశాఖ రాజధాని కోసం అరసవిల్లిలో పూజలు



విశాఖకు అనుకూలంగా నినాదాలు చేస్తున్న జేఏసీ చైర్మన్ లజపతిరాయ్, అంధవరపు సూరిబాబు తదితరులు

అరసవల్లి: విశాఖ పరిపాలన రాజధాని కావాలని ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ నినదించారు. జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి ఆదిత్యుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరావతి ఒక్కటే రాజధానిగా ఉంటే భవిష్యత్ తరాలకు తీవ్ర ఇబ్బందులుంటాయని, అలా కాకుండా వికేంద్రీకరణలో భాగంగా విశాఖను పరిపాలన రాజధానిని చేస్తే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. 26 జిల్లాల అభివృద్ధి కావాలని కోరుతూ 26 కొబ్బరి కాయలు కొట్టారు. అమరావతి రైతుల పేరిట నిర్వహిస్తున్న పాదయాత్రకు బ్రేక్ పడటం శుభపరిణామమని అన్నారు. రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, శిష్ట కరణ కార్పొరేషన్ డైరక్టర్ సదాశివుడి కృష్ణ, జేఏసీ సభ్యులు ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, డాక్టర్ డి.జీవితేశ్వరరావు, సత్యనారాయణరాజు, పైడి నిర్మల్, డాక్టర్ సూర్యం, డి.రఘు, యు.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి యాత్రలో వాస్తవం లేదు

స్పీకర్ తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం పాతబస్టాండ్: అమరావతి రైతుల పేర్లతో జరుగుతున్న యాత్రలో వాస్తవం లేదని స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యాఖ్యానించారు. ఆయన ఆదివారం శ్రీకాకుళంలోని ఆర్ అండ్ బీ బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. కేవలం ఒక వర్గం కోసం ఆలోచించి అమరావతిని ఆనాడు రాజధానిగా ప్రకటించారని, మూడు రాజధానులతో అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. చంద్రబాబు తన అజెండాను ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని ప్రజలు విశ్వసించరని చెప్పారు. శివరామకృష్ణన్ కమిటీ కూడా విశాఖ రాజధాని ప్రతిపాదన చేసిందని గుర్తుచేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే విశాఖ రాజధాని కావాల్సిందేనని, విశాఖ రాజధాని అయితే ఇక్కడి టీడీపీ నాయకులకు నష్టమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని న్యాయమూర్తులు ఉత్తరాంధ్రలో పర్యటించి ఇక్కడి పరిస్థితులపై అధ్యయనం చేయాలని స్పీకర్ కోరారు.

జనసేన ట్వీట్‌కు మహిళా కమిషన్ రీట్వీట్

ఘాటుగా బదులిచ్చిన వాసిరెడ్డి పద్మ

సాక్షి, అమరావతి: మహిళా కమిషన్ ఎక్కడా? అంటూ జనసేన అధికారికంగా చేసిన ట్వీట్‌కు ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ రీ ట్వీట్‌తో దీటుగా బదులిచ్చారు. మూడు పెళ్లిళ్లు మీరూ చేసుకోండి.. భరణం ఇచ్చి భార్యను వదిలేశా, స్టెప్నీ అంటూ మహిళలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై కమిషన్ సీరియస్‌గా స్పందించిన విషయం తెలిసిందే. మహిళలకు క్షమాపణ చెప్పాలంటూ ఇప్పటికే నోటీలిచ్చారు. వీటిని తప్పుబడుతూ 'ఏపీ మహిళా కమిషన్ ఎక్కడ?' అంటూ జనసేన ట్వీట్ చేసింది. జనసేన కార్యాలయానికి కూతవేటు దూరంలోనే 'మహిళా కమిషన్' ఉందని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు.

పథకం ప్రకారమే మంత్రులపై దాడి

▶ మొదటి పేజీ తరువాయి

వైఎస్సార్‌సీపీ నాయకుల వాహనాలపై జనసేన నాయకులు, కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగానే పెద్ద ఎత్తున దాడులు చేశారని చెప్పారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి కూడా పాల్పడ్డారన్నారు. ఈ దాడిలో మంత్రి రోజా పీఏ దిలీప్‌కుమార్‌కు, అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పెందుర్తి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావుకు గాయాలవడంతో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మంత్రి రోజాపై దాడిచేయడానికి ప్రయత్నించిన సమయంలో మధ్యలో ఉన్న పీఏ దిలీప్ తలకు తీవ్ర గాయమై కుట్లుకూడా పడ్డాయన్నారు. వారిచ్చిన ఫిర్యాదుల మేరకు దాడిచేసినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. దాడులు అప్పటికప్పుడు నిర్ణయించుకున్నవి కాదని, వివిధ సమూహాల వ్యక్తులు, వేర్వేరు మంత్రులు, నాయకులను టార్గెట్ చేస్తూ ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే దాడులు చేసినట్లు తమ విచారణలో తేలిందని పేర్కొన్నారు. అదేరోజు 70 మంది నిందితులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టామన్నారు. రిమాండ్ రిపోర్టు పరిశీలించిన న్యాయస్థానం వారిలో తొమ్మిదిమందికి జ్యుడిషియల్ రిమాండ్ విధించగా.. మిగిలిన వారిని సొంత పూచీకత్తు మీద విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో వెల్లడైన అంశాల ప్రకారం ఈ ఘటనపై ఆరుకేసులు నమోదుచేసి ఇప్పటివరకు వందమందిని అరెస్టు చేశామని, 82 మంది పరారీలో ఉన్నారని చెప్పారు.

జనసేన నాయకుల ఆరోపణలు అసత్యాలు

15వ తేదీన పవన్‌కళ్యాణ్ ర్యాలీ సందర్భంగా మంత్రులపై దాడులు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంతో పాటు జాతీయ రహదారిపై నాలుగు గంటలపాటు పెద్ద ఎత్తున ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందన్నారు. ర్యాలీలో యువకులు ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయని చెప్పారు. అత్యవసర సర్వీసులకు ఆటంకాలు ఏర్పడ్డాయన్నారు. విమాన ప్రయాణికులు 30 మంది తమ విమానాలను మిస్ చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకునే 16వ తేదీన జనవాణి కార్యక్రమం నిర్వహించుకోవచ్చుగానీ, ర్యాలీగా వెళ్లకూడదని పవన్‌కు చెప్పామన్నారు. తమ నాయకులు జైలులో ఉండడంతో జనవాణి కార్యక్రమానికి హాజరుకావడం లేదని ఆయన తమకు తెలిపారని, అయితే జనసేన నాయకుడు వరప్రసాద్ ఆధ్వర్యంలో జనవాణి కార్యక్రమాన్ని కొనసాగించారని చెప్పారు. పవన్ పర్యటన సందర్భంగా తగిన పోలీస్ భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఆయన ఎయిర్‌పోర్టుకు వచ్చినప్పటి నుంచి డీసీపీ (లా అండ్ ఆర్డర్) సుమిత్‌సునీల్ గరుడ్, డీసీపీ (క్రైం) నాగన్న.. అనుమతి లేకుండా చేసిన ర్యాలీ కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఆ ర్యాలీకి అనుమతి లేదన్న విషయాన్ని స్వయంగా డీసీపీ సుమిత్ జనసేన అధినేత పవన్‌కు తెలిపారన్నారు. అంతేతప్ప పవన్‌పై దురుసుగా ప్రవర్తించాలన్న ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యాలని కొట్టిపారేశారు. వారి కేడర్, నాయకులు మంత్రులపై దాడిచేసిన కారణంగానే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. యువత ఇటువంటి క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు విమానాశ్రయంలో మంత్రులపై దాడులు చేస్తున్న ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. ఈ సమావేశంలో డీసీపీ (లా అండ్ ఆర్డర్) సుమిత్‌సునీల్ గరుడ్, ఏడీసీపీ (ఎస్బీ) ఆనందరెడ్డి, ఏసీపీ పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

వికేంద్రీకరణ కోసం విద్యార్థి భేరి



మీడియాతో కరణం ధర్మశ్రీ

నక్కపల్లి: వికేంద్రీకరణకు మద్దతుగా, విశాఖను పరిపాలన రాజధాని చేయాలనే డిమాండ్‌తో అనకాపల్లి జిల్లా విద్యార్థులు ఉద్యమించబోతున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అడ్డం పడుతున్న టీడీపీ తీరును ఎండగట్టేలా, రాజధాని సాధించేలా జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులంతా నియోజకవర్గాల వారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నారు. ఈ వివరాలను ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మీడియాకు వెల్లడించారు. 5వేల మంది విద్యార్థులతో నియోజకవర్గాల వారీగా నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గం నుంచి ఈ కార్యక్రమం మొదలు పెడతామన్నారు. వికేంద్రీకరణకు అడ్డుపడుతున్న ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొడతామన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఓట్లతో గెల్చిన టీడీపీ ఎమ్మెల్యేలు, గతంలో పదవులు అనుభవించిన నేతలు.. ఇప్పుడు ఉత్తరాంధ్ర అభివృద్ధి నిరోధకులుగా తయారయ్యారన్నారు. ఉత్తరాంధ్ర టీడీపీ నేతలు అమరావతిలో భూములు కొనుగోలు చేసిన వారికి సంఘీభావం తెలపడం సిగ్గుచేటన్నారు. కోర్టు ఆదేశాలతో అమరావతి యాత్ర.. నకిలీదనే విషయం రాష్ట్రమంతా తెలిసిందన్నారు.

కోవిడ్ బీమా పేరిట టోకరా

- అంతర్జాతీయ ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు
- నేపాలీ సహా నలుగురి అరెస్ట్
- రూ.3.29 లక్షల నగదు, 73 ఏటీఎం, 290 సిమ్ కార్డులు సీజ్



సిమ్‌కార్డులు, బ్యాంక్ ఏటీఎం కార్డులను పరిశీలిస్తున్న తుషార్ డూడీ

కడప అర్బన్: కోవిడ్ బారినపడి మరణించిన వ్యక్తుల కుటుంబ సభ్యులను వైఎస్సార్ బీమా పేరుతో మోసగిస్తున్న అంతర్జాతీయ ముఠా గుట్టును వైఎస్సార్ జిల్లా పోలీసులు రట్టు చేశారు. ముఠాలో కీలక నిందితుడు నేపాల్‌కు చెందిన అశోక్ లోహర్‌తోపాటు మరో ముగ్గురిని ఢిల్లీలో పోలీస్ ప్రత్యేక బృందాలు అరెస్ట్ చేశాయి. వారి నుంచి రూ.3.29 లక్షల నగదుతోపాటు కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు చెందిన 73 ఏటీఎం కార్డులు, 18 సెల్‌ఫోన్లు, 290 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్‌డూడీ ఆదివారం మీడియాకు వెల్లడించారు.

8 మందితో ముఠా కట్టి..

వివిధ ప్రాంతాలకు చెందిన 8 మంది కలిసి అంతర్జాతీయ ముఠాగా ఏర్పడి కోవిడ్ కారణంగా మరణించిన వారి వివరాలను సేకరించారు. మృతుల బంధువులకు కలెక్టరేట్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి.. ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా పథకం కింద పరిహారం ఇప్పిస్తామని నమ్మబలికారు. ఇందుకోసం న్యూఢిల్లీలోని పాలిమర్‌బాగ్ ప్రాంతంలో నివాసం వుంటున్న నేపాల్ దేశస్తుడు అశోక్ లోహర్ సాయంతో అద్దె గదిలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఏపీకి చెందిన నిరుద్యోగ యువకులను ఢిల్లీకి పిలిపించి, బాధితులకు ఫోన్‌లు చేయించారు. రూ.50 లక్షలు మంజూరు చేయిస్తామని, ఇందుకోసం కొంత మొత్తం చెల్లించాలని నమ్మించారు. ఇలా బద్వేలుకు చెందిన పి.ఆదిలక్ష్మి నుంచి యూపీఐ చెల్లింపుల ద్వారా సుమారు రూ.9 లక్షలు కాజేశారు. మరో 13 మంది నుంచి యూపీఐ చెల్లింపుల ద్వారా రూ.8,28,086 వసూలు చేశారు. ఇందులో నష్టపోయిన కడప నగరానికి చెందిన ఒంటిబీరం రమణారెడ్డి, నిర్మల, ఎంవీ సునీత, ఖాజీపేటకు చెందిన ఎస్.నాగవేణి, విఘ్నేశ్వరి, పెండ్లిమర్రికి చెందిన విజయకుమారి, ప్రొద్దుటూరుకు చెందిన కృష్ణ చైతన్య, జింకా హరిత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటుతో..

విచారణలో భాగంగా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 12న వైఎస్సార్ జిల్లాలోని కలసపాడు బలిజపల్లె నివాసి, ప్రస్తుతం ఖాజీపేట మండలం మిడుతూరుకు చెందిన మీనుగ వెంకటేష్‌ను అరెస్ట్ చేశారు. అతను విచారణలో తెలిపిన వివరాల ఆధారంగా.. ఖాజీపేట మండలం మిడుతూరుకు చెందిన మీనుగ నరేంద్ర, జంగాలపల్లి జనార్దన్, ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అల్లినగరం గ్రామానికి చెందిన ఆవులమంద నారాయణ, నేపాల్‌కు చెందిన ప్రస్తుతం ఢిల్లీ సిటీలోని పితాంపుర నార్త్ వెస్ట్‌లో ఉన్న అశోక్ లోహర్ అనే వారిని అరెస్ట్ చేశారు. కాగా, రంజిత్, అతని సోదరుడు బద్రీసింగ్, అక్షయ్ ఈ ముఠా నాయకులని పట్టుబడిన నిందితులు తెలిపారు. వీరి ఖాతాల వివరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు, ఇన్‌కంటాక్స్, విదేశీ వ్యవహారాల శాఖకు తదుపరి చర్యల నిమిత్తం అందజేస్తామన్నారు.

మూడు రాజధానుల దిశగా అడుగులు అభినందనీయం




756వ రోజు రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : మూడు రాజధానుల పాలన దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నేతలు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 756వ రోజు కొనసాగుతున్న రిలే దీక్షల్లో ఆదివారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రైతుల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు బాబు అండ్ కో యత్నిస్తున్నారనేది బహిరంగ సత్యమన్నారు. పాదయాత్రలో నిజమైన రైతులు లేనందునే కోర్టు తీర్పు రాగానే నాలుగు రోజులు వాయిదా వేసుకుని పారిపోయారని ఎద్దేవా చేశారు. రైతుల ముసుగులో ఎల్లో మీడియానే ఈ ఉద్యమాన్ని నడిపిస్తోందన్న విషయం ప్రజలందరికీ అర్థమవుతోందని, ఉద్యమం అంటే విరాళాలతో వచ్చిన కోట్ల రూపాయలు వెచ్చించి ఫైవ్‌స్టార్ హోటల్ వసతులతో చేసే డ్రామా కంపెనీ కాదన్నారు. నిజంగా వారికి నష్టం జరిగి ఉంటే కష్టనష్టాల కోర్చి లక్ష్యం దిశగా పయనించాలి గానీ, కోర్టు తీర్పును చూసి పారిపోవడమేంటని ప్రశ్నించారు. త్వరలో మూడు రాజధానులను సాధించుకుని భావితరాలకు బాటలు వేస్తామని చెప్పారు. సీఎంగా వైఎస్ జగన్ సీఎం అయ్యాక డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాజకీయాలు, నామినేటెడ్ పదవులు, అన్ని రంగాల్లో బహుజనులకు పెద్దపీట వేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి-కావేరి అనుసంధానం డౌటే

ఇచ్చంపల్లి నుంచి 247 టీఎంసీలు తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదన

- తమ కోటాలోని నీటిని ఎలా తరలిస్తారని ప్రశ్నించిన ఛత్తీస్‌గఢ్
- మిగులు జలాలను తరలించడంపై ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం
- దీంతో ప్రతిపాదనల దశలోనే ప్రశ్నార్థకంగా మారిన గోదావరి–కావేరి అనుసంధానం
- నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చాకే సంప్రదింపులు జరిపాలంటున్న నిపుణులు



సాక్షి, అమరావతి: గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రతిపాదనల దశలోనే ప్రశ్నార్థకంగా మారింది. ఛత్తీస్‌గఢ్ సర్కార్‌తో కనీసం సంప్రదింపులు జరగకుండా ఆ రాష్ట్ర కోటా 141 టీఎంసీలకు.. బచావత్ ట్రిబ్యునల్ పరిధిలోని దిగువ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు హక్కుగా కల్పించిన మిగులు జలాల్లో 106 టీఎంసీలను జతచేసి 247 టీఎంసీలను ఇచ్చంపల్లి నుంచి అనుసంధానంలో తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ (జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ) తొలుత ప్రతిపాదనలు రూపొందించింది. దీనిపై పరీవాహక ప్రాంతాల్లోని రాష్ట్రాలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని.. ఛత్తీస్‌గఢ్ కోటాలోని 141 టీఎంసీలను అనుసంధానంలో తరలించేలా ప్రతిపాదనను మార్చింది. బచావత్ ట్రిబ్యునల్ తమకు కేటాయించిన నీటిని ఎలా తరలిస్తారంటూ ఛత్తీస్‌గఢ్ సర్కార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో గోదావరి–కావేరి అనుసంధానంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

సంప్రదింపులకు అర్థమేదీ?

- ఇచ్చంపల్లి లేదా అకినేపల్లి (గోదావరి) నుంచి జూన్–అక్టోబర్ మధ్య 143 రోజుల్లో 247 టీఎంసీలను నాగార్జునసాగర్ (కృష్ణా), సోమశిల (పెన్నా) మీదుగా గ్రాండ్ ఆనకట్టకు తరలించడం ద్వారా గోదావరి–కావేరి నదులను అనుసంధానం చేయాలని 2018లో ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమళనాడులకు 80 టీఎంసీల చొప్పున అందిస్తామని పేర్కొంది. ఇచ్చంపల్లి నుంచి తరలించే నీటిలో 141 టీఎంసీలు ఛత్తీస్‌గఢ్ కోటాలోనివి కాగా.. మిగతా 106 టీఎంసీలు మిగులు జలాలు.
- దీనిపై 2020 జూలై 28న ఒకసారి.. డిసెంబర్ 10న మరోసారి పరీవాహక ప్రాంతాల పరిధిలోని రాష్ట్రాలతో ఎన్‌డబ్ల్యూడీఏ సంప్రదింపులు జరిపింది. తమ కోటాలో నీటిని తరలించడానికి తాము అంగీకరించే ప్రశ్నే లేదని ఛత్తీస్‌గఢ్ తెగేసి చెప్పగా.. తమకు హక్కుగా కల్పించిన నీటిని ఎలా తరలిస్తారని ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది.
- సంప్రదింపుల్లో రాష్ట్రాలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని అనుసంధానం ప్రతిపాదనలో ఎన్‌డబ్ల్యూడీఏ అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలి. కానీ.. అందుకు విరుద్ధంగా ఛత్తీస్‌గఢ్ కోటాలో 141 టీఎంసీలను మాత్రమే.. అదీ ఇచ్చంపల్లి నుంచి కాకుండా తుపాకులగూడెం నుంచి నాగార్జునసాగర్, సోమశిల మీదుగా కావేరికి తరలించేలా మళ్లీ ప్రతిపాదన రూపొందించింది. దీనిపై ఈ నెల 18న రాష్ట్రాలతో మళ్లీ సంప్రదింపులు జరిపింది. తమ కోటా నీటిని వాడుకోవడానికి అంగీకరించే ప్రశ్నే లేదని తాము ఇప్పటికే స్పష్టం చేశామని.. మళ్లీ తమ నీటిని వాడుకునేలా ప్రతిపాదన రూపొందించడాన్ని బట్టి చూస్తే సంప్రదింపులకు అర్థమేముందని ఛత్తీస్‌గఢ్ అసహనం వ్యక్తం చేసింది.

నీటి లభ్యత శాస్త్రీయంగా తేల్చాకే..

గోదావరి–కావేరి అనుసంధానం ప్రతిపాదన రూపొందించాలంటే.. తొలుత గోదావరిలో నీటి లభ్యతను తేల్చడానికి శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని నీటి పారుదలరంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పరీవాహక ప్రాంతంలోని రాష్ట్రాలకు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన జలాలుపోగా నికర జలాల్లో మిగులు ఉంటే.. వాటిని అనుసంధానంలో భాగంగా తరలించడానికి రాష్ట్రాలతో ఎన్‌డబ్ల్యూడీఏ సంప్రదింపులు జరపాలని సూచిస్తున్నారు. రాష్ట్రాలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని.. అనుసంధానం ప్రతిపాదన రూపొందిస్తేనే గోదావరి–కావేరి అనుసంధానంపై అడుగులు ముందుకు పడే అవకాశం ఉంటుందని తేల్చి చెబుతున్నారు. అలాకాకుండా ఏకపక్షంగా ప్రతిపాదనలు రూపొందించి.. రాష్ట్రాలతో సంప్రదింపులు జరపడం వృథా ప్రయాసేనని స్పష్టం చేస్తున్నారు.

దీపావళి ప్రత్యేకం

అమావాస్య చీకట్లలో పున్నమి వెలుగులు



భారతీయులందరూ అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకునే ముఖ్యమైన పండుగలలో ఒకటి దీపావళి పండుగ. మన మహర్షులు ఏర్పరచిన మన పండుగలన్నీ ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలు కలిగి, ఆచార వ్యవహారాలతో కలిసి ఉంటాయి. మన పండుగల వెనుక అపారమైన శాస్త్రీయత, సమాజానికి హితకరమైన అంశాలు అనేకం దాగి ఉంటాయి. కాలంలో వచ్చే మార్పులతోపాటు, ఖగోళంలో వచ్చే మార్పులను కూడా ఆధారంగా చేసుకుని మన మహర్షులు మనకు ప్రతి నెలలోనూ పండుగలను నిర్దేశించారు. మన సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికతకు, మానవతా విలువలకు ప్రతీక 'దీపావళి పండుగ'. సమగ్ర భారత దేశంలో హిందువులే కాక జైనులు, బౌద్ధులు, సిఖ్ఖులు కూడా ఈ పండుగను జరుపుకుంటారు. నేటి కాలంలో ప్రపంచ దేశాలలో ఎందరో దీపావళి పండుగను జరుపుకుంటున్నారు. అమెరికాలో వైట్‌హౌస్ లో కూడా దీపావళి నాడు దీపాలు వెలిగిస్తున్నారు.

అమావాస్యను, పౌర్ణమిని కూడా 'పూర్ణ తిథులు' అంటారు. అలాంటి ఆశ్వయుజ బహుళ అమావాస్యనాడు, స్వాతి నక్షత్రంతో కూడిన అమావాస్య నాడు మనం దీపావళి పండుగను జరుపుకుంటాము.

'దీపానాం ఆవళీ – దీపావళీ.'

దీపావళి అంటే దీపాల వరుస. దీపావళి రోజు రాత్రి సమయంలో యావత్ భారతదేశం అసంఖ్యాకమైన విద్యుద్దీపాలంకరణతోను, నూనె దీపాల ప్రమిదలతోనూ అత్యంత శోభాయమానంగా ప్రకాశిస్తూ ఉంటుంది.

దీపావళి పండుగనాడు విశేషంగా ఆచరించే పనులు – సూర్యోదయానికి ముందే అభ్యంగన స్నానమాచరించటం, పితృతర్పణాలివ్వటం, దానం చెయ్యటం, వత్తులు వేసి, నూనె దీపాలను వెలిగించటం, ఆకాశదీపం పెట్టటం.

ఆకాశదీపం పెట్టడం వల్ల దూరప్రాంతాల వారికి కూడా ఈ దీప దర్శనమవుతుంది. దాని వెలుగు వలన మార్గదర్శనమవుతుంది.

నరకుడు అలా పుట్టాడు: హిరణ్యాక్షుడు దేవతలను, ధర్మాత్ములైన మానవులను హింసిస్తూ, యావద్భూమండలాన్ని క్షోభిల్లజేస్తుంటే, శ్రీమన్నారాయణుడు వరాహావతారంలో వచ్చి హిరణ్యాక్షుడిని సంహరించి, భూమాతను రక్షించాడు. ఆ సమయంలో భూదేవి తనకొక కుమారుడిని ప్రసాదించమని స్వామిని ప్రార్థిస్తుంది. వారి సంతానమే నరకాసురుడు. స్వామి రాక్షస సంహారం కోసం అవతరించిన తరుణంలో భూమాతకి కలిగిన పుత్రుడు కనుక, నరకుడు తమోగుణ భరితుడై రాక్షసుడయ్యాడు. అతడు బ్రహ్మదేవుని గురించి ఘోరమైన తపస్సు చేసి, మరణం లేకుండా వరం కోరాడు. బ్రహ్మదేవుడు అది సాధ్యం కాదని అంటే, 'కన్నతల్లి బిడ్డలను పొరపాటున కూడా చంపదు కదా' అని ఆలోచించి, 'నాకు మా అమ్మ చేతిలో తప్ప మరణం లేకుండా వరం ఇవ్వండి' అని కోరాడు. 'తథాస్తు' అన్నాడు బ్రహ్మ. ఇంక తనకు చావే లేదు, అనే భ్రమతో నరకుడు లోక కంటకుడై వేద సంస్కృతిని వ్యతిరేకిస్తూ, యజ్ఞయాగాదులు జరగకుండా అడ్డుకుంటూ, అమాయకులను, సాధువర్తనులను బాధిస్తూ రావణాసురుని వలె పరస్త్రీ వ్యామోహంతో శీలవంతులైన 16 వేల మంది స్త్రీలను బంధించాడు. దుష్ట శిక్షణ కోసం పరమాత్మ శ్రీ కృష్ణునిగా అవతరించాడు. భూదేవి సత్యభామగా అవతరించింది. తన తల్లి అయిన సత్యభామ వదిలిన బాణాహతితో నరకుడు మతి చెందాడు. శ్రీకృష్ణ పరమాత్మ నరకుని స్మృతిగా ఆ అమావాస్య నాడు దీపాలను వెలిగించి పండుగ చేసుకోవాలని నిర్దేశించాడు. నరకుని చెరలో ఉన్న 16,000 మంది స్త్రీలను విడిపించటమే కాక, నరకుని హస్తగతమైన ధనలక్ష్మిని విడిపించి, తన పాంచజన్య శంఖంతో, కామధేను క్షీరంతో, చతుస్సాగర జలాలతో ధనలక్ష్మికి ఈ రోజునే సామ్రాజ్య పట్టాభిషేకం చేశాడు. కనుకనే దీపావళి రోజున ప్రదోషకాలంలో లక్ష్మీపూజ చేయాలి అని శాస్త్రం చెప్తోంది. నరకుడు చనిపోయిన రోజును నరక చతుర్దశిగాను, ఆ మరునాడు అమావాస్యను దీపావళి గాను పండుగ చేసుకుంటున్నాము.

నరకుడు అజ్ఞానానికి ప్రతీక. నరకం అంటే దుర్గతి. అది కలవాడు నరకుడు. అంటే చెడు నడత కలవాడు. మానవులందరూ మంచి చెడుల మధ్య వ్యత్యాసాన్ని గ్రహించి మంచి నడతను కలిగి ఉండాలి.

దీపావళి పండుగను అజ్ఞానం మీద జ్ఞానం, అంధకారం మీద వెలుగు విజయంగాను, నిరాశ మీద ఆశ సాధించిన విజయంగానూ చెప్పవచ్చును.

ఈ దీపావళి పండుగనాడు కొందరు పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహంతో తమ జీవితాలు కలకాలం కళకళలాడుతూ సాగాలని కేదారేశ్వర వ్రతం చేస్తారు. కేదారేశ్వరుడు అంటే పరమేశ్వరుడు. జగన్మాత మంగళ గౌరీ దేవి పరమేశ్వరుని అనుగ్రహం కోసం గొప్ప తపస్సు చేసి ఈశ్వరుని మెప్పించి పరమేశ్వరుని శరీరంలో అర్ధ భాగాన్ని పొందింది. ఈశ్వరుడు అర్ధనారీశ్వరుడయ్యాడు. ఈ కేదారేశ్వర వ్రతం చేసిన దంపతులు అన్యోన్యంగా ఆనందంగా ఉంటారని ప్రతీతి.

దీపావళి మానసిక వికాసాన్ని కలిగించే పండుగ. అజ్ఞానం అనే చీకట్లు తొలగాలి అంటే జ్ఞానం అనే సూర్యుడు ప్రకాశించాలి. జ్ఞాన జ్యోతి వెలగాలి. 'తమసోమా జ్యోతిర్గమయ' అంటే అర్థం ఇదే! అమావాస్య నాటి చీకటిని చిరు దివ్వెల వెలుగుతో పారద్రోలాలి, అని మన పెద్దలు చెప్పారు. ఎప్పటికైనా అధర్మం నశించి, ధర్మం ఉద్ధరింపబడుతుందని, మంచి అన్నదే శాశ్వతమని చాటి చెప్పేదే దీపావళి పండుగ. కుల మత వర్ణ వర్గ జాతి విభేద రహితంగా జరుపుకుని ఆనందించేది ఈ దీపావళి పండుగ.

దీపం చైతన్యానికి ప్రతీక. దీపావళి ఉత్సవాలను 'కౌముది ఉత్సవాలు' అంటారు. ఈ దివ్వెల పండుగ వచ్చినప్పుడు నాలుగైదు రోజులు ఆనందోత్సాహాలు ఉరకలు వేస్తూ గడపటం, నువ్వుల నూనె దీపాలు వెలిగించి, దైవారాధన చేయటం వంటి ఆధ్యాత్మిక ఆనంద వాతావరణం వల్ల శరీరం చురుకుదనాన్ని పొందుతుంది. మనసుకు ఆహ్లాదం కలుగుతుంది. ఈ విశ్వమంతా ఆనంద డోలికలలో తేలియాడుతున్న భావనతో అందరి హృదయాలలో ఆధ్యాత్మిక ఆనంద తరంగాలు జాగృతమై, సత్యం, ధర్మం, సమత, ప్రేమ, భూత దయ, సౌమనస్యం వంటి సాత్విక గుణాలు ఉదయించి, ఒక విధమైన ప్రశాంతతని అనుభవిస్తాం. దీపావళినాడు పగలంతా బంధుమిత్రుల ఆనందోత్సాహాల పలకరింపులు, బహుమతులు ఇచ్చి పుచ్చుకోవటాలతోను, రాత్రంతా అద్భుతమైన ప్రకాశవంతమైన జ్యోతుల దర్శనంతో, మతాబుల వెలుగుల తేజస్సుతో మనలోని ఆధ్యాత్మిక చీకట్లు తొలగినట్లు, జ్ఞాన ఆనందాలు కలిగినట్లుగా ఆత్మానందానుభూతి కలుగుతుంది. దివిలోని తారలన్నీ భువికి దిగి వచ్చినట్లుగా లోకం వెలిగిపోతుంది. ఆనందోత్సాహాలు ఉరకలేస్తాయి. మన హృదయాలు ఆనందమయమయినప్పుడు మనం ఆ ఆనందాన్ని సర్వప్రాణి కోటికి పంచగలుగుతాం. పరమాత్మ అనుగ్రహంతో యావద్విశ్వం ఆనందమయమగు గాక!

– డా. సోమంచి (తంగిరాల) విశాలాక్షి

● చతుర్దశి మొదలు మూడు రాత్రులు దేవాలయాలలో, మఠాలలో, ఉద్యాన వనాలలో, వీధులలో, ఇళ్ళల్లో, గోశాలలలో, గుర్రాలు, ఏనుగులు ఉండు చోట్లల్లో దీపాలు వెలిగించాలి అని శాస్త్ర వచనం. ● ఆశ్వయుజ కృష్ణ చతుర్దశి నాడు ఉదయం చంద్రుడు ఉండగా నువ్వుల నూనెతో అభ్యంగన స్నానం చేయాలి. సూర్యాస్తమయ సమయంలో నరకాసుర వధ జరిగింది కనుక విధూయంలో అభ్యంగన స్నానమాచరించాలి అని పెద్దలు చెప్పారు. ● దీపావళి ముందరి చతుర్దశి నాడు నువ్వుల నూనెలో లక్ష్మీదేవి, నీటిలో గంగామాత ఆవేశించి ఉంటారు' అని పద్మ పురాణం చెప్తోంది. ఆరోజున సూర్యోదయాత్పూర్వం స్నానం చేసిన వారు యమలోకాన్ని దర్శించరట. ● నువ్వుల నూనె శరీరానికి పట్టించుకుని అభ్యంగన స్నానం చేయటం వలన శనిదోష నివారణే కాకుండా, కండరాలు నరాలు దృఢపడతాయి. నరక చతుర్దశి రోజున తెల్లవారుఝామున స్వాతి నక్షత్ర కాంతి నీటిపై తన ప్రభావం చూపిస్తుంది. దీపావళి రోజు అమావాస్య కనుక సూర్యుడు తన సంపూర్ణ ప్రభావాన్ని చూపిస్తాడు. జలాధిపతి అయిన వరుణుడు తన అనుగ్రహాన్ని నీటిలో ఉంచుతాడు. కనుక ఈ స్నానం ఆరోగ్యాన్ని, లక్ష్మీ అనుగ్రహాన్ని కలిగిస్తుంది.

పద్మ పురాణ, స్కాంద పురాణాలలో దీపావళి గురించిన ప్రస్తావన ఉంది. శ్రీమహావిష్ణువు వామనావతారంలో బలి చక్రవర్తిని పాతాళ లోకానికి అణగదొక్కి సుతల రాజ్యాధిపతిని చేసినందుకుగాను ఈ అమావాస్యను దీపావళిగా జరుపుకుంటారనీ, శ్రీరామచంద్రుడు రావణాసురుడిని వధించి శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయాదులతో అయోధ్యకేతెంచి, పట్టాభిషిక్తుడైన రోజు ఈరోజు కనుక ఈరోజును దీపావళిగా జరుపుకుంటారని, శ్రీ కృష్ణుడు సత్యభామా సమేతుడై నరకుని వధించిన సందర్భంగా ప్రజలు దీపావళి జరుపుకుంటున్నారని, కృత, త్రేతా, ద్వాపర యుగాలకు సంబంధించిన కథలు ప్రచారంలో ఉన్నాయి. ఇంకా, పంచపాండవులు వనవాస, అజ్ఞాతవాసాలు పూర్తి చేసుకుని విజయవంతులై తిరిగి వచ్చినందుకు ఆనందంతో ప్రజలు దీపావళి జరుపుతున్నారని కూడా ప్రచారంలో ఉంది. ఆదిపరాశక్తి శుంభ నిశుంభులనే రాక్షసులను సంహరించినందుకు ఆనందంతో వెలిగించిన జ్యోతులే దీపావళి అని కూడా ప్రచారంలో ఉంది. ఇవే కాక, క్షీరసాగర సముద్భూత అయిన శ్రీ మహాలక్ష్మి శ్రీమన్నారాయణుడిని వరించినందుకు దేవతలు, మానవులు, అందరూ ఆనందోత్సాహాలతో దీపావళిని జరుపుకుంటున్నారు అని కూడా చెప్తారు.

దీపావళి నాడు పితృదేవతలు సాయం సంధ్యా సమయాన ఆకాశంలో దక్షిణ దిక్కుగా వచ్చి, తమ సంతానాల గృహాలను సందర్శిస్తారట. వారికి దారి కనిపించటం కోసమే దివ్వెలు కొట్టే సంప్రదాయం ఏర్పడింది. ఇంట్లోని పెద్దవారు పిల్లలతో ఈ దివిటీలను కొట్టిస్తారు. పొడుగాటి గోంగూర కాడలకు నూనెతో తడిపిన బట్ట వత్తులు కట్టి, వాటిని పిల్లల చేతులకిచ్చి, వారిని వీధి గుమ్మం ముందు నిలబెట్టి దివిటీలను వెలిగించి, ఆకాశంలో దక్షిణం వైపుకి చూపిస్తూ గుండ్రంగా మూడుసార్లు తిప్పి, నేలకు వేసి కొట్టిస్తూ, 'దుబ్బు దుబ్బు దీపావళి, మళ్ళీ వచ్చే నాగుల చవితి' అని అనిపిస్తారు. ఆ తరువాత ఆ కాడలను ఒకపక్కగా పడేస్తారు. పిల్లల కాళ్లు చేతులు కడిగి, కళ్ళు తడి చేతితో తుడిచి, నోరు పుక్కిలించి శుభ్రం చేసుకోమని, తరువాత ఆ పిల్లలకు నోట్లో మిఠాయిలు పెట్టి తినిపిస్తారు. తరువాత ఇంటిల్లిపాది టపాకాయలు కాల్చడం ప్రారంభిస్తారు. ఆనందంగా ఎంతసేపన్నా చిచ్చుబుడ్లు, మతాబులు, కాకరకడ్డీలు, అగ్గిపెట్టెలు, విమానాలు, రాకెట్లు, వెన్న ముద్దలు మొదలైనవన్నీ కాల్చవచ్చు. కానీ 'బాణసంచా కాల్చటం లాంటి సంబరాలు పూర్తయ్యాక, అర్ధరాత్రి దాటాక, ఇళ్ళు, వాకిళ్లను తుడిపించుకోవాలి' అని ధర్మశాస్త్రం చెప్తోంది.

సినిమా



● కృతీ సనన్ ● అనన్యా పాండే ● శిల్పాశెట్టి

దీపావళి... ఆనందకేళి



● భూమీ ఫడ్నేకర్



● రకుల్ ప్రీత్ సింగ్



● హన్సిక

దీపావళి వెలుగుల్లో తారలు మరింత వెలిగిపోతున్నారు. బాలీవుడ్ హీరోయిన్ భూమి ఫడ్నేకర్ ఇచ్చిన దీపావళి పార్టీ వేడుకలో పలువురు బీ టౌన్ తారలు తళుక్కుమన్నారు. తన భార్య పత్రలేఖతో కలిసి పార్టీకి హాజరయ్యారు రాజ్ కుమార్‌రావు. అలాగే తనకు కాబోయే భర్త జాకీ భగ్నానీతో కలిసి పార్టీలో సందడి చేశారు హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్. ఇంకా రేఖాకపూర్, దర్శకుడు అమర్ కౌశిక్, సుహానా ఖాన్, కరణ్ డియోల్, అనన్యా పాండే, శిల్పాశెట్టి, ఆర్యన్ ఖాన్ ఈ దీపావళి వేడుకలో సందడి చేశారు. అలాగే నిర్మాత ఏక్తా కపూర్ దీపావళిని సెలబ్రేట్ చేశారు. ఈ పార్టీకి కూడా పలువురు బాలీవుడ్ సెలబ్రిటీలు హాజరై పాపులర్ సాంగ్స్‌కు డ్యాన్స్‌లు వేస్తూ సందడి చేశారు. కథానాయికలు హన్సిక, అదితీరావు హైదరీల దీపావళి సెలబ్రేషన్స్ కూడా షురూ అయ్యాయి. మరికొంత మంది తారలు దీపావళిని కుటుంబంతో కలిసి ఆనందంగా సెలబ్రేట్ చేసుకునేందుకు ప్లాన్ చేశారు.

తీన్‌మార్



● 'సలార్'లో...



● 'ఆది పురుష్'లో ప్రభాస్

బర్త్ డే రోజున(అక్టోబరు 23) ఫ్యాన్స్‌కు ట్రిపుల్ ట్రీట్ ఇచ్చారు హీరో ప్రభాస్. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'ఆదిపురుష్, సలార్, ప్రాజెక్ట్ కె' నుంచి కొత్త పోస్టర్స్ విడుదల చేశాయి చిత్రయూనిట్స్. ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్, కృతీసనన్ జంటగా నటించిన చిత్రం 'ఆదిపురుష్'. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, ఓం రౌత్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 12న రిలీజ్ కానుంది. అలాగే ప్రభాస్, శ్రుతీహాసన్ జంటగా నటిస్తున్న మరో చిత్రం 'సలార్'. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సెప్టెంబరు 28న విడుదల కానుంది. అదేవిధంగా ప్రభాస్, దీపికా పదుకొనే జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రాజెక్ట్ కె'. నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం 2024లో రిలీజ్ కానుందనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ మూడు సినిమాలే కాకుండా మారుతి దర్శకత్వంలో ఓ సినిమా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' అనే చిత్రాలు చేస్తున్నారు ప్రభాస్.

నటుడిగా ఉండటం నా అదృష్టం – కార్తీ



● కార్తీ, సుప్రియ

''ఖాకీ, ఖైదీ' చిత్రాల్లానే కొత్తగా చేస్తే తప్పకుండా ఆదరిస్తామని 'సర్దార్'తో మరోసారి నిరూపించారు ప్రేక్షకులు. మా కష్టానికి తగ్గ ఫలితం ఇచ్చిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని హీరో కార్తీ అన్నారు. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తీ హీరోగా నటించిన చిత్రం 'సర్దార్'. రాశీఖన్నా, రజీషా విజయన్ కథానాయికలు. లైలా కీలక పాత్రలో నటించారు. ఎస్.లక్ష్మణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదలైంది. తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్‌పై నాగార్జున రిలీజ్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్ర సక్సెస్ మీట్‌లో హీరో కార్తీ మాట్లాడుతూ– ''నాగార్జున అన్న సపోర్ట్‌ని మర్చిపోలేను. సినిమా అనేది ఒక సంస్కృతిగా ఉన్న మన దేశంలో ఒక నటుడిగా ఉండటం నా అదృష్టం'' అన్నారు. ''తెలుగులో 'సర్దార్' విడుదల చేసినందుకు గర్వంగా ఉంది. మంచి సినిమాని ఆదరించే తెలుగు ప్రేక్షకులు నిజంగా దేవుళ్లు'' అన్నారు నిర్మాత సుప్రియ. ''నా తొలి చిత్రం 'అభిమన్యుడు' సినిమాని తెలుగు ప్రేక్షకులు హిట్ చేశారు. ఇప్పుడు 'సర్దార్'కి మరో ఘన విజయం ఇచ్చినందుకు థ్యాంక్స్'' అన్నారు పీఎస్ మిత్రన్. రజీషా విజయన్, నటుడు–రచయిత రాకేందుమౌళి మాట్లాడారు.

థ్రిల్లింగ్ ట్రిప్



● ఫరియా, సంతోష్

సంతోష్ శోభన్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్'. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించారు. ఈ చిత్రాన్ని నవంబరు 4న విడుదల చేయనున్నట్లు హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో చిత్రబృందం ప్రకటించింది. సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''మా సినిమా ట్రైలర్‌ను ఈ నెల 25న ప్రభాస్‌గారు విడుదల చేయనున్నారు. ఇందుకు ఆయన అభిమానిగా చాలా ఎగ్జైటింగ్‌గా ఎదురు చూస్తున్నా''అన్నారు. ''ఈ సినిమా ఓ ఫన్ రైడ్ ఫిల్మ్. మంచి థ్రిల్ ట్రిప్‌లా ఉంటుంది. ఈ నెల 29న మా సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించనున్నాం'' అన్నారు మేర్లపాక గాంధీ. ''మంచి ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా ఇది'' అన్నారు వెంకట్ బోయనపల్లి.

క్రైమ్ సస్పెన్స్



● విజయ్ శంకర్, శ్రీకాంత్

విజయ్ శంకర్, 'బిగ్ బాస్' ఫేమ్ అషూరెడ్డి జంటగా జి.సూర్యతేజ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఫోకస్'. సుహాసిని, భానుచందర్ కీలక పాత్రల్లో నటించారు. స్కైరా క్రియేషన్స్ సమర్పణలో రిలాక్స్ మూవీ మేకర్స్‌పై వీరభద్ర రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో శ్రీకాంత్ విడుదల చేసి, మాట్లాడుతూ–''ఫోకస్' ట్రైలర్ చాలా బాగుంది. ఈ చిత్రం మంచి హిట్ కావాలి'' అన్నారు. ''కొత్త తరహా క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు జి.సూర్యతేజ. ''మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు వీరభద్ర రావు, విజయ్ శంకర్. ఈ చిత్రానికి కెమెరా: జె.ప్రభాకర్ రెడ్డి, సంగీతం: వినోద్ యజమాన్య.

ప్రేక్షకులు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు – అనుదీప్



''ప్రిన్స్' చిత్రానికి తెలుగుతో పాటు తమిళ్‌లో కూడా మేము ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వస్తోంది. అన్నివర్గాల ప్రేక్షకులు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు'' అని దర్శకుడు అనుదీప్ కేవీ అన్నారు. శివ కార్తికేయన్, మారియా ర్యాబోషప్క జంటగా నటించిన చిత్రం 'ప్రిన్స్'. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, డి.సురేష్ బాబు, పుస్కూర్ రామ్‌మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా అనుదీప్ కేవీ మాట్లాడుతూ–''ప్రస్తుత పరిస్థితుల్లో దేశభక్తి కంటే మానవత్వం గొప్పదనే ఆలోచనే 'ప్రిన్స్' కథకు స్ఫూర్తి. ఎక్కడా రాజీ పడకుండా సినిమా చేయమని సురేష్ బాబు, సునీల్, రామ్‌మోహన్‌గార్లు స్వేచ్ఛ ఇచ్చారు. నేను కామెడీ సినిమాలు చేసేందుకు చార్లీ చాప్లిన్, జంధ్యాల, రాజ్ కుమార్ సంతోషి వంటి వారు స్ఫూర్తి. బాలచందర్‌గారి సినిమాలు అంటే ఇష్టం.. ఆయన తరహాలో ఫీమేల్ సెంట్రిక్ మూవీస్ చేయాలని ఉంది. హారిక హాసినీ, మైత్రీ మూవీ మేకర్స్‌లో నా తర్వాతి సినిమాలు ఉంటాయి. హీరో రామ్‌గారికి ఓ కథ చెప్పాలి''అన్నారు.

ఓరి దేవుడా అద్భుతాలు సృష్టిస్తుంది – విశ్వక్ సేన్



● మిథిలా పాల్కర్, వంశీ కాక, విశ్వక్ సేన్, ఆశా భట్, అశ్వత్

''ఓరి దేవుడా' చిత్రం అందరి మనసుల్ని టచ్ చేస్తుంది. ఎంటర్‌టైనింగ్‌గా రూపొందిన మా సినిమా ప్రేక్షకులే కాదు.. విమర్శకులకు కూడా బాగా నచ్చింది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓరి దేవుడా'. విశ్వక్ సేన్, మిథిలా పాల్కర్, ఆశాభట్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ మూవీలో వెంకటేష్ కీలక పాత్రలో నటించారు. ప్రసాద్ వి.పొట్లూరి, పరమ్ వి.పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదలైంది. ఈ సందర్భంగా జరిగిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ–''ఓరి దేవుడా' టీమ్ అంతా మళ్లీ కలిసి పనిచేయాలనుకుంటున్నాం. రానున్న రోజుల్లో ఈ సినిమా మరిన్ని అద్భుతాలు సృష్టిస్తుంది'' అన్నారు. ''ఓరి దేవుడా' ప్లెజెంట్ లవ్ స్టోరీ.. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు'' అన్నారు చిత్ర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వంశీ కాక. ''యువ ప్రేక్షకులే కాదు.. కుటుంబ ప్రేక్షకులు కూడా సినిమాను ఆదరిస్తున్నారు'' అన్నారు అశ్వత్ మారిముత్తు. హీరోయిన్లు మిథిలా పాల్కర్, ఆశా భట్, మ్యూజిక్ డైరెక్టర్ లియోన్, నటుడు వెంకటేష్ కాకమాను తదితరులు మాట్లాడారు.


బ్లాక్‌బస్టర్ నవ్వులు



● రష్మీ గౌతమ్, నందు

నందు విజయ్ కృష్ణ, రష్మీ గౌతమ్ జంటగా నటించిన చిత్రం 'బొమ్మ బ్లాక్‌బస్టర్'. రాజ్ విరాట్ దర్శకత్వంలో ప్రవీణ్ పగడాల, బోసుబాబు నిడుమోలు, ఆనంద్ రెడ్డి మద్ది, మనోహర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు మారుతి, హీరో సిద్ధు జొన్నలగడ్డ విడుదల చేశారు. ''ఈ సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు నవ్వుతారు'' అన్నారు మారుతి. ''మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు సిద్ధు జొన్నలగడ్డ. ''బడ్జెట్ విషయంలో రాజీ పడని మా నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు నందు. ''మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది''అన్నారు రాజ్ విరాట్. ''హీరో హీరోయిన్లు సహకరించడం వల్లే ఈ సినిమాను పూర్తి చేశాం'' అన్నారు నిర్మాతలు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎస్‌కేఎన్, రష్మీ గౌతమ్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రశాంత్ ఆర్.విహారి పాల్గొన్నారు.

ఒకే ఒక పాత్రతో..



● గార్గేయి

ప్రముఖ దర్శకులు బాపుగారి వద్ద పలు సినిమాలకు సహ దర్శకునిగా పనిచేసిన కాకర్ల శ్రీనివాసు దర్శకత్వం వహించిన చిత్రం 'హలో మీరా'. గార్గేయి యల్లాప్రగడ లీడ్‌రోల్‌లో నటించారు. జీవన్ కాకర్ల సమర్పణలో లూమియర్ సినిమా బ్యానర్‌పై డా.లక్ష్మణరావు దిక్కల, వరప్రసాద రావు దుంపల, పద్మ కాకర్ల నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ''ఒకే ఒక పాత్రతో ఒక రోజులో జరిగే కథతో రూపొందిన చిత్రమిది. విజయవాడ నుంచి హైదరాబాద్ ప్రయాణంలో చోటు చేసుకునే పరిణామాలు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. త్వరలో సినిమా విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.చిన్న, కెమెరా: ప్రశాంత్ కొప్పినీడి, లైన్ ప్రొడ్యూసర్: అనంత శ్రీధర్.

4 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో చివరి బంతికి విజయం అందుకోవడం భారత్‌కిది నాలుగోసారి. గతంలో ఆస్ట్రేలియాపై (సిడ్నీలో: 2016), బంగ్లాదేశ్‌పై (కొలంబోలో: 2018), వెస్టిండీస్‌పై (చెన్నైలో: 2018లో) భారత్ ఈ ఘనత సాధించింది.

18 టి20 మ్యాచ్‌ల్లో ఛేజింగ్ చేస్తూ అత్యధిక సార్లు నాటౌట్‌గా నిలిచిన క్రికెటర్‌గా షోయబ్ మాలిక్ (పాకిస్తాన్; 18 సార్లు) పేరిట ఉన్న రికార్డును కోహ్లి (18 సార్లు) సమం చేశాడు.

308 టి20 ప్రపంచకప్ చరిత్రలో పాకిస్తాన్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగిన కోహ్లి చేసిన పరుగులు (2012: 78 నాటౌట్; 2014: 36 నాటౌట్; 2016: 55 నాటౌట్; 2021: 57 ; 2022: 82 నాటౌట్).

1 అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు సాధించిన క్రికెటర్‌గా కోహ్లి (14 సార్లు) గుర్తింపు పొందాడు. మొహమ్మద్ నబీ (అఫ్గానిస్తాన్-13 సార్లు)ని కోహ్లి రెండో స్థానానికి పంపించాడు. టి20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు అందుకున్న క్రికెటర్‌గా కోహ్లి (6 సార్లు) నిలిచాడు. గేల్ (వెస్టిండీస్: 5 సార్లు) రికార్డును కోహ్లి అధిగమించాడు.

6 టి20 ప్రపంచకప్ చరిత్రలో పాకిస్తాన్‌పై భారత్ గెలిచిన మ్యాచ్‌ల సంఖ్య. రెండు జట్లు ముఖాముఖిగా ఏడుసార్లు తలపడగా... ఒకసారి మాత్రమే పాక్ గెలిచింది.

1 పాక్‌పై ఇన్నింగ్స్‌తో అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా కోహ్లి (110 మ్యాచ్‌ల్లో 3,794) మళ్లీ టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. రోహిత్ శర్మ (143 మ్యాచ్‌ల్లో 3,741 పరుగులు) రెండో స్థానానికి పడిపోయాడు.

2 టి20 ప్రపంచకప్ మ్యాచ్‌ల చరిత్రలో ఓ జట్టు చివరి 3 ఓవర్లలో 48 పరుగులు సాధించి నెగ్గడం ఇది రెండోసారి. వెస్టిండీస్‌లో జరిగిన 2010 ప్రపంచకప్ సెమీ ఫైనల్లో పాకిస్తాన్‌పై ఆస్ట్రేలియా చివరి మూడు ఓవర్లలో 48 పరుగులు చేసి గెలిచింది.

శ్రీలంక శుభారంభం


కుశాల్ మెండిస్

హోబర్ట్: టి20 ప్రపంచకప్‌లో శ్రీలంక శుభారంభం చేసింది. ఐర్లాండ్‌తో ఆదివారం జరిగిన 'సూపర్ 12' గ్రూప్-1 లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 128 పరుగులు సాధించింది. పాల్ స్టిర్లింగ్ (25 బంతుల్లో 34; 4 ఫోర్లు, 1 సిక్స్), టెక్టర్ (42 బంతుల్లో 45; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. లంక బౌలర్లలో హసరంగ, తీక్షణ రెండు వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం శ్రీలంక 15 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 133 పరుగులు చేసి నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుశాల్ మెండిస్ (43 బంతుల్లో 68 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా... ధనంజయ డిసిల్వా (25 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్), అసలంక (22 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు) ఆకట్టుకున్నారు.

సిక్కి జోడీకి టైటిల్




సుమీత్

న్యూఢిల్లీ: మాల్దీవ్స్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి సిక్కి రెడ్డి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో టైటిల్ సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) జోడీ 21-16, 21-18తో టాప్ సీడ్ తనీనా–కొసీలా మామెరి (అల్జీరియా) ద్వయంపై విజయం సాధించింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆకర్షి కశ్యప్ (భారత్) 24-22, 21-12తో ఇరా శర్మ (భారత్)పై నెగ్గి విజేతగా నిలిచింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో సుమీత్ రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) జోడీ 21-23, 21-19, 21-17తో చలోంపన్–నాంతకర్న్ (థాయ్‌లాండ్) జంటపై గెలిచి టైటిల్ దక్కించుకుంది.

టి20 ప్రపంచకప్‌లో నేడు
బంగ్లాదేశ్ X నెదర్లాండ్స్ (ఉ.గం. 9:30 నుంచి)
దక్షిణాఫ్రికా X జింబాబ్వే (మ.గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

టి20 ప్రపంచకప్‌లో రేపు
ఆస్ట్రేలియా X శ్రీలంక (సా.గం. 4:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

కోహ్లినూర్ విజయం

అద్భుతం... అసాధారణం... అనిర్వచనీయం ... ఆదివారం మెల్‌బోర్న్ వేదికగా భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌ను ఏ తీరుగా ప్రశంసించినా తక్కువే. టి20 క్రికెట్ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయేలా దాయాదుల మధ్య సమరం జరిగింది. ఒకదశలో పాకిస్తాన్ గెలవడం ఖాయమనిపించింది. కానీ భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి అసమాన పోరాటం చేశాడు. చిరకాలం అభిమానుల మదిలో మెదిలేలా కళ్లు చెదిరే షాట్‌లు ఆడాడు. హార్దిక్ పాండ్యాతో కలిసి భారత్‌ను మ్యాచ్‌లో నిలబెట్టాడు. కోట్లాది మంది అభిమానులను ఆనందంలో ముంచెత్తాడు. దీపావళి పండగకు దేశానికి విజయకానుక ఇచ్చాడు.

- భారత స్టార్ చిరస్మరణీయ ఇన్నింగ్స్
- పాండ్యా ఆల్‌రౌండ్ ప్రదర్శన
- పాకిస్తాన్‌పై టీమిండియా విజయం

మెల్‌బోర్న్: భారత్ ఏ టోర్నీలో ఓడిందో... అక్కడే బదులు తీర్చుకుంది. ఎవరిని (షాహిన్ అఫ్రిది) చితకబాదాలనుకుందో అతన్నే బాగా ఎదుర్కొంది. భారత బ్యాటర్లు, హిట్టర్లు నిరాశపరిచినా... అడుగడుగునా సవాళ్లు ఎదురైనా... ఒక్కో పరుగు బంగారమైనా... మోస్తరు లక్ష్యం కాస్తా కొండంత అయినా ... కోహ్లి ఆఖరిదాకా నిలిచి కరిగించాడు. ఇప్పటి కోహ్లికి అంత సీన్ ఉందా అనుకున్నవాళ్ల నోళ్లు మూయించి మునుపటి కోహ్లిలా పాక్‌పై శివమెత్తాడు. తన కెరీర్‌లోనే చిరస్మరణీయమైన ఇన్నింగ్స్ (53 బంతుల్లో 82 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆడి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. దీంతో భారత్ 4 వికెట్ల తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై విజయం సాధించింది. ఆకాశం తాకే ఉత్కంఠభరిత పోరులో భారత్ ఆఖరిబంతికి గెలిచింది. గతేడాది దుబాయ్‌లో ఎదురైనా పరాజయానికి మెల్‌బోర్న్‌లో ప్రతీకారం తీర్చుకుంది. టి20 ప్రపంచకప్ 'సూపర్ 12' దశ గ్రూప్-2 లీగ్ మ్యాచ్‌లో మొదట పాక్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 159 పరుగులు చేసింది. షాన్ మసూద్ (42 బంతుల్లో 52 నాటౌట్; 5 ఫోర్లు), ఇఫ్తికార్ అహ్మద్ (34 బంతుల్లో 51; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించారు. మిగతా వారిని అర్ష్‌దీప్ (3/32), హార్దిక్ పాండ్యా (3/30) కట్టడి చేశారు. తర్వాత భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసి గెలిచింది. కోహ్లి అజేయ పోరాటం చేయగా, పాండ్యా (37 బంతుల్లో 40; 1 ఫోర్, 2 సిక్స్‌లు) అండగా నిలిచాడు. హారిస్ రవూఫ్ (2/36), నవాజ్ (2/42) భారత్‌ను ఇబ్బంది పెట్టారు.

గెలిచేదాకా క్రీజులోనే...

లక్ష్య ఛేదనలో భారత ఓపెనర్లు రాహుల్ (4), రోహిత్ (4) నిరాశపరిచారు. 2 ఫోర్లు కొట్టిన సూర్యకుమార్ (10 బంతుల్లో 15) జోరుకు రవూఫ్ తెరదించాడు. అక్షర్ పటేల్ (2)ను ముందుకు పంపితే రనౌటయ్యాడు. భారత్ స్కోరు 31/4. లక్ష్యం కష్టమైన ఈ దశలో కోహ్లి, పాండ్యా ఆదుకున్నారు. 25వ బంతిదాకా కోహ్లి ఒక్క బౌండరీ కూడా కొట్టలేకపోయాడు. దీంతో సగం ఓవర్లు ముగిసేసరికి 45/4 స్కోరు చేసిన భారత్‌కు 60 బంతుల్లో 115 పరుగుల లక్ష్యం కష్టమైంది. నవాజ్ 12వ ఓవర్లో ఎట్టకేలకు 25వ బంతిని ఎదుర్కొన్న కోహ్లి సిక్సర్ కొట్టాడు. ఆ ఓవర్లో హార్దిక్ కూడా 2 సిక్స్‌లు కొట్టడంతో 20 పరుగులు వచ్చాయి. 15 ఓవర్లలో వంద పరుగులు చేసిన భారత్‌కు 30 బంతుల్లో 60 పరుగుల సమీకరణం క్లిష్టంగా ఉంది. 18వ ఓవర్ నుంచి కోహ్లి ఆట మారిపోయింది. తొలి బంతిని బౌండరీకి తరలించిన అతను 43 బంతుల్లో (4 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ సాధించాడు. షాహిన్ అఫ్రిది వేసిన ఆ ఓవర్లో మొత్తం 3 బౌండరీలు బాదాడు. ఆఖరి ఓవర్లో పాండ్యా, దినేశ్ కార్తీక్ నిష్క్రమించినా తన అనుభవాన్నంతా ఉపయోగించి జట్టును గెలిపించడంతో కోహ్లి సఫలమయ్యాడు. తొలి 20 బంతుల్లో 11 పరుగులే చేసిన కోహ్లి ఆఖరి 33 బంతుల్లో 71 పరుగులు చేయడం విశేషం. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 27న నెదర్లాండ్స్‌తో ఆడుతుంది.


కోహ్లి

ఆ రెండు సిక్స్‌లతో...

మ్యాచ్ ఆరంభం నుంచి బ్యాటర్లకు కఠిన సవాళ్లు విసురుతున్న ఎంసీజీ పిచ్‌పై కోహ్లి కోహినూర్ వజ్రంలాంటి ఇన్నింగ్స్ ఆడాడు. పాక్ బౌలర్లు నిప్పులు చెరుగుతున్న వేళ... భారత విజయ సమీకరణం 12 బంతుల్లో 31 పరుగులుగా మారిన వేళ... కోహ్లి ఆడిన షాట్లు ఇంకెవరికీ సాధ్యం కావు. ఇన్నింగ్స్ 19వ ఓవర్లో హారిస్ రవూఫ్ తొలి 4 బంతుల్లో 3 పరుగులిచ్చాడు. దాంతో భారత్ గెలవాలంటే 8 బంతుల్లో 28 పరుగులు చేయాలి. ఈ దశలో రవూఫ్ వేసిన ఐదో బంతిని అతని తలమీదుగా సిక్సర్ బాదాడు కోహ్లి. ఈ షాట్ మ్యాచ్‌లోనే హైలైట్. ఇక ఆరో బంతిని కోహ్లి ఫైన్‌లెగ్‌లో ఫ్లిక్ షాట్‌తో సిక్స్‌గా మలిచాడు. భారత విజయసమీకరణాన్ని 6 బంతుల్లో 16గా మార్చేశాడు.

బంతి బంతికీ ఉత్కంఠ...

గెలవడానికి భారత్ చివరి ఓవర్లో 16 పరుగులు చేయాలి. క్రీజులో 'హార్డ్ హిట్టర్' హార్దిక్ పాండ్యా, కోహ్లి ఉన్నారు. హార్దిక్ జోరు చూస్తుంటే మూడు షాట్‌లలో మ్యాచ్‌ను ముగించేస్తాడనిపించింది. కానీ ఆఖరి ఓవర్లో హైడ్రామా చోటు చేసుకుంది.

19.1 నవాజ్ వేసిన తొలి బంతికి భారీ షాట్ ఆడిన పాండ్యా అవుటయ్యాడు.

19.2 క్రీజులోకి వచ్చిన దినేశ్ కార్తీక్ 1 పరుగు తీసి కోహ్లికి స్ట్రయిక్ ఇచ్చాడు.

19.3 కోహ్లి 2 పరుగులు తీశాడు. భారత విజయ సమీకరణం 3 బంతుల్లో 13 పరుగులు.

19.4 నవాజ్ వేసిన ఫుల్‌టాస్‌ను కోహ్లి డీప్ స్క్వేర్‌లో సిక్సర్‌గా మలిచాడు. అంపైర్ దీనిని 'హైట్ నోబాల్‌గా' ప్రకటించాడు. దీంతో భారత్ ఖాతాలో 1 బంతికి 7 పరుగులు చేరాయి. భారత్‌కు 'ఫ్రీ హిట్' అవకాశం కూడా వచ్చింది. విజయ సమీకరణం 3 బంతుల్లో 6 పరుగులుగా మారింది.


పాండ్యా

19.4 ఈసారి నవాజ్ వైడ్ వేశాడు. ఫ్రీ హిట్ సజీవంగా నిలిచింది.

19.4 ఫ్రీ హిట్ బంతికి కోహ్లి బౌల్డ్ అయ్యాడు. 'ఫ్రీ హిట్'పై కేవలం రనౌట్ అయితేనే అవుట్‌గా పరిగణిస్తారు. వికెట్లకు తగిలిన బంతి థర్డ్ మ్యాన్ దిశగా వెళ్లింది. కోహ్లి, కార్తీక్ 3 'బై' పరుగులు తీశారు! విజయ సమీకరణం 2 బంతుల్లో 2 పరుగులుగా మారింది.

19.5 దినేశ్ కార్తీక్ స్వీప్ షాట్ ఆడగా బంతి అతని ప్యాడ్‌కు తగిలి వెనక్కి వెళ్లింది. కార్తీక్ క్రీజులోకి వచ్చేలోపు పాక్ కీపర్ రిజ్వాన్ స్టంపౌట్ చేశాడు. విజయ సమీకరణం 1 బంతికి 2 పరుగులుగా మారింది.

19.5 తీవ్ర ఒత్తిడిలో ఉన్న నవాజ్ లెగ్ సైడ్‌లో బంతి వేశాడు. అంపైర్ దానిని వైడ్‌గా ప్రకటించాడు. దాంతో భారత విజయ సమీకరణం 1 బంతికి 1 పరుగుగా మారింది.

19.6 ఈసారి నవాజ్ వేసిన బంతిని అశ్విన్ మిడాఫ్‌లో ఫీల్డర్ మీదుగా షాట్ ఆడాడు. పరుగు తీశాడు. భారత్ విజయం ఖరారైంది.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: రిజ్వాన్ (సి) భువనేశ్వర్ (బి) అర్ష్‌దీప్ 4; బాబర్ ఆజమ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 0; షాన్ మసూద్ (నాటౌట్) 52; ఇఫ్తికార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమీ 51; షాదాబ్ ఖాన్ (సి) సూర్యకుమార్ (బి) హార్దిక్ పాండ్యా 5; హైదర్ అలీ (సి) సూర్యకుమార్ (బి) హార్దిక్ పాండ్యా 2; నవాజ్ (సి) దినేశ్ కార్తీక్ (బి) హార్దిక్ పాండ్యా 9; ఆసిఫ్ అలీ (సి) దినేశ్ కార్తీక్ (బి) అర్ష్‌దీప్ 2; షాహిన్ అఫ్రిది (సి అండ్ బి) భువనేశ్వర్ 16; హారిస్ రవూఫ్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 159. వికెట్ల పతనం: 1-1, 2-15, 3-91, 4-96, 5-98, 6-115, 7-120, 8-151. బౌలింగ్: భువనేశ్వర్ 4-0- 22-1; అర్ష్‌దీప్ 4-0-32-3; షమీ 4-0-25-1; హార్దిక్ పాండ్యా 4-0-30-3; అశ్విన్ 3-0-23-0; అక్షర్ పటేల్ 1-0-21-0.

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (బి) నసీమ్ షా 4; రోహిత్ శర్మ (సి) ఇఫ్తికార్ (బి) హారిస్ రవూఫ్ 4; కోహ్లి (నాటౌట్) 82; సూర్యకుమార్ (సి) రిజ్వాన్ (బి) 15; అక్షర్ పటేల్ (రనౌట్) 2; హార్దిక్ (సి) బాబర్ ఆజమ్ (బి) నవాజ్ 40; దినేశ్ కార్తీక్ (స్టంప్డ్) రిజ్వాన్ (బి) నవాజ్ 1; అశ్విన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 160. వికెట్ల పతనం: 1-7, 2-10, 3-26, 4-31, 5-144, 6-158. బౌలింగ్: షాహిన్ అఫ్రిది 4-0-34-0; నసీమ్ షా 4-0-23-1; హారిస్ రవూఫ్ 4-0-36-2; షాదాబ్ ఖాన్ 4-0-21-0; నవాజ్ 4-0-42-2.



భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) డిసెంబర్-2022

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)..సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్)డిసెంబర్-2022 పరీక్షకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది ప్రతి ఏటా రెండుసార్లు పరీక్ష నిర్వహిస్తుంది.

అర్హత

» పేపర్-1: 50 శాతం మార్కులతో పన్నెండో తరగతితోపాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో రెండేళ్ల డిప్లొమా(డీఈఎల్ఈడీ)/డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(ప్రత్యేక విద్య) లేదా డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» పేపర్-2: 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీతోపాటు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్/బ్యాచిలర్ ఇన్ ఎడ్యుకేషన్(బీఈడీ)/బీఈడీ(ప్రత్యేక విద్య) లేదా సీనియర్ సెకండరీతోపాటు నాలుగేళ్ల బ్యాచిలర్ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (బీఈఎల్ఈడీ)/బీఎస్సీఈడీ/బీఏఈడీ/బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష. పరీక్షలో రెండు పేపర్‌లు ఉంటాయి. మొదటి పేపర్ ఒకటి నుంచి ఐదు తరగతులకు బోధించాలనుకునే వారి కోసం; రెండో పేపర్ ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ లైఫ్ లాంగ్ వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషలలో నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 31.10.2022
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.11.2022
» ఫీజు చెల్లింపు చివరితేది: 25.11.2022
» కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీలు: డిసెంబర్ 2022 నుంచి జనవరి 2023 మధ్య
» వెబ్‌సైట్: ctet.nic.in

ఏపీ హైకోర్టు, జిల్లా కోర్టుల్లో 3673 పోస్టులు

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, జిల్లా కోర్టుల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కార్యాలయ సిబ్బంది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. వివిధ నోటిఫికేషన్ల ద్వారా మొత్తం 3673 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఆఫీస్ సబార్డినేట్, జూనియర్ అసిస్టెంట్, ప్రాసెస్ సర్వర్, ఫీల్డ్ అసిస్టెంట్, అసిస్టెంట్ అండ్ ఎగ్జామినర్, స్టెనోగ్రాఫర్ ఖాళీలకు నియామక ప్రక్రియ నిర్వహించనున్నారు.
» మొత్తం పోస్టుల సంఖ్య: 3673
» అర్హతలు: పోస్టును అనుసరించి ఏడో తరగతి, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు టైప్ రైటింగ్/స్టెనో సర్టిఫికెట్, కంప్యూటర్ పరిజ్ఞానం, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
» వయసు: 01.07.2022 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు నిబంధనల మేరకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» వేతనం: ఆయా పోస్టులను అనుసరించి రూ.20వేల నుంచి రూ.1,24,380 మధ్య ఉంటుంది.
» ఎంపిక విధానం: పోస్టును అనుసరించి రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» హైకోర్టు ఖాళీలకు గడువు: 25.10.2022 నుంచి 15.11.2022;
» జిల్లా కోర్టుల ఖాళీలకు గడువు:22.10.2022 నుంచి 11.11.2022మధ్య దరఖాస్తు చేసుకోవాలి.
» వెబ్‌సైట్: https://hc.ap.nic.in/recruitment.html

ఏపీ ఫారెస్ట్ సర్వీస్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ ఫారెస్ట్ సర్వీస్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 08
» అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ(అగ్రికల్చర్,బోటనీ,కెమిస్ట్రీ, కంప్యూటర్ అప్లికేషన్స్/కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (అగ్రికల్చర్ /కెమికల్ /సివిల్ /కంప్యూటర్ /ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ మెకానికల్), ఇన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫారెస్ట్రీ, జియాలజీ, హార్టికల్చర్, వెటర్నరీ సైన్స్, మ్యాథమేటిక్స్, జువాలజీ. » వయసు: 01.07.2022 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. » వేతనం: రూ.48,440 నుంచి రూ.1,37,220 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: క్వాలిఫైయింగ్ టెస్ట్, పేపర్-1, పేపర్-2, పేపర్-3, పేపర్-4 పరీక్షల ఆధారంగా ఎంపిచేస్తారు.
» ఫీజు చెల్లింపు చివరితేది: 04.12.2022
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 05.12.2022
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

గ్రూప్-2కు సిద్ధమా..!

గ్రూప్-2 సర్వీసులు.. ప్రభుత్వ ఉద్యోగార్థుల అత్యంత క్రేజీ కొలువులు. గ్రూప్ 2 ద్వారా డిప్యూటీ తహశీల్దార్, ఏసీటీఓ, ఎక్సైజ్ ఎస్ఐ తదితర కీలక పోస్టులు సొంతం చేసుకోవచ్చు. ఇటీవలే గ్రూప్-1 నోటిఫికేషన్ ప్రకటించిన ఏపీపీఎస్సీ.. త్వరలోనే గ్రూప్-2 నోటిఫికేషన్ కూడా విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో అభ్యర్థులు తమ లక్ష్య సాధన దిశగా సన్నద్ధతకు పదును పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు!! ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ గ్రూప్-2 ఎంపిక ప్రక్రియ, రాత పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్‌తో ప్రత్యేక కథనం..

» మరికొద్ది రోజుల్లో గ్రూప్-2 నోటిఫికేషన్‌కు అవకాశం
» నోటిఫికేషన్ నుంచి మూడు నెలలలో తొలి దశ పరీక్ష
» సన్నద్ధతకు పదును పెట్టుకోవాలంటున్న నిపుణులు

ఏపీపీఎస్సీ.. గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల దిశగా శరవేగంగా అడుగులు వేస్తోంది. ఈసారి మూల్యాంకన విధానంలో మార్పులు చేయాలని భావించి.. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వాటికి ఆమోదం లభించగానే నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.

182 పోస్టులకు అనుమతి

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 182 గ్రూప్ 2 పోస్టుల భర్తీకి అనుమతినిచ్చింది. దీంతో త్వరలో వెలువడే నోటిఫికేషన్ కూడా ఇదే సంఖ్యతో ఉండే అవకాశం ఉందంటున్నారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్-30, సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్-2-16, అసిస్టెంట్ రిజిస్ట్రార్, కోపరేటివ్-15, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-3-05, ఏఎల్‌వో (లేబర్)-10, ఏఎస్‌వో (లా)-02, ఏఎస్‌వో(లేజిస్లేచర్)-04, ఏఎస్‌వో(సాధారణ పరిపాలన)-50, జూనియర్ అసిస్టెంట్స్ (సీసీఎస్)-05, సీనియర్ అకౌంటెంట్ (ట్రెజరీ)-10, జూనియర్ అకౌంటెంట్ (ట్రెజరీ)-20, సీనియర్ ఆడిటర్(స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్)-05, ఆడిటర్(పే అండ్ అలవెన్స్ డిపార్ట్‌మెంట్)-10 తదితర పోస్టులు ఉన్నాయి.

రెండు దశలుగా రాత పరీక్ష

గ్రూప్-2 ఎంపిక ప్రక్రియను రెండు దశల్లో రాత పరీక్షల ద్వారా నిర్వహించనున్నారు. తొలి దశ రాత పరీక్షను స్క్రీనింగ్ టెస్ట్‌గా, రెండో దశ రాత పరీక్షను మెయిన్ టెస్ట్‌గా పేర్కొంటారు.

స్క్రీనింగ్ టెస్ట్

గ్రూప్-2 తొలిదశ రాత పరీక్షగా పేర్కొనే స్క్రీనింగ్ టెస్ట్ మూడు విభాగాల్లో 150 మార్కులకు జరుగుతుంది. సెక్షన్ ఏలో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ; సెక్షన్ బీలో ఆంధ్రప్రదేశ్ సామాజిక, సాంస్కృతిక చరిత్ర, భారత రాజ్యాంగం; సెక్షన్ సీలో ప్లానింగ్ అండ్ ఎకానమీ ఉంటాయి.

రెండో దశ మెయిన్

తొలిదశ స్క్రీనింగ్ టెస్ట్ తర్వాత రెండో దశగా నిర్వహించే గ్రూప్-2 మెయిన్ పరీక్షను మూడు పేపర్లుగా 450 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్ 1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ 150 మార్కులకు; అలాగే 150 మార్కులకు జరిగే పేపర్2లో సెక్షన్1లో సోషల్ హిస్టరీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సెక్షన్ 2 భారత రాజ్యాంగ సమీక్ష; పేపర్ 3లో ప్లానింగ్ ఇన్ ఇండియా, ఇండియన్ ఎకానమీ, సమకాలీన సమస్యలు, ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్యంగా గ్రామీణ ప్రాంతాల్లోఅభివృద్ధి 150 మార్కులకు ఉంటాయి.

కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్

గ్రూప్-2 అభ్యర్థులకు చివరగా కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. మొత్తం అర్హత పొందిన అభ్యర్థుల నుంచి 1:2 నిష్పత్తిలో జాబితా రూపొందించి.. వారికి కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ టెస్ట్ నిర్వహిస్తారు.

విజయం సాధించాలంటే

సిలబస్‌పై పట్టు

గ్రూప్-2 పరీక్షలో గెలుపు కోసం సిలబస్ అంశాలపై పట్టు సాధించడం చాలా ముఖ్యం. అందుకే అభ్యర్థులు తొలుత సిలబస్ ఆసాంతం అవగాహన చేసుకోవాలి. ఆయా అంశాలకు ఉన్న వెయిటేజీకి అనుగుణంగా తమ ప్రిపరేషన్‌ను సాగించాలి. ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అంశాలను గుర్తించాలి. వాటి కోసం సమయం కేటాయించాలి.

గ్రూప్-1తో సమన్వయం

ఇటీవల ఏపీపీఎస్సీ గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షకు పోటీ పడే వారిలో అధిక శాతం మంది గ్రూప్-2కు కూడా దరఖాస్తు చేసుకుంటారు. ఇలాంటి అభ్యర్థులు గ్రూప్-1తో సమన్వయం చేసుకుంటూ సిద్ధమైతే.. గ్రూప్-2 లోనూ విజయావకాశాలను మెరుగుపరచుకోవచ్చు.గ్రూప్-1, గ్రూప్-2 సిలబస్‌లో దాదాపు 80 శాతం అంశాలు ఒకే మాదిరిగా ఉన్నాయి. కాబట్టి అభ్యర్థులు గ్రూప్-1 ఓరియెంటేషన్‌తో.. డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో ముందుకు సాగితే.. గ్రూప్-2 సిలబస్ పైనా పట్టు సాధించే అవకాశం ఉంది.

కాన్సెప్ట్స్ + కరెంట్ ఈవెంట్స్

సిలబస్ అంశాలను చదివేటప్పుడు వాటిని సమకాలీన అంశాలతోనూ సమన్వయం చేసుకుంటూ ప్రిపేరవ్వాలి. తద్వారా కోర్ సబ్జెక్ట్‌ల్లో పట్టు సాధించడంతోపాటు సమకాలీన పరిణామాల పైనా అవగాహన వస్తుంది. ముఖ్యంగా గ్రూప్-1 అభ్యర్థులకు ఇది కలిసొచ్చే అంశం.

విశ్లేషణాత్మకంగా

- ఆయా అంశాలను చదివేటప్పుడు విశ్లేషణాత్మక దృక్పథాన్ని అనుసరించాలి. సమకాలీన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన, విశ్లేషణ, స్వీయ అభిప్రాయ దృక్పథం పెంచుకోవాలి. ముఖ్యమైన అంశాలకు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానాలు.. ఇలా అన్ని కోణాల్లో అవగాహన పెంచుకోవాలి.
- రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు.. ముఖ్యంగా నవరత్నాలు, ఇతర అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు, లక్షిత వర్గాలు, బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటివరకు లబ్ధి పొందిన వారి సంఖ్య తదితర వివరాలను అవపోసన పట్టాలి. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ఆర్థిక విధానాలు, వాటిద్వారా కలిగిన అభివృద్ధిపై దృష్టి సారించాలి.
- జాతీయ స్థాయిలో తాజా రాజ్యాంగ సవరణలు, నూతన జాతీయ విద్యా విధానం, ఇటీవల కాలంలో కీలకమైన తీర్పుల గురించి అవగాహన అవసరం.

సబ్జెక్ట్‌లు.. కీలక అంశాలు

- హిస్టరీలో రాష్ట్ర చరిత్ర,సంస్కృతికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. ప్రాచీన చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకూ..ముఖ్యమైన అంశాలపై పట్టు పెంచుకోవాలి. జాతీయోద్యమంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర గురించి అధ్యయనం చేయాలి. ఇదే తీరులో భారతదేశ చరిత్రకు సంబంధించిన అంశాలనూ అధ్యయనం చేయాలి.
- భౌగోళిక శాస్త్రానికి సంబంధించి.. రాష్ట్రంలోని భౌగోళిక వనరులు, అడవులు, జీవ సంపద, వ్యవసాయ వనరుల గురించి తెలుసుకోవాలి. వీటిని తాజా పరిస్థితులతో అన్వయం చేసుకోవాలి. గతేడాది కాలంలో చేపట్టిన వ్యవసాయ, నీటి పారుదల ప్రాజెక్ట్‌లు.. వాటి ద్వారా లబ్ధి చేకూరే ప్రాంతాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- పాలిటీ విభాగంలో రాణించేందుకు రాజనీతి శాస్త్రం, రాజ్యాంగానికి సంబంధించి ప్రాథమిక అంశాలు, భావనలు మొదలు తాజా పరిణామాలు(రాజ్యాంగ సవరణలు వాటి ప్రభావం) వరకూ తెలుసుకోవాలి. గవర్నెన్స్, లా, ఎథిక్స్‌కు సంబంధించి సుపరిపాలన దిశగా చేపడుతున్న చర్యలు, పబ్లిక్ సర్వీస్‌లో పాటించాల్సిన విలువలు, ప్రజాసేవలో చూపించాల్సిన నిబద్ధత, అంకిత భావం వంటి విషయాలపైనా అవగాహన పెంచుకోవాలి. వాస్తవానికి దీనికి సంబంధించి ప్రత్యేక పుస్తకాలు లేనప్పటికీ.. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పుస్తకాలు కొంత మేలు చేస్తాయి. న్యాయపరమైన అంశాలపైనా పట్టు సాధించాలి. ప్రాథమిక హక్కులు, విధులు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు.. వీటికి సంబంధించి న్యాయ వ్యవస్థకున్న అధికారాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా, సివిల్, క్రిమినల్ లా, కార్మిక చట్టాలు, సైబర్ చట్టాలు, ట్యాక్స్ లాస్‌లను చదవాలి.



- ఎకానమీ ప్రిపరేషన్ ప్రారంభ దశలో మౌలిక భావనలు మొదలు తాజా వృద్ధి రేట్ల వరకూ.. గణాంక సహిత సమాచారం సేకరించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలి. ఇటీవల కాలంలో చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలు, వాటిద్వారా లబ్ధి చేకూరే వర్గాలు; జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా తాజాగా తీసుకొచ్చిన విధానాలపై పట్టు సాధించాలి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, ఎకనామిక్ సర్వేలను అధ్యయనం చేయాలి.
- సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమలవుతున్న కొత్త విధానాలు, ప్రధాన సంస్థలు, రాష్ట్ర స్థాయిలో ఐసీటీ విధానాలు, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, డీఆర్‌డీఓ, ఇంధన వనరులు, విపత్తు నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. దీంతోపాటు పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై అవగాహన పెంచుకోవాలి.

పునర్విభజన చట్టంపైనా

గ్రూప్-2 అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. జనరల్ స్టడీస్, ఎకానమీ, హిస్టరీ పేపర్లు అన్నింటిలోనూ.. ఈ చట్టం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. కాబట్టి అభ్యర్థులు పునర్విభజన చట్టాన్ని ప్రత్యేక దృష్టితో అధ్యయనం చేయాలి. విభజన తర్వాత ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలు.. వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి తెలుసుకోవాలి.

ఏపీపీఎస్సీ గ్రూప్-2.. ముఖ్య సమాచారం

- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో గ్రూప్-2కు దరఖాస్తు. • మరికొద్ది రోజుల్లోనే నోటిఫికేషన్ విడుదలకు అవకాశం. • ఇప్పటి వరకు ఆమోదం లభించిన గ్రూప్-2 పోస్టుల సంఖ్య 182. • స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్ పేరుతో రెండు దశల రాత పరీక్ష.
- నోటిఫికేషన్ వెలువడిన మూడు నెలలలోపు తొలి దశ రాత పరీక్ష.



ఏలూరు జిల్లా కైకలూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



అంబేడ్కర్ కోనసీమ జిల్లా పామర్రు బీసీ కాలనీలో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న మంత్రి చెల్లుబోయిన

ఆరా తీస్తూ.. అండగా నిలుస్తూ

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అన్ని జిల్లాల్లోనూ ఉత్సాహభరితంగా సాగుతోంది. కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తోన్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటివద్దా ఘన స్వాగతం లభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. పథకాల లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.



బాపట్ల జిల్లా బూతుమల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున



కృష్ణా జిల్లా కోడూరులో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే రమేష్‌బాబు

రేపు వైఎస్సార్ ఏఎఫ్‌యూలో పీజీ ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీన పీజీసెట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పీజీసెట్-22 చైర్‌పర్సన్ ఆచార్య మునగల సూర్యకళావతి, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మాస్టర్ ఇన్ ప్లానింగ్-అర్బన్ అండ్ రీజినల్ ప్లానింగ్ కోర్సులో 2022-23 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థుల్లో జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత కలిగిన వారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ ప్రతులు, 6 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులకు సీటు కేటాయింపు అదేరోజు జరుగుతుందని వారు స్పష్టం చేశారు.

సైనిక పాఠశాల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

కలికిరి: సైనిక పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరం 6, 9వ తరగతులలో ప్రవేశాలకు నిర్వహించే ఆల్ ఇండియా సైనిక్ పాఠశాలల ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఏఐఎస్ఎస్ఈఈ-2023) నోటిఫికేషన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసింది. 6వ తరగతిలో ప్రవేశానికి 2023 మార్చి 31 నాటికి 10 నుంచి 12 సం.లోపు, 9వ తరగతిలో ప్రవేశానికి 13 నుంచి 15సం.లోపు వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొంది. జనరల్ అభ్యర్థులు రూ.650, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేయాల్సి ఉందని తెలిపింది. వచ్చే ఏడాది జనవరి 8న ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. నవంబర్ 30వ తేదీ దరఖాస్తుకు చివరి గడువుగా నిర్ణయించింది.

యుద్ధప్రాతిపదికన వ్యవసాయ విద్యుత్ సర్వీసులు

- ఈ నెల 16 నాటికి ఎస్పీడీసీఎల్‌లో 33,794, ఈపీడీసీఎల్‌లో 4,525 సర్వీసుల విడుదల
- పెండింగ్‌లో ఉన్నాయంటూ రాసిన 'ఈనాడు' కథనం అవాస్తవం
- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను యుద్ధప్రాతిపదికన మంజూరు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ తూర్పు, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంల) సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. ఈనాడు దినపత్రికలో ఆదివారం 'కరెంటు కనెక్షన్లకు పడిగాపులు' శీర్షికతో ప్రచురితమైన కథనాన్ని ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. ఆ ప్రకటనలో వాస్తవాలను వివరించారు.

పెండింగ్ లెక్కలు తప్పు

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలోని చిత్తూరు, నెల్లూరు, వైఎస్సార్, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఇంకా 42,937 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనడంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సంస్థ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 16వ తేదీ నాటికి మొత్తం 33,794 సర్వీసులను విడుదల చేశామని, 33,099 పెయిడ్ పెండింగ్ సర్వీసులను విడుదల చేయాల్సి ఉందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు జిల్లాల్లో ఎనిమిదివేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనడంలో వాస్తవం లేదని తెలిపారు. ఈ డిస్కం పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 16వ తేదీ నాటికి మొత్తం 4,525 సర్వీసులను విడుదల చేశామని, 3,687 పెయిడ్ పెండింగ్ సర్వీసులను విడుదల చేయాల్సి ఉందని వివరించారు.

సిద్ధంగా మెటీరియల్

ఈ మొత్తం పెండింగ్ సర్వీసులను మంజూరు చేయడానికి అవసరమైన మెటీరియల్ కూడా ఆయా జిల్లాల స్టోర్లలో సిద్ధంగా ఉందని, వాటికి సంబంధించిన పనులను కూడా వేగవంతం చేస్తున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో భారీవర్షాల కారణంగా ఈ పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. నవంబర్ చివరి నాటికి పెండింగ్ సర్వీసుల మంజూరు ప్రక్రియను పూర్తిచేయాలనే ధ్యేయంతో ఉన్నట్లు ఆయన తెలిపారు.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

2016-17తో పోలిస్తే 2021-22కి పెరిగిన వినియోగదారులు, డిమాండ్

- వినియోగదారులు 18%, డిమాండ్ 21.9% వృద్ధి
- ఇది ఆర్థికవృద్ధికి సూచీ
- అధికారులతో సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చి, విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విద్యుత్ శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ వేగంగా పెరిగిందని, రానున్న కాలంలో మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ఇది రాష్ట్ర ఆర్థికవృద్ధికి సూచీగా చెప్పుకోవచ్చన్నారు. రాష్ట్రంలో 2016-17లో 49,991 మిలియన్ యూనిట్లు ఉన్న విద్యుత్ డిమాండ్ 2021-22 నాటికి 21.9 శాతం పెరిగి 60,943 మిలియన్ యూనిట్లకు చేరిందని చెప్పారు. 2016-17లో దాదాపు 1.71 కోట్లు ఉన్న విద్యుత్ వినియోగదారుల సంఖ్య ఉండగా 2021-22 నాటికి 18 శాతం పెరిగి 2.03 కోట్లకు చేరిందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నాటికి సగటు డిమాండ్ 174 మిలియన్ యూనిట్ల (ఎంయూ)ని తాకిందన్నారు. అదే 2019 అక్టోబర్‌లో సగటు డిమాండ్ 158 మిలియన్ యూనిట్లని తెలిపారు. డిమాండ్ ఈ ఏడాది 10 శాతం పెరిగిందని, మార్చి నాటికి 250 ఎంయూకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నామన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ట్రాన్స్‌మిషన్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ లైన్లు, ఎక్స్‌ట్రా హైటెన్షన్ (ఈహెచ్‌టీ) సబ్‌స్టేషన్లు, 33 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు విద్యుత్ సంస్థలు చర్యలు చేపట్టాయని తెలిపారు. పెరుగుతున్న ఇంధన డిమాండ్‌ను తీర్చడానికి, వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి ఇవి ఎంతో దోహదపడనున్నాయని ఆయన చెప్పారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రధాన కార్యదర్శి (ఇన్‌చార్జి) కె.విజయానంద్, ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, జేఎండీలు ఐ.పృథ్వీతేజ్, బి.మల్లారెడ్డి, డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మజనార్ధనరెడ్డి, నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ ఎస్.రమణారెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇద్దరి సజీవ దహనం

- విజయవాడలోని బాణసంచా దుకాణాల్లో మంటలు
- మూడు షాపులు దగ్ధం
- విజయనగరంలో విశాల్ మార్ట్ దగ్ధం.. రూ.4 కోట్ల మేర ఆస్తి నష్టం



విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్)/విజయనగరం క్రైమ్: రాష్ట్రంలో ఆదివారం రెండు భారీ అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బాణసంచా దుకాణాల్లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, విజయనగరం జిల్లా కేంద్రంలోని విశాల్ మార్ట్‌లో జరిగిన ప్రమాదంలో భారీ ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. దీపావళి సందర్భంగా విజయవాడ జింఖానా మైదానంలో 19 బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. వీటిలో 16వ నంబర్ దుకాణంలో ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో మొదట అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు ఎగిసిపడి పక్కనే ఉన్న 15, 17 నంబర్ దుకాణాలకు వ్యాపించాయి. ఒక్కసారిగా పేలుడు సంభవించి మంటలు ఎగిసిపడడంతో ఇతర దుకాణాల వారు పరుగులు తీశారు. ఏం జరుగుతుందో తెలిసేలోపే మూడు షాపులు దగ్ధమయ్యాయి. ఆయా షాపుల్లో పనిచేసేందుకు వచ్చిన గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన కొల్లి బ్రహ్మం(40), విజయవాడ విద్యాధరపురానికి చెందిన కందుకూరి కాశయ్య(39)లు మంటల్లో చిక్కుకుని సజీవదహనమయ్యారు. పోలీస్, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. రూ.15 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. నాటు చిచ్చు బుడ్లు ఒత్తిడికి లోనై ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఘటన స్థలాన్ని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి తదితరులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంపై రెవెన్యూ కార్యదర్శి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్టు సత్యనారాయణపురం సీఐ బాలమురళీకృష్ణ చెప్పారు.

విశాల్ మార్ట్‌లో భారీ అగ్ని ప్రమాదం..

విజయనగరం జిల్లా కేంద్రం ఆర్ అండ్ బీ సమీపంలోని విశాల్ మార్ట్‌లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం 7.30 గంటల నుంచే పొగలు కమ్ముకుని మంటలు చెలరేగాయి. ధనత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయాన్నే షాపు తీసేందుకు వచ్చిన వర్కర్లు మంటలను గమనించి డయల్ 100కి సమాచారం ఇచ్చారు. అగ్ని మాపక సిబ్బంది ఐదు వాహనాలతో ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. విశాఖ నుంచి బ్రాంటో స్కై లిఫ్ట్‌ను తీసుకొచ్చి భవనం పై నుంచి నీటితో మంటలనార్పారు. సుమారు రూ.4 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగినట్టు అధికారుల అంచనా. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.



బ్రహ్మయ్య (ఫైల్)



కాశయ్య (ఫైల్)

మరో అగ్నిప్రమాదంలో ఐదు దుకాణాలు దగ్ధం

ఇదిలా ఉండగా, విజయవాడలోనే ఆదివారం రాత్రి జరిగిన మరో అగ్ని ప్రమాదంలో ఐదు దుకాణాలు దగ్ధమయ్యాయి. లెనిన్‌సెంటర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. బాణసంచా కాల్చడంతో గవర్నర్‌పేట ఐఎంఏ హాల్ సమీపంలో రైవస్ కాలువగట్టు మీద ఉన్న మూడు ఉడ్‌వర్క్ షాపులు, రెండు సోఫా సెట్ల తయారీ షాపులు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.6 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది.

అధికారులపై చర్యలు తీసుకోవాలి: సోము వీర్రాజు

సాక్షి, అమరావతి: విజయవాడలో నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా షాపుల ఏర్పాటుకు అనుమతిచ్చిన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.



Cell Point
దీపావళి శుభాకాంక్షలతో...
HAPPY Diwali
23 Years
#1 Mobile Retail Seller
MOST TRUSTED BRAND
23వ వార్షికోత్సవ సంబరాలు
Upto 10% CASH BACK
₹ Pay 1 Get SMART PHONE
₹ Upto 10,000 DIRECT DISCOUNT
Debit Card EMI
0% Down Payment
Smart TV
కేవలం రూ.8,999* కే
Available
32" (80cm)
43" (108cm)
55" (139cm)
Direct Discount Upto ₹10,000
CASH BACK upto ₹7,500
DHAMAKA CASH BACK OFFERS
EASY EMI 3 Months 0% Interest Monthly ₹2,500
micromax ఇప్పుడు మా వద్ద
ఆన్‌లైన్ కంటే తక్కువ ధరకే
IN 2C 3 GB, 32 GB ₹9,499 ₹5,999
IN 2B 4 GB, 64 GB ₹10,499 ₹6,999
Stocks ఉన్నంత వరకు మాత్రమే
vivo
Y22 Airpods ₹199* ₹1450 MONTHLY EMI CASH BACK Upto ₹1,500
Y75 4G Smartwatch ₹499* ₹1500 MONTHLY EMI CASH BACK Upto ₹2,000
V25 5G Smart Calling Watch ₹999* ₹1866 MONTHLY EMI CASH BACK Upto ₹2,500
V25Pro 5G Smart Calling Watch ₹999* ₹1999 MONTHLY EMI CASH BACK Upto ₹4,000
6 months extended warrenty - 1 time Screen Replacement
oppo
RENO 8 Neckband ₹99* ₹4285 EMI Upto 10% CASH BACK or 3% Paytm OFF
A57 Airpods ₹199* ₹1167 MONTHLY EMI Upto 10% CASH BACK or 3% Paytm OFF
A77s Smartwatch ₹499* ₹1500 MONTHLY EMI Upto 10% CASH BACK or 3% Paytm OFF
F21s Pro Smart Calling Watch ₹999* ₹1444 MONTHLY EMI Upto 10% CASH BACK or 3% Paytm OFF
No Cost EMI - Zero Down Payment
mi 11i Hypercharger 5G
DIRECT DISCOUNT ₹2,000
Free Watch
ONEPLUS
5G 10 T Upto ₹5,000 CASH BACK
NORD CE2 LITE Upto ₹1,500 CASH BACK
5G 10 R DIRECT DISCOUNT ₹2,000 Upto ₹3,000 CASH BACK
SAMSUNG
Amp your awesome with No Shake Cam
Awespme festive offers starting at ₹24499*
A13 ₹1400 MONTHLY EMI Airpods ₹199* DIRECT DISCOUNT ₹1,000 upto ₹1,000 CASH BACK
A23 DIRECT DISCOUNT ₹2,000 Smartwatch ₹499*
S20 FE ₹26,999* Smart Calling Watch ₹999*
SMART WATCH START FROM ₹1499
iPhone
noise
boAt
realme C21 Y DIRECT DICOUNT upto ₹1,000
CASH BACK upto ₹5000
EXCHANGE BONUS upto ₹3000
iphone 14 5G MRP ₹79,990 ₹71,900*
iphone 13 5G MRP ₹69,990 ₹63,900*
24 MONTHS EMI TENURE
0% Processing Fee
Monthly EMI ₹2,913
Upto 60% Discount on Accessories
Buy any Smart Phone Get...
₹99* ₹199* ₹499* ₹999*
UPTO 7.5% CASH BACK SBI card
Cell Point
IDFC FIRST Bank HDB BAJAJ FINSERV HDFC BANK zest HOME CREDIT Pine Labs TVS CREDIT
విజయవాడ 0866 6629888, 6672888, 6642888 • మసీద్ స్ట్రీట్, ఏలూరు రోడ్ • విజయ టాకీస్ ఎదురుగా, ఏలూరు రోడ్ • M&M షోరూం ఎదురుగా, ఎమ్.జి రోడ్డు • కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఎదురుగా, పటమట • పి.టి. కాలనీ ఎదురుగా, బందరు రోడ్
గుడివాడ 08674242066 • ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా
హనుమాన్ జంక్షన్ 08656-242635 • పోలీస్ అవుట్ పోస్ట్ ప్రక్కన, విజయవాడ రోడ్డు
* Conditional Apply
Designmouse 9885974411

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

సోమవారం, 24, అక్టోబర్, 2022



సుబ్బారాయుడికి వెండి నాగ పడగ

మోపిదేవి: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి రూ. 72,000 విలువ గల 1.3 కేజీల వెండి నాగపడగను మచిలీపట్నంకు చెందిన రాళ్లపల్లి లీలానాగభరద్వాజ్ దంపతులు సమర్పించారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ నిత్యాన్నదాన పథకానికి విజయవాడ సూర్యారావుపేటకు చెందిన గాజుల రమేష్ కుటుంబం రూ. లక్ష విరాళాన్ని అందజేసింది. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు.

దీపావళి శుభాకాంక్షలు

పెడన: దీపావళి పండగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా.. చీకటిని పారదోలుతూ వెలుగులు తీసుకువచ్చిన పండగను సోమవారం అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు.



న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశానికి మరో అవకాశం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో చేరేందుకు ఐదో విడత అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 తేదీలోగా విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, వారు చేరాలనుకుంటున్న కళాశాలకు అదే రోజు సాయంత్రం 5 గంటలలోగా వెళ్లి సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో చేరాలనుకునే వారికి ఈ నెల 29న, ప్రైవేటు ఐటీఐల్లో చేరాలనుకునే వారికి ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 0866-2475575, 94906 39639, 91602 49343లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

రామలింగేశ్వరునికి విరాళాలు



పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారికి విజయవాడ పటమటకు చెందిన మూల్పూరు బాలకృష్ణ శ్రీలక్ష్మి 3 కిలోల 550 గ్రాముల బరువుగల వెండి గంగాళాన్ని విరాళంగా అందజేసినట్లు ఈవో ఎం.గంగాధర రావు తెలిపారు. దీని విలువ దాదాపు రూ 2.50 లక్షలు ఉంటుందని చెప్పారు. అలాగే కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆలయ అవసరానికి భక్తురాలు ధనేకుల సునీత రూ. 70 వేలు విలువ చేసే మైక్ సెట్ బహూకరించారు.

దుర్గమ్మ సేవలో జస్టిస్ మల్లికార్జునరావు



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబం సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జస్టిస్ మల్లికార్జునరావుకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారి ఎం.ఎస్.ఆర్.కె. ప్రసాద్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

నేటి స్పందన రద్దు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): దీపావళి పండుగ సందర్భంగా సోమవారం సెలవు దినం కావడంతో, ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగే స్పందనను రద్దు చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

రేపు దేవస్థానం మూసివేత

నెమలి(గంపలగూడెం): సూర్యగ్రహణం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానాన్ని మంగళవారం ఉదయం 7గంటల నుంచి మూసివేయనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కె. శాంతి తెలిపారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తామని చెప్పారు.



సంతోషాల కేళి
కాంతుల దీపావళి

వెలుగుల పండగ దీపావళి సందడి మొదలైంది. ఊరూవాడా దీపకాంతులతో శోభిల్లుతోంది. ఇంటింటా సంతోషాలు కాంతులీనుతున్నాయి. కరోనా కారణంగా గత రెండేళ్లు ప్రజలు పండగను అంతంతమాత్రంగానే జరుపుకొన్నారు. ఈ ఏడాది కరోనా పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో సర్వత్రా జోష్ నెలకొంది. బాణ సంచా కాల్చేందుకు చిన్నాపెద్దా ఉత్సాహం చూపుతున్నారు. దీంతో మార్కెట్‌లో సందడి కనిపిస్తోంది. కొనుగోలు దారులతో బాణసంచా దుకాణాలు కళకళలాడుతున్నాయి. రెండేళ్లుగా వ్యాపారాలు సరిగా సాగకపోవడంతో ఈ ఏడాదైనా లాభాలు సాధించాలని వ్యాపారులు భావిస్తున్నారు. మరోవైపు టపాసుల ధరలూ భారీగా పెరిగాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





విజయవాడ సంగీత కళాశాల ప్రాంగణంలోని ఓ దుకాణం వద్ద రద్దీ



విజయవాడ వన్‌టౌన్ పూల మార్కెట్‌లో కొనుగోలుదారులు



సంగీత కళాశాల ప్రాంగణంలో కొనుగోలుదారుల రద్దీ

బాణసంచా.. అనుమతి పక్కా





బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్

- క్షేత్ర స్థాయిలో అధికారుల ముమ్మర తనిఖీలు
- అనధికార అమ్మకాలపై నిఘా
- ఎన్టీఆర్ జిల్లాలో 116, వీఎంసీ పరిధిలో 63 షాపులకు అనుమతి
- జింఖానా గ్రౌండ్స్‌లో ప్రమాదం నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో బాణ సంచా విక్రయాలపై జిల్లా యంత్రాంగం నిఘా ఉంచింది. విజయవాడలోని జింఖానా మైదానంలో జరిగిన అగ్ని ప్రమాదం నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. బాణసంచా విక్రయాలపై నిఘా ఏర్పాటు చేసి, క్షేత్ర స్థాయిలో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టారు. అనుమతి లేని షాపులు, అనధికార విక్రయాలపై దృష్టి పెట్టారు.

అనుమతులు ఇలా..

ఎన్టీఆర్ రూరల్ జిల్లా పరిధిలో 116, విజయవాడ కార్పొరేషన్ పరిధిలో 63 షాపులకు అనుమతి ఇచ్చినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ చెప్పారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జింఖానాలో 19, ఘంటశాల గ్రౌండ్‌లో 23, మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో 04, శాతవాహన కాలేజి బ్యాక్ సైడ్ గ్రౌండ్‌లో 12, విశాలాంధ్ర ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 05 షాపులకు అనుమతినిచ్చారు. లోకల్‌గా తయారు చేసిన బాణసంచా విక్రయాలను నిషేధించారు. అనుమతి ఇచ్చిన షాపులు సైతం నిబంధనల ప్రకారం ఏర్పాటు చేశారా? లేదా? అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రమాదం జరిగిన జింఖానా గ్రౌండ్‌లోని షాపులను పూర్తిగా మూసివేశారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ క్షేత్ర స్థాయిలో పర్యటించి విజయవాడ రూరల్ రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడులో ఏర్పాటు చేసిన బాణ సంచా దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనవాసాల మధ్య ఉన్న దుకాణాలను తక్షణమే ఎనికేపాడులోని రైస్ మిల్లు వద్ద ఉన్న ఖాళీ స్థలానికి తరలించాలని రెవెన్యూ, ఫైర్ అధికారులను ఆదేశించారు.

దుకాణాల ఆకస్మిక తనిఖీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దీపావళి పర్వదినాన్ని ప్రజలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టి.కె. రాణా అన్నారు. టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా పిల్లలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదివారం నగర పరిధిలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విక్రయదారులకు, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా/తయారు చేస్తున్నా వెంటనే డయల్ - 100 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు.



దుకాణాలు తనిఖీ చేస్తున్న సీపీ టి.కె. రాణా

సంఘటన దురదృష్టకరం..

జింఖానా మైదానంలో ప్రమాదం దురదృష్టకరం. ఘటనలో మూడు దుకాణాలు దగ్ధం కాగా, మంటల్లో చిక్కుకుని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. సంఘటనా స్థలానికి దగ్గరలో ఒక వ్యక్తి స్పృహ కోల్పోగా తక్షణమే అతనిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాం. ఆస్పత్రిలో బాధితుని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పాం. జిల్లా వ్యాప్తంగా ఆర్డీఓలు, తహసీల్దార్లు, పోలీసులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, అనధికార షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.

- శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్, ఇన్‌చార్జి కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

ప్రత్యేక బృందాలతో తనిఖీలు..

నగరంలో అనధికారికంగా బాణ సంచా విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకొంటాం. జనావాసాల మధ్య అనుమతి లేకుండా ఏర్పాటు చేసే దుకాణాలపై తనిఖీలకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ప్రమాద సంఘటన జరిగిన ప్రాంతంలో నిబంధనలకు అనుగుణంగానే అనుమతి ఇచ్చాం. ప్రమాదవశాత్తు సంఘటన జరిగింది. బాణ సంచా విక్రయాలు జరిగే ప్రాంతాల్లో ఫైర్ సేఫ్టీకి అవసరమైన అన్ని చర్యలు తీసుకొంటున్నాం. ఫైర్ ఇంజిన్లతో పాటు, బాణ సంచా విక్రయాలు జరిగే ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులతో నీటిని సిద్ధం చేసి ఉంచాం.

- స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కమిషనర్, వీఎంసీ

శాస్త్రోక్తంగా మహాలక్ష్మి యాగం



యాగం జరిపిస్తున్న అర్చకులు, చిత్రంలో ఈవో

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): భక్తులందరికీ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుతూ మహాలక్ష్మి యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించామని దుర్గగుడి ఈవో భ్రమరాంబ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆదివారం యాగాన్ని జరిపించామన్నారు. ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు యాగాన్ని పూర్తి చేసినట్లు ఆమె వెల్లడించారు. యాగంలో పలువురు ఉభయదాతలు పాల్గొనగా, వారికి వేద ఆశీర్వచనం తర్వాత ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనం కల్పించామని పేర్కొన్నారు.

నేడు దీపావళి వేడుకలు..

దీపావళిని పురస్కరించుకుని సోమవారం అమ్మవారి సన్నిధిలో వేడుకలను నిర్వహించనున్నట్లు ఈవో చెప్పారు. అమ్మవారి ప్రధానాలయంలో సాయంత్రం 5 గంటలకు దేవస్థానం తరఫున అమ్మవారి మూలవిరాట్ వద్ద ధనలక్ష్మి పూజ ఉంటుందన్నారు. సాయంత్రం పంచహారతుల సేవ, దీపాలంకరణ సేవ తర్వాత ఆలయ ప్రాంగణంలో దీపావళి వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆలయ ద్వారాలను, ఉపాలయాలను మూసివేయనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

26 నుంచి కార్తిక మాసోత్సవాలు



రామలింగేశ్వరస్వామివారి దేవస్థానం

పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఈ నెల 26వ తేదీ నుంచి కార్తిక మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు ఆదివారం వివరాలు తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకు కార్తికమాస ఉత్సవాలు కొనసాగుతాయి. 29వ తేదీన నాగులచవితి పండుగ చేస్తారు. 31న మొదటి కార్తిక సోమవారం సందర్భంగా స్వామివారికి శాంతికల్యాణం జరిపిస్తారు. నవంబర్ 4వ తేదీన భీస్మాభిషేకం, 7న రెండో సోమవారం శాంతికల్యాణం, 8న కార్తికపౌర్ణమి, 12న స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం అన్నాభిషేకం, అన్నసంతర్పణ, అమ్మవారికి అన్నపూర్ణదేవి అలంకరణ చేస్తారు. 22న మాసశివరాత్రి పూజలు, 24వ తేదీన ఉద్వాసన సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ, అభిషేకం, భక్తులకు శేషవస్త్రాలు బహూకరిస్తారు. ప్రతి రోజు ఉదయం 5 గంటలకు, 6.30, 8.00, 9.30, 10.30, 11.30 గంటలకు స్వామివారికి అభిషేకం చేస్తారు. భక్తులు స్వామివారికి పరోక్ష గోత్రనామాలతో అభిషేకం చేసుకోవటానికి అవకాశం ఉందని ఈవో తెలిపారు.

దుర్గమ్మ గాజుల ఉత్సవానికి ఏర్పాట్లు



ఉత్సవానికి గాజుల హారాలను తయారుచేస్తున్న ఆలయ సిబ్బంది



గాజులతో తయారుజేసిన హారాలు, దండలను ఈఓ భ్రమరాంబకు అందజేస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఈ నెల 27వ తేదీన గాజుల అలంకరణ జరగనుంది. ఈ ఉత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. మహా మండపంలోని ఆరో అంతస్తులో ఉత్సవాల నిర్వహణకు అవసరమైన గాజుల దండలను సేవా సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు మరో నాలుగు రోజుల గడువే ఉండటంతో పనులు వేగవంతంగా జరిగేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉత్సవం నేపథ్యంలో పలువురు భక్తులు గాజులను దేవస్థానానికి విరాళంగా అందజేస్తున్నారు. అమ్మవారి మూలవిరాట్‌కు అలంకరించేందుకు విజయవాడకు చెందిన శ్రీ కనకదుర్గ లలితా పారాయణ బృందం సభ్యులు గాజులతో తయారు చేసిన దండలు, అష్టలక్ష్మి హారాలు, పూల జడలను ఆలయ ఈఓ భ్రమరాంబకు ఆదివారం అందజేశారు. ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఈఈ రమ, ఏఈఓ పి.సుధారాణికి ఆలయ ఈఓ భ్రమరాంబ సూచించారు. గాజుల అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

‘చౌడు’కు చరమగీతం!

- విత్తన వైభవాన్ని చాటుతున్న బందరు వరి పరిశోధనా స్థానం
- నూతన వంగడాల తయారీపై పరిశోధనలు
- ఫిలిప్పీన్స్ సంస్థ సహకారంతో మరిన్ని ఆవిష్కరణల దిశగా అడుగులు
- ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో ప్రోత్సాహం



చౌడు నేలపై సాగుకు సిద్ధం చేస్తున్న వరి రకాలు

మచిలీపట్నం: వంగడాలపై పరిశోధనలు.. మేలు రకం నూతన ఆవిష్కరణలతో మచిలీపట్నం వరి పరిశోధన స్థానం విత్తన వైభవాన్ని చాటుతోంది. చౌడు నేలల్లో సిరుల పంట పండేలా సరికొత్త విత్తనాల తయారు చేయడంతో పాటు నిత్య సలహాలు, సూచనలతో రైతులకు విశిష్ట సేవలందిస్తోంది. ఇప్పటికే తీర ప్రాంతాల్లోని సాగు భూముల్లో ఉప్పును తట్టుకునే ఎంసీఎం-1, ఎంసీఎం-2, ఎంసీఎం-100, ఎంసీఎం-103 వంటి వరి రకాలను అందుబాటులోకి తెచ్చింది. 2021 సార్వాలో ఎంసీఎం-100 రకం 120 క్వింటాళ్ల విత్తనాలు కృష్ణా జిల్లా రైతులకు ఈ కేంద్రం అందించింది. తాజాగా ఎంసీఎం-109, ఎంసీఎం-125 అనే రకాలపై పరిశోధనలు పూర్తయ్యాయని ఇక్కడి శాస్త్రవేత్తలు చెబుతున్నారు. త్వరలోనే వీటిని రైతులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరిస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం..

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మచిలీపట్నంలో వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని 1955లో రాడార్ కేంద్రం సమీపంలో ప్రారంభించారు. అయితే ఆ ప్రాంతం మెడికల్ కాలేజీకి కేటాయించినందున, దీనిని ఇటీవల కృష్ణా యూనివర్సిటీకి సమీపంలో గల రుద్రవరానికి తరలించి, అక్కడ 16.34 ఎకరాలు కేటాయించారు. కేంద్రం నిర్వహణకు అనువుగా రూ.5 కోట్ల వ్యయంతో నూతన భవన నిర్మాణాల కోసం తాజాగా ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం ఐదు ఎకరాలు సిద్ధం చేసి, సరికొత్త వరి వంగడాల రూపకల్పనకు వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు.

చౌడు నేలల్లో సిరుల పంట..

ఆంధ్రప్రదేశ్‌లో సుమారుగా 3.99 లక్షల హెక్టార్ల పరిధిలో చౌడునేలలు(ఉప్పు ప్రభావిత ప్రాంతం) విస్తరించి ఉన్నాయి. సముద్ర తీర ప్రాంతం, చౌడు నేలల్లో సాగురైతులను దృష్టిలో ఉంచుకొని ఆయా చోట్ల అధిక దిగుబడులు వచ్చే వరివంగడాలను తయారు చేస్తున్నారు. మన రాష్ట్రంతో పాటు దేశ, విదేశాల్లో సైతం సముద్ర తీర ప్రాంతంలో సాగు చేసేలా 3 వేల రకాల వరి వంగడాలపై పరిశోధనలు చేస్తున్నారు. వాస్తవంగా 8 శాతానికి మించి చౌడు ఉన్నట్లయితే వరి సాగుకు అనుకూలం కాదు. కానీ మచిలీపట్నంలో చేస్తున్న పరిశోధన ప్రాంతంలో 24 శాతం మేర చౌడు ఉన్నట్లుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. అయినప్పటికీ ఎంపిక చేసిన మూడు వేల రకాల్లో వందలాది నూతన వంగడాలు ఆశించిన స్థాయిలో ఉత్పత్తి దిశగా అడుగులు వేస్తున్నట్లు శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

అంతర్జాతీయ సంస్థ సహకారం..

మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో చేస్తున్న పరిశోధనలకు ఫిలిప్పీన్స్ దేశానికి చెందిన ఓ అంతర్జాతీయ సంస్థ గత మూడేళ్లుగా సహకారం అందిస్తోంది. రుద్రవరంలో ప్రస్తుతం 3 ఎకరాల విస్తీర్ణంలో చేస్తున్న నూతన వరి వంగడాల విత్తనోత్పత్తి పరిశోధనల్లో ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తలు భాగస్వాములయ్యారు. ఇటీవలనే మచిలీపట్నం సందర్శించిన ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తల బృందం.. చౌడు నేలల్లో సాగుకు అవసరమయ్యే నూతన వరి వంగడాల ఉత్పత్తికి ఇక్కడ చేస్తున్న పరిశోధనల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మరికొంత కాలం కలసి పనిచేసేందుకు సానుకూలత వ్యక్తం చేశారు.

రైతులకు మేలు చేసేలా..



రైతులకు మేలు చేసేలా కేంద్రం ద్వారా పరిశోధనలు చేస్తున్నాం. ఫిలిప్పీన్స్‌కు చెందిన అంతర్జాతీయ సంస్థ సహకారంతో చేపట్టిన నూతన పరిశోధనలు సత్ఫలితాల దిశగా సాగుతున్నాయి. ప్రస్తుతం పరిశోధన క్షేత్రంలో సౌకర్యాలు మెరుగుపరచాల్సి ఉంది. పరిశోధన కేంద్రం చుట్టూ రక్షణ గోడ ఉండాలి.

- డాక్టర్ ఎం. గిరిజారాణి, శాస్త్రవేత్త, మచిలీపట్నం వ్యవసాయ పరిశోధన కేంద్రం

క్లుప్తంగా

ఆర్థిక లావాదేవీలతో ఘర్షణ.. వ్యక్తి మృతి



గుడివాడ రూరల్: ఆర్థిక లావాదేవీలతో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గుడివాడ పట్టణంలోని పెదఎరుకపాడులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి కుమార్తె లలిత తెలిపిన వివరాల ప్రకారం.. తన తండ్రి పందిళ్ల వెంకటసారథి (కనకం) (53) గత కొంతకాలంగా లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో లారీ ఓనర్ సాంబయ్య దగ్గర రూ.16 వేలు బకాయి పడగా, రూ.8 వేలు బాకీ చెల్లించాడు. ఆ తర్వాత మరో లారీ ఓనర్ పందిళ్ల నాగేశ్వర రావు దగ్గర సారథి చేరాడు. అయితే నాగేశ్వర రావు జీతం సక్రమంగా ఇవ్వడం లేదు. మొదట యజమాని సాంబయ్య తనకు రావాల్సిన బకాయి గురించి సారథిని ఒత్తిడి చేశాడన్నారు. జీతం గురించి కుమార్తె ప్రశ్నించగా నాగేశ్వరరావు జీతం ఇవ్వలేదని తెలిపాడన్నారు. ఈ విషయం ప్రస్తుతం ఓనర్ నాగేశ్వర రావు, ఆయన కుమారుడు రాజేష్‌కు తెలిసింది. దీంతో నాగేశ్వరరావు, రాజేష్, సాంబయ్య ముగ్గురు కలిసి సారథి గుండెపై పిడిగుద్దులతో దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వెంటనే 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇన్‌చార్జి సీఐ జయకుమార్‌ను అడగ్గా దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. అయితే జరిగిన ఘటనపై విచారణ చేపడతామన్నారు. తన తండ్రి మృతికి కారణమైన ముగ్గురు రూ.3 లక్షలకు రాజీ చేయడానికి ప్రయత్నిస్తున్నారని లలిత వాపోయింది. ముగ్గురుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు.

ప్రమాద ఘటన స్థలం పరిశీలన



జింఖానా గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



గుండెపోటుకు గురైన బాధితుడిని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

పటమట(విజయవాడ తూర్పు): అగ్ని ప్రమాదం జరిగిన ఘటన స్థలాన్ని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతుల కుటుంబ సభ్యులకు, ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా అత్యంత వైభవంగా జరుపుకునే దీపావళి పండుగ పర్వదినం ముందు రోజున ఇలాంటి దుర్ఘటన చోటు చేసుకోవడం బాధాకరమని చెప్పారు. ఈ సంఘటనలో మృతి చెందిన కాశీ, బ్రహ్మం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదం విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. బాధితులు అందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ జింఖానాగ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన దీపావళి సామగ్రి స్టాల్స్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఒకరు గుండెపోటుకు గురయ్యారు. గుండెపోటుకు గురైన పూర్ణానందపేటకు చెందిన గోపాలకృష్ణను చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆస్పత్రికి చేరుకుని గోపాలకృష్ణ ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. గోపాలకృష్ణకు వైద్యం చేసిన తర్వాత స్పృహలోకి వచ్చాడని ఆమె చెప్పారు. బాధితుడి బంధువులతో మాట్లాడిన డాక్టర్ సుహాసిని రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ శోభ, సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మితో మాట్లాడారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రిపై భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ అధికంగా ఉంది. అర్జున వీధి, ఘాట్‌రోడ్డు కార్లు, ద్విచక్ర వాహనాలతో కిటకిటలాడాయి. సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ. 300, రూ. 500 టికెట్ల క్యూలైన్‌లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిత్య ఆర్జిత సేవలతో పాటు ధనత్రయోదశిని పురస్కరించుకుని నిర్వహించిన మహాలక్ష్మీ యాగం, ఆదివారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో జరిగిన సూర్యోపాసన సేవలోనూ ఉభయదాతలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అరగంట సేపు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

భారీగా బంగారం అమ్మకాలు

- కిటకిటలాడిన జ్యూయలరీ దుకాణాలు
- దనత్రయోదశి సందర్భంగా రద్దీ
- రూ.150 కోట్లకు పైగా వ్యాపారం
- మూడేళ్ల తరువాత వ్యాపారం పర్వాలేదంటున్న వ్యాపారులు



విజయవాడలోని ఓ దుకాణంలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్న నగర వాసులు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ధనత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉభయ జిల్లాల్లో ఆదివారం స్వర్ణశోభ సంతరించుకుంది. ఆయా ప్రాంతాల్లో బంగారు ఆభరణాల దుకాణాలు కిటకిటలాడాయి. ధనత్రయోదశి పర్వదినం రోజున బంగారం కొనుగోలు చేస్తే చాలా మంచిదని, మహాలక్ష్మీ అమ్మవారు అనుగ్రహిస్తారని భక్తుల విశ్వాసం. ఆ క్రమంలో ఆదివారం రెండు జిల్లాల్లో బంగారం అమ్మకాలు భారీగా జరిగాయి. దుకాణాలకు వచ్చిన వినియోగదారులు, అన్ని వర్గాల ప్రజలు వారివారి స్థాయిల్లో బంగారం కొనుగోలు చేయటం కనిపించింది. చాలా కాలం తరువాత విజయవాడ నగరంలోని పెద్ద దుకాణాలు వినియోగదారులతో రద్దీగా దర్శనమిచ్చాయి. ఇటీవల ఎన్నడూ లేని రీతిలో కిటకిటలాడాయి.

వెయ్యికి పైగా దుకాణాలు...

రెండు జిల్లాల్లో సుమారు వెయ్యికి పైగా బంగారు ఆభరణాల దుకాణాలు ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. అందులో అత్యధిక శాతం విజయవాడలోనే ఉన్నాయి. పాతబస్తీ, బందరురోడ్డు, ఏలూరురోడ్డు, రింగ్‌రోడ్డు, రాజగోపాలచారి రోడ్డు తదితర ప్రాంతాల్లోని దుకాణాలు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అమ్మకాలతో సందడిగా దర్శనమిచ్చాయి. ప్రధానంగా కార్పొరేట్ దుకాణాల్లో భారీగా అమ్మకాలు జరిగినట్లుగా సంఘ నాయకులు తెలిపారు.

ఏడు గంటలకే షాపులు ఓపెన్....

సాధారణంగా బంగారం ఆభరణాలు విక్రయించే దుకాణాల్లో ఉదయం పదకొండు గంటలకు గానీ వ్యాపార లావాదేవీలు ప్రారంభం కావు. కానీ పండుగ సందర్భంగా ఆదివారం ఉదయం ఏడు గంటలకే దుకాణాలు తెరచుకున్నాయి. అత్యంత రమణీయంగా అలంకరించి వినియోగదారులను దుకాణానికి ఆయా యజమానులు ఆహ్వానించారు. ధనత్రయోదశి పర్వదినానికి సంబంధించిన ఘడియలు శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకూ కొనసాగాయి. దీంతో నగరవాసులు శనివారం రాత్రి పది గంటల వరకూ దుకాణాల్లో కనిపించారు. అలాగే ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ కొనుగోలు చేస్తూనే ఉన్నారు.

రూ.150 కోట్లకు పైగా వ్యాపారం...

నగరంలోని దుకాణాల్లో సుమారు రూ.150 కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లుగా అంచనా. పాతబస్తీలోని దుకాణాల్లో అంతంత మాత్రంగా ఉన్నా, బందరురోడ్డులోని కార్పొరేట్ దుకాణాల్లో మాత్రం భారీగా విక్రయాలు జరిగాయి. ఆనవాయితీగా కొనుగోలు చేసే కుటుంబాలు ఆయా మధ్య తరహా దుకాణాలకు పోటెత్తారు. దీంతో వ్యాపారం భారీగానే జరిగినట్లుగా తెలిసింది.

వ్యాపారులకు కల్పతరువుగా...

కరోనా నేపథ్యంలో గడిచిన మూడు సంవత్సరాలుగా బంగారం అమ్మకాలు నామమాత్రంగానే జరిగాయి. జీవితంలో కుటుంబం పోషణ తరువాత మిగిలిన పొదుపుతో సాధారణంగా బంగారం కొనుగోలు చేస్తారు. దీంతో కరోనాతో మూడు సంవత్సరాలుగా ఈ రంగంలోని వ్యాపారులు చాలా గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు. కానీ ఆదివారం ధనత్రయోదశి పర్వదినం వ్యాపారుల పాలిట కల్పతరువుగా మారింది.

ఆఫర్ల మీద ఆఫర్లు...

ధనత్రయోదశి పర్వదినం సందర్భంగా నగరంలోని కార్పొరేట్ దుకాణాలు భారీగా ఆఫర్లను గుప్పించాయి. కొన్ని తక్కువ ధరను ప్రకటిస్తే మరికొన్ని దుకాణాలు గ్రాముకు మూడు వందల తగ్గింపునిచ్చింది. తరుగు, మజూరీలో భారీగా రాయితీలిచ్చారు. వాటితో పాటుగా గడిచిన పది రోజులుగా వ్యాపార ప్రకటనలను గుప్పించి ప్రజలను దుకాణాలకు వచ్చే విధంగా చూశారు. మొత్తం మీద ఈ ఏడాది ధనత్రయోదశి వ్యాపారులకు మరింత కలిసి వచ్చింది

అగ్ని ప్రమాదంలో ఐదు దుకాణాలు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న దుకాణాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గాంధీనగర్: విజయవాడ లెనిన్‌సెంటర్‌లో ఆదివారం రాత్రి మరో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గవర్నర్‌పేట ఐఎంఏ హాల్ సమీపంలో రైవస్ కాలువగట్టు మీద ఐదు దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రాంతంలోని రఫీ, పెద్ద రఫీ, శంకర్, సురేష్, వెంకటేశ్వరరావులకు చెందిన మూడు ఉడ్ వర్క్స్, రెండు సోఫా సెట్లు షాపులు ప్రమాదానికి గురయ్యాయి. మంటలు ఎగిసి పడటంతో దుకాణాల్లో ఉన్న సామాన్లు కాలిబూడిదయ్యాయి. బాణసంచా కాల్చడంతో నిప్పు రవ్వలు ఎగిరొచ్చి అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఎమ్మెల్యే, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణువర్ధన్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రేపు కలేకూరి ప్రసాద్ స్మారక పురస్కారాల సభ

విజయవాడ కల్చరల్: బహుజన రచయితల వేదిక ఆధ్వర్యంలో 25 వ తేదీ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో యువ కవి కలేకూరి ప్రసాద్ స్మారక పురస్కారాల సభను నిర్వహిస్తున్నట్లు బహుజన రచయితల వేదిక ప్రధాన కార్యదర్శి తంగిరాల సోని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ అనంతరం యువ కవులు శిఖా ఆకాష్, సరికొండ నరసింహరాజులకు ప్రసాద్ స్మారక పురస్కారాలు ప్రదానం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు, కవులు పాల్గొంటారన్నారు.

ప్రమాదంపై విచారణ జరిపించాలి

సాక్షి, అమరావతి: విజయవాడ గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన బాణసంచా ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాద స్థలాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.కాశీనాథ్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ కార్యదర్శి రమణారావు తదితరులు సందర్శించారు.

రిమాండ్ ఖైదీకి కరోనా

గన్నవరం: స్థానిక సబ్‌జైలులో ఆదివారం ఓ రిమాండ్ ఖైదీ కరోనా బారిన పడటం కలకలం సృష్టించింది. ఇటీవల ఓ చోరీ కేసులో నిందితుడికి కోర్టు రిమాండ్ విధించడంతో గన్నవరం సబ్‌జైలుకు తరలించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అతనికి సబ్‌జైలు అధికారులు కరోనా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో రిమాండ్ ఖైదీకి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో ఆ ఖైదీని చికిత్స నిమిత్తం 108లో మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కోవిడ్ కేసు బయటపడడంతో సబ్‌జైలులో ఉన్న మరో 17 మంది ఖైదీలతో పాటు 30 మంది వరకు పోలీస్ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

ప్రశాంతంగా ఎల్ఐసీ ఉద్యోగుల కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు

చిలకలపూడి (మచిలీపట్నం): ఎల్ఐసీ ఉద్యోగుల కో–ఆపరేటివ్ బ్యాంక్ పాలకవర్గ సభ్యుల ఎన్నిక ఆదివారం ప్రశాంతంగా జరిగింది. కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశాల మేరకు జిల్లా సహకారశాఖ అధికారి వి.వి.ఫణికుమార్ పర్యవేక్షణలో పి.రాము ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ నెల 15వ తేదీన తొమ్మిది మంది పాలకవర్గ సభ్యుల స్థానాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శాఖల్లోని బ్యాంకు సభ్యుల నామినేషన్లు స్వీకరించారు. 16వ తేదీన నామినేషన్ల పరిశీలన, 17న ఉపసంహరణ పూర్తయిన అనంతరం అదే రోజు తొమ్మిది పాలకవర్గ సభ్యుల స్థానాలకు 16 మంది బరిలో ఉన్నట్లు ప్రకటించారు.

క్లుప్తంగా

నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ నగర ప్రజలు దీపావళి పర్వదినాన్ని నిర్వహించుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. జాగ్రత్తలు పాటిస్తూ బాణసంచా కాల్చుకోవాలని, పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. టపాసులు కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, శానిటైజర్‌కు దూరంగా ఉంటూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఆనందంగా పండగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకునే పండగ దీపావళి అని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెడును పారదోలి మంచి అనే వెలుగులు పంచే దీపావళిని ప్రతి ఇంటా సంతోషంగా జరుపుకోవాలని, లక్ష్మీపూజతో నూతన వ్యాపారాలు దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

లబ్బీపేటలో షాదీఖానా

వీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీమ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నియోజకవర్గ ముస్లింలకు కలగా ఉంటున్న లబ్బీపేటలో షాదీఖానా నిర్మిస్తామని ముస్లిం డెవలప్‌మెంట్ సొసైటీ మాజీ అధ్యక్షులు, వీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీమ్ అన్నారు. పిచ్చయ్య వీధిలోని తన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ షాదీఖానా విషయంలో టీడీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ ఇదిగో కట్టిస్తాం... అదిగో కట్టిస్తాం.. అంటూ కొలతలు వేసి, మార్కింగ్‌లు చేసి నాటకాలు ఆడి ముస్లింలను మోసం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఇప్పటికే షాదీఖానా విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, స్పష్టమైన హామీ లభించినట్లు తెలిపారు. కార్పొరేషన్ నుంచి ఇప్పటికే రూ. 2 కోట్లు కేటాయించారని, అనుమతులు రాగానే నిర్మిస్తామని పేర్కొన్నారు.

ముత్తుస్వామి దీక్షితార్‌కు సప్త స్వరాంజలి

విజయవాడ కల్చరల్: కర్నాటక సంగీత విద్వాంసుడు ముత్తుస్వామి దీక్షితార్ వర్ధంతి సందర్భంగా సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యాన శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో ఆదివారం నిర్వహించిన సప్తస్వరాంజలి శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. సంగీత విద్వాంసులతోపాటు, యువ సంగీత కళాకారులు ముత్తుస్వామి దీక్షితార్ రచించిన సంకీర్తనలు గానం చేశారు. సంగీత సమితి బాల బాలికలు వీణపై కీర్తనలను పలికించారు. సంగీత సమితి ప్రధాన కార్యదర్శి సీవీ రావు మాట్లాడుతూ ముత్తుస్వామి దీక్షితార్ సంకీర్తనలు భక్తి భావ వీచికలని అభివర్ణించారు. మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ దీక్షితార్ ఐదువందలకు పైగా కీర్తనలను రచించారని తెలిపారు. అంజనా సుధాకర్, చిట్టా కార్తీక్ పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీ భగవాన్ ధన్వంతరి జయంతి, జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా విశ్వ ఆయుర్వేద పరిషత్, విజయవాడ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం 'ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ నల్లి ధరణికుమార్ ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి శిబిరాన్ని ప్రారంభించినారు. శిబిరంలో 200 మందికి పైగా రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మాధవి విజయవాడ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దర్గా వద్ద ఊరేగింపు.. ప్రత్యేక ప్రార్థనలు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినం పురస్కరించుకుని 38వ డివిజన్ పరిధిలోని హజరత్ సయ్యద్ అలీ హుస్సేన్ షా ఖాద్రీ అవులియా దర్గా (ప్రకాశం బ్యారేజి వద్ద)లో ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు షేక్ నజీర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రెహమతున్నీసా చాదర్‌ను ఊరేగింపుగా తీసుకువెళ్లి బాబా సమాధిపై కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఎస్కే నజీర్, షేక్ హయాత్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానపత్రం ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నరుపేటలో వేంచేసి ఉన్న కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో ఈనెల 26 నుంచి నిర్వహించనున్న కార్తిక మాసోత్సవాల ఆహ్వాన కరపత్రాన్ని ఎమ్మెల్యే విష్ణు ఆవిష్కరించారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆలయ ఈఓ ఎన్‌వీ సాంబశివరావు ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

కార్తిక పూజలకు శివగిరి సిద్ధం


శివ పరివారం ప్రతిమలు


శివగిరిపై ఉన్న 36 అడుగుల పంచముఖ శివలింగం, 40 అడుగుల ఓంకార స్తూపం


ఏడు అడుగుల నాగ పడగ

- నెల రోజులు.. అభిషేకాలు
- పౌర్ణమి రోజు నాగసాధువుల ప్రత్యేక పూజలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): శ్రీవాగ్దేవి జ్యోతిర్లింగ క్షేత్రం (శివగిరి) కార్తిక మాస పూజలకు సిద్ధమైంది. ఈ నెల 26 నుంచి నవంబరు 24వ తేదీ వరకు శివగిరిపై పూజలు నిర్వహించనున్నారు. శివగిరిపై 36 అడుగుల పంచముఖ శివలింగం, 40 అడుగుల ఎత్తున ఓంకార స్తూపం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, నవగ్రహాలు, శివపరివారం, రాహు కేతువులు, దుర్గాదేవి, సరస్వతీదేవి విగ్రహాలు, అష్టాదశ శక్తి పీఠాలు, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం, గోశాల, ఏడు అడుగుల నాగ పుట్ట, నాగదేవత, నంది విగ్రహాలు ఉన్నాయి.

నిటలాక్షునికి నిత్యపూజలు

శివగిరిపైన కార్తిక మాసం సందర్భంగా ప్రతి రోజూ ఉదయం శివుడికి సహస్ర లింగార్చన, మహా లింగార్చన, రుద్రహోమం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం ఆరు గంటలకు విశేష ప్రదోష పూజ, శివ కల్యాణం నిర్వహిస్తామని శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జునశర్మ చెప్పారు. పౌర్ణమి రోజున నాగ సాధవులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

కార్తిక మాసంలో భక్తుల కోరితే వారి నివసిస్తున్న ప్రాంతాల్లో స్వామి వారి ఉత్సవ మూర్తులను ఊరేగిస్తామని తెలిపారు. శివగిరి కొండపైన భక్తులు తన సొంత ఖర్చులతో శివలింగాన్ని ప్రతిష్ఠించుకోవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థుల భాగస్వామ్యంతో సమాజసేవ

ఏసీపీ శ్రావణ్‌కుమార్


విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థి దశ నుంచే యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) శ్రావణ్ కుమార్ చెప్పారు. సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం కమ్మ విద్యార్థి సహాయ సంఘం ఆధ్వర్యాన విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ చేశారు. ఏసీపీ మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా కుల, మత బేధాలు చూడకుండా విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేయడం అభినందనీయమన్నారు. సాయం పొందిన వారు స్థిరపడిన తర్వాత మరికొంత మందికి సహాయం చేయాలని కోరారు. కమ్మ విద్యార్థి సహాయ సంఘం అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ఇలాంటి కార్యక్రమాలను తమ సంఘం తరఫున నిర్వహిస్తున్నామని చెప్పారు. కమ్మ విద్యార్థి సహాయ సంఘం కార్యదర్శి పర్వతనేని ప్రభాస్ మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుతున్న 300 మంది విద్యార్థులకు ఇరవై ఐదు లక్షల రూపాలయలను ఉపకార వేతనాలుగా అందజేస్తున్నామన్నారు. సంఘం సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల గుండెచప్పుడు సుబ్బారావు


మాట్లాడుతున్న గోళ్ల నారాయణరావు, వేదికపై బుద్ధప్రసాద్, పెనుగొండ లక్ష్మీనారాయణ

విజయవాడ కల్చరల్: పీడిత ప్రజల గుండెచప్పుడు అనిసెట్టి సుబ్బారావు అని ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అన్నారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ, సాహితీతపస్వి పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, సాహితీ స్రవంతి, తెలుగు కళావాహిని తదితర సంస్థల ఆధ్వర్యంలో నాటక రచయిత, కవి, సినీ మాటల, పాటల రచయిత అనిసెట్టి సుబ్బారావు శతజయంతి ముగింపు వేడుకలను ఎంజీరోడ్డులోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన నారాయణరావు, ప్రపంచ రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, అనిశెట్టి కుమారుడు విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ అనిశెట్టి శాంతకుమార్, అరసం బాధ్యులు పెనుగొండ లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ వెన్నావల్లభరావు, సాహిత్య పరిశోధకులు డాక్టర్ పీవీ సుబ్బారావు, అనిశెట్టి సాహిత్యజీవితం – సినీ రంగ ప్రస్థానం అంశంగా ప్రసంగించారు. అనిశెట్టి రచించిన సినీ గీతాలను బాలాజీకుమార్, సువర్ణలక్ష్మి గానం చేశారు.

పర్యావరణ హిత దీపావళిపై అవగాహన


పర్యావరణ హిత దీపావళి జరుపుకోవాలని ప్రదర్శన చేస్తున్న ఫార్మసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దీపాలు వెలిగించి పర్యావరణహితంగా దీపావళి జరుపుకుందామని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల జాతీయ సేవా విభాగం, ఫార్మకాగ్నసీ విభాగాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం విద్యార్థులు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నగరంలోని పలు కూడళ్లలో ప్రదర్శించారు. హానికరమైన రసాయనాలతో కూడిన మందుగుండు సామగ్రి వినియోగాన్ని నివారించాలని పిలుపునిచ్చారు. ప్రమిదల్లో నూనెపోసి దీపాలు వెలిగించి కుటుంబం సంతోషంగా గ్రీన్ దీపావళి జరుపుకోవాలని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఫార్మకాగ్నసీ విభాగాధిపతి వి.కరుణశ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ వినయ్‌శేఖర్, సుశాంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఎ. సునీత తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తుల అందజేత


15వ డివిజన్‌లో కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ


దుస్తులు అందజేస్తున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరానికి ఐదో ర్యాంకు రావడం సంతోషంగా ఉందని ఆరో డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు వియ్యపు అమర్‌నాథ్ చెప్పారు. ఆదివారం బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్‌లో డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేశారు. అమర్‌నాథ్ మాట్లాడుతూ చెత్త సేకరణ, రోడ్ల పరిశుభ్రత, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ, మార్కెట్, రెసిడెన్షియల్ ప్రాంతాల్లో డ్రైన్ల నిర్వహణ, చెత్త రహిత నగరంగా ఉంచడం, ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడం, నగర సుందరీకరణ మొదలైన అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకు ఇచ్చారని ఆయన తెలియజేశారు. చెత్తను కాల్వలు, రోడ్లపై పడవేయకుండా ప్రజలు పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. మొత్తం 44 మంది కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు.

కృష్ణలంక(విజయవాడ తూర్పు): పారిశుద్ధ్య కార్మికులకు నగరపాలక సంస్థ తరఫున 20వ డివిజన్ కార్పొరేటర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు దుస్తులు పంపిణీ చేశారు. డివిజన్‌లో శానిటరీ కార్యాలయంలో ఆదివారం కార్యక్రమం జరిగింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జమలయ్య, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పటమట(విజయవాడ తూర్పు): స్థానిక 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని పార్టీ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, శానిటరీ కార్యదర్శి వినయ్ కుమార్, అర్జునరావు, అనూష తదితరులు పాల్గొన్నారు.

- 16వ డివిజన్‌లో కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం దుస్తులు, మిఠాయిలు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్, ఉమ్మడిశెట్టి బహదూర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుణదల (విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ నాలుగో డివిజన్ కార్యాలయంలో ఆ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి గల్లా పద్మావతి 50 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు గల్లా రవికుమార్, బొడ్డు తరుణ్, కృష్ణా రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యుల వ్యాపారాభివృద్ధికి చేయూత



మూడో హౌస్ నేత్రను ఆవిష్కరిస్తున్న వి వైశ్యా సభ్యులు

కృష్ణలంక(విజజయవాడ తూర్పు): నగరంలోని ఆర్యవైశ్యుల వ్యాపారాభివృద్ధికి చేయూత అందించేందుకు వి వైశ్యా ఆర్గనైజేషన్ స్థాపించారని ఏపీ ఫెడరేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు అన్నారు. కృష్ణలంక, బస్టాండ్ ఎదురుగా ఉన్న పద్మావతి ఘాట్‌లోని నక్షత్ర కన్వెన్షన్‌లో వి వైశ్యా విజయవాడ జోన్ ఆధ్వర్యాన వి వైశ్యా మూడో హౌస్ నేత్రను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వైశ్యుల అభివృద్ధి, వారికి పూర్వ వైభవం తేవడానికి హౌస్‌లను ప్రారంభిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న జీఎస్టీ విధి విధానాలపై అవగాహన కల్పించారు. వి.వైశ్యా జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ వైశ్యుల యువ పారిశ్రామిక వేత్తలకు వ్యాపార మెలకువలు నేర్పించి విజయపథంలో తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. విజయవాడ జోన్ అధ్యక్షుడు రవ్వా హరీష్ మాట్లాడారు. అనంతరం నేత్రా అధ్యక్షుడుగా నంబూరు ప్రభు, కార్యదర్శిగా బద్రి, కోశాధికారిగా శాంతి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణ, చీఫ్ అడ్వైజర్ మురళీకృష్ణ, జోనల్ కన్వీనర్లు దుర్గాప్రసాద్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దీపావళి సందడి

నగర వీధుల్లో దీపావళి సందడి కనిపించింది. వన్‌టౌన్ రాజీవ్‌గాంధీ పూలమార్కెట్, సత్యనారాయణపురం ఎన్నార్పీ రోడ్డు, పటమట, నగరంలోని ఇతర ప్రాంతాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పూలమార్కెట్‌కు వచ్చిన వారితో ఆ ప్రాంతంలో రద్దీ నెలకొంది. బళ్లపై ఉంచిన వివిధ రకాల ప్రమిదలు కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపారు. దీపావళి సందర్భంగా బీసెంట్‌రోడ్డు, వన్‌టౌన్ తదితర ప్రాంతాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









వినియోగదారుల హక్కులపై అవగాహన


శ్రీనివాసరావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న నాగేశ్వరరావు

రామవరప్పాడు: వినియోగదారుల చట్టం, హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్‌సీఆర్‌సీ ఫౌండర్, చైర్మన్ ఎంపీఎల్ నాగేశ్వరరావు అన్నారు. నగరంలో ఆదివారం నిర్వహించిన జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ సమావేశంలో వైస్ చైర్మన్‌గా నగరానికి చెందిన విజయవాడ, గుంటూరు మినీ ట్రాన్స్‌పోర్ట్ సప్లయర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బజారు శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఈ మేరకు చైర్మన్ నాగేశ్వరరావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సంస్థల అధినేత శ్రీనివాసరావు చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ సంస్థలోకి ఆహ్వానించినట్లు చెప్పారు.

వైస్ చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలలో నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సంస్థను బలోపేతం చేసి, వినియోగదారుల చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సభ్యులు రాకేష్ పాండే, సురేష్‌బాబు, కోటేశ్వరరావు, శ్రీనివాస్, అవినాష్ పాల్గొన్నారు.

కాట్రగడ్డ బాబుకు నివాళి


వికలాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న ఎంపీ కేశినేని నాని తదితరులు

గుణదల (విజయవాడ తూర్పు): టీడీపీ నేత కాట్రగడ్డ నాగమల్లేశ్వర రావు (బాబు) మరణం పార్టీకి తీరని లోటని విజయవాడ ఎంపీ కేశినేని నాని అన్నారు. గురునానక్ నగర్‌లోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో ఆదివారం కాట్రగడ్డ బాబు వర్ధంతి జరిగింది. ఆయన మాట్లాడుతూ కాట్రగడ్డ బాబు టీడీపీ లో కీలక నాయకుడిగా పనిచేసే వారని పేర్కొన్నారు. ఓ వైపు రాజకీయ నేతగా ఉంటూనే మరో వైపు సమాజ సేవ చేసే వారని గుర్తు చేశారు. కాట్రగడ్డ బాబు తనయుడు మోహన్ వికలాంగులకు ట్రైసైకిళ్లు అందజేశారు. అనంతరం బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్.రఘురామ్, ఎన్.ఆనంద్ బాబు, ఎ.రాజేంద్ర ప్రసాద్, కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	104	59,307
నిఫ్టీ ▲	12	17,576

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	10,860	▲	245
డోజోన్స్	31,083	▲	749
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,970	▲	26
డాక్స్	12,731	▽	37
షాంఘై	3,039	▲	4
నికాయ్	26,891	▽	116

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ధనాధన్ 'జువ్వలు'!

- ఒడిదుడుకులున్నా ముందుకే...
- సంవత్ 2079లో నిఫ్టీ @ 19425
- సానుకూల స్థూల ఆర్థిక పరిస్థితులు, కార్పొరేట్ ఫండమెంటల్స్ దన్ను
- ఆకర్షణీయంగా బ్యాంకులు, క్యాపిటల్ గూడ్స్, ఆటో
- ఐటీ, మెటల్స్‌కి దూరం

సంవత్ 2078 ఇన్వెస్టర్లకు ఒక మోస్తరుగా గడిచింది. ద్రవ్యోల్బణం, మాంద్యం భయాలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల చమురు ధరలు భగ్గుమనడం తదితర అంశాలు భారత మార్కెట్లపైనా ప్రతికూల ప్రభావం చూపాయి. అయితే, అంతర్జాతీయంగా అమ్మకాలు వెల్లువెత్తినప్పటికీ దేశీ మార్కెట్లు తట్టుకుని నిలబడటం కాస్త ఊరటనిచ్చే విషయం. మిగతా మార్కెట్లతో పోలిస్తే దేశీ సూచీలు బాగానే రాణించాయి. ఎఫ్‌ఎంసీజీ, ఆటో, మెటల్స్ తదితర రంగాల స్టాక్స్ మెరుగ్గా కనిపించగా ఐటీ, ఫార్మా, ఫైనాన్షియల్స్ వంటివి కాస్త వెనుకబడ్డాయి. సంవత్ 2077తో పోలిస్తే 2078లో సెన్సెక్స్ 465 పాయింట్లు, నిఫ్టీ 253 తగ్గినప్పటికీ ఇన్వెస్టర్ల సంపద రూ. 11.3 లక్షల కోట్ల మేర పెరిగింది. బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 274.4 లక్షల కోట్లకు చేరింది. ఇక వడ్డీ రేట్ల పెంపుదల గరిష్ట స్థాయికి దగ్గరలో ఉండటంతో సంవత్ 2079లో కూడా కాస్త ఒడిదుడుకులు తప్పక పోవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ అంచనా వేస్తోంది. మందగమన ధోరణి నుంచి బైటికి రావాలంటే అంతర్జాతీయ స్థాయిలోనూ, దేశీయంగాను వృద్ధి ఊపందుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. మరోవైపు, సానుకూల స్థూల ఆర్థిక పరిస్థితులు, భారతీయ కార్పొరేట్ల ఫండమెంటల్స్ మెరుగ్గా ఉండటంతో మిగతా మార్కెట్లతో పోలిస్తే దేశీ మార్కెట్లు మెరుగ్గా రాణించడం ఈసారి కూడా కొనసాగవచ్చని ఐసీఐసీఐడైరెక్ట్ చెబుతోంది. వచ్చే ఏడాది వ్యవధిలో నిఫ్టీ 19425 స్థాయిని తాకుతుందని అంచనా వేస్తోంది. బ్యాంకులు, క్యాపిటల్ గూడ్స్/ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆటోమొబైల్ రంగాలు ఆకర్షణీయంగా ఉన్నాయని.. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్స్‌కి దూరంగా ఉండాలని సూచిస్తోంది. అటు యాక్సిస్ సెక్యూరిటీస్ కూడా హౌసింగ్, బ్యాంకింగ్, వాణిజ్య వాహనాలు మొదలైన సెగ్మెంట్లు 2023లో బాగుండవచ్చని అంచనా వేస్తోంది. కొత్తగా సంవత్ 2079లోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో పెట్టుబడులకు ఆకర్షణీయంగా కనిపిస్తున్న పలు స్టాక్స్‌ను వివిధ బ్రోకరేజీ సంస్థలు సిఫార్సు చేస్తున్నాయి. వాటిలో కొన్ని మీకోసం..

బ్రోకరేజి సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్

యాక్సిస్ బ్యాంక్
టార్గెట్ ధర: రూ. 970, ప్రస్తుత ధర:రూ. 900, వృద్ధి: 8%



నిర్వహణ సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి. వ్యాపారం భారీగా వృద్ధి చెందుతోంది. సిటీ వ్యాపారాన్ని కొనుగోలు చేయడం ఆదాయాలపరంగా సానుకూలంగా ఉండగలదు. నిధుల సమీకరణ వ్యయాలు తగ్గడం వల్ల ఆదాయాలకు ఊతం లభిస్తుందని అంచనా. టార్గెట్ ధర రూ. 960తో మరో బ్రోకరేజీ సంస్థ కోటక్ సెక్యూరిటీస్ కూడా దీన్ని సిఫార్సు చేస్తోంది.

అపోలో టైర్స్
టార్గెట్ ధర: రూ. 335
ప్రస్తుత ధర: రూ. 281 వృద్ధి: 19%



వాణిజ్య, ప్రైవేట్ వాహనాల విక్రయాలు పెరుగుతుండటం సానుకూలాంశం. యూరప్ మార్కెట్లో కార్యకలాపాల పునర్‌వ్యవస్థీకరణ నిలకడగా రెండంకెల స్థాయిలో మార్జిన్లు సాధించేందుకు తోడ్పడుతోంది. క్రూడాయిల్, నేచురల్ రబ్బర్ వంటి కమోడిటీల ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం కంపెనీకి లాభించే అంశం.

ఐషర్ మోటార్స్
టార్గెట్ ధర: రూ. 4,170 ప్రస్తుత ధర: రూ. 3610 వృద్ధి: 16%
వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల్లో అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన 25 శాతం



మేర వృద్ధి చెందుతాయని అంచనా. రెండంకెల స్థాయి వృద్ధి అవకాశాలను పరిశీలిస్తే షేరు చాలా ఆకర్షణీయమైన ధరలో లభిస్తోంది. కొనుగోలుదారులు ప్రీమియం మోటార్‌సైకిల్స్ వైపు మళ్లుతుండటం, హంటర్ 350కి మంచి స్పందన లభిస్తుండటం సానుకూలాంశాలు.

లెమన్ ట్రీ హోటల్స్
టార్గెట్ ధర: రూ. 110 ప్రస్తుత ధర: రూ. 84 వృద్ధి: 30%
అసంఘటిత విభాగంలో మార్కెట్ షేరును పెంచుకునేందుకు ఈ హోటల్ చెయిన్‌కు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. వ్యయాలు తగ్గించుకోవడం ద్వారా నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకుంటోంది. టెక్నాలజీని మరింతగా వినియోగిస్తుండటంతో వచ్చే ఏడాది వ్యవధిలో లెమన్ ట్రీ నిర్వహణ మార్జిన్లు 50 శాతం పెరగవచ్చని అంచనా. పేరొందిన టూరిస్ట్, బిజినెస్ లొకేషన్లలో ప్రాపర్టీలు ఉండటమనేది ఆదాయాల వృద్ధికి దోహదపడనుంది.



లారస్ ల్యాబ్స్
టార్గెట్ ధర: రూ. 675 ప్రస్తుత ధర: రూ. 487 వృద్ధి: 39%
యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ) ఆర్డర్ బుక్ స్థిరంగా కొనసాగుతుండటం, కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ, సామర్థ్యాలను పెంచుకోవడం మొదలైనవి సానుకూలాంశాలు. అమెరికా, యూరప్ మార్కెట్లలో యాంటీ-డయాబెటిక్ పోర్ట్‌ఫోలియోకు సంబంధించిన ఉత్పత్తులను లాంచ్ చేస్తుండటమనేది కంపెనీ ఫార్ములేషన్స్ వ్యాపారానికి లాభించగలదని అంచనా.

బ్రోకరేజీ సంస్థ: రెలిగేర్ బ్రోకింగ్

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్
టార్గెట్ ధర: రూ. 1,333
ప్రస్తుత ధర: రూ. 1,027 వృద్ధి: 30%



వివిధ విభాగాల్లో ఆర్డర్ బుక్ పటిష్టంగా ఉండటం దీర్ఘకాలికంగా కంపెనీ ఆదాయాలకు సానుకూలాంశం. అలాగే సర్వీస్ వ్యాపారానికి డిమాండ్ కొనసాగుతుండటం, భారీ డిజిటల్ సామర్థ్యాలు కూడా కంపెనీకి లాభించగలవు. ఆకర్షణీయమైన వేల్యుయేషన్‌తో లభిస్తోంది.

యునైటెడ్ స్పిరిట్స్
టార్గెట్ ధర: రూ. 1,093 ప్రస్తుత ధర: రూ. 821 వృద్ధి: 33%



పరిశ్రమ వృద్ధి అవకాశాలు యునైటెడ్ స్పిరిట్స్‌కు సానుకూలంగా ఉండగలవు. అంతర్జాతీయ దిగ్గజం డయాజియోతో భాగస్వామ్యం, ప్రీమియమైజేషన్ అలాగే నవీకరణపై మరింతగా దృష్టి పెడుతుండటం ప్రయోజనాలు చేకూర్చగలవు.

నిప్పన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్
టార్గెట్ ధర: రూ. 331 ప్రస్తుత ధర: రూ. 268 వృద్ధి: 23%
ఈక్విటీ అసెట్లు స్థిరంగా పెరుగుతున్నాయి. రిటైల్ అసెట్స్‌లో దిగ్గజంగా ఉంది. సిప్ ఖాతాలపై మరింతగా దృష్టి పెడుతోంది. పలు నగరాల్లో కార్యకలాపాలు ఉండటం వ్యాపార వృద్ధికి సానుకూలాంశం.

బ్రోకరేజీ సంస్థ: ఐడీబీఐ క్యాపిటల్

ఎవెన్యూ సూపర్‌మార్ట్స్
టార్గెట్ ధర: రూ. 5,148
ప్రస్తుత ధర: రూ. 4219
వృద్ధి: 22%



డీ-మార్ట్ స్టోర్స్‌ను నిర్వహించే ఎవెన్యూ సూపర్‌మార్ట్స్‌కి దేశవ్యాప్తంగా 302 స్టోర్స్ ఉన్నాయి. 2022 జూన్ 30 నాటికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో 12.1 మిలియన్ చ.అ. విస్తీర్ణంతో రిటైల్ స్పేస్ ఉంది. స్టోర్స్ సంఖ్యను 5 రెట్లు పెంచుకుని 1,500 స్థాయికి చేర్చుకోవాలని సంస్థ నిర్దేశించుకుంది. వచ్చే రెండేళ్లలో ఆదాయం 35 శాతం పెరుగుతుందని అంచనా.

సిటీ యూనియన్ బ్యాంక్
టార్గెట్ ధర: రూ. 230
ప్రస్తుత ధర: రూ. 185
వృద్ధి: 24%
సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ)కి వివిధ రాష్ట్రాల్లో 700 పైగా శాఖలు, 1,700 పైచిలుకు ఏటీఎంలు ఉన్నాయి. స్థానిక మార్కెట్ల పనితీరుపై మంచి అవగాహన ఉన్న బ్యాంకు. ఎక్కువగా రిటైల్ ట్రేడర్లు, చిన్న..మధ్య స్థాయి సంస్థలకు వర్కింగ్ క్యాపిటల్ లోన్‌లు అందిస్తోంది. లోన్ పోర్ట్‌ఫోలియోలో దాదాపు 99% సెక్యూర్డ్ రుణాలే ఉన్నాయి. రికవరీలు మెరుగుపడతున్నాయని, మొండిబాకీలు మరింతగా తగ్గుతాయన్న అంచనాలతో బ్యాంక్ ఆశావహంగా ఉంది.

బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్
టార్గెట్ ధర: రూ. 11,500
ప్రస్తుత ధర: రూ. 8,277
వృద్ధి: 39%



దక్షిణాసియాలో ప్రీమియర్ కొరియర్ కంపెనీల్లో ఒకటి. దేశీయంగా 35,000 ప్రాంతాల్లో నెట్‌వర్క్ ఉంది. 220 పైచిలుకు దేశాలు, ప్రాంతాలకు సర్వీసులు ఉన్నాయి. టెక్నాలజీ, నెట్‌వర్క్, ఆర్థికంగా పటిష్టంగా ఉండటం మొదలైనవి సానుకూలాంశాలు. ఈ-కామర్స్ పెరుగుతుండటం సంస్థకు సానుకూలాంశం. ప్రస్తుతం కంపెనీ ఆదాయాల్లో ఈ-కామర్స్ వాటా 20 శాతంగా ఉంది. ఇది వార్షికంగా 20-25 శాతం మేర వృద్ధి చెందుతోంది.

జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్
టార్గెట్ ధర: రూ. 767
ప్రస్తుత ధర: రూ. 590 వృద్ధి: 30%
దేశీయంగా అతి పెద్ద ఫుడ్ సర్వీస్ కంపెనీ. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో డోమినోస్ పిజ్జా బ్రాండ్ విక్రయాలకు మాస్టర్ ఫ్రాంచైజీ హక్కులు పొందింది. భారత్‌లో 349 నగరాల్లో 1,625 పైగా డోమినోస్ స్టోర్స్ ఉన్నాయి. భారత్‌తో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్‌లో డంకిన్ రెస్టారెంట్లు, పపాయ్స్ రెస్టారెంట్ల నిర్వహణకు ఎక్స్‌క్లూజివ్ హక్కులు ఉన్నాయి. సొంత బ్రాండ్ రెస్టారెంట్లు కూడా ప్రారంభించింది.

బ్రోకరేజీ సంస్థ: యాక్సిస్ సెక్యూరిటీస్

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్
టార్గెట్ ధర: రూ. 70 ప్రస్తుత ధర: రూ. 57 వృద్ధి: 23%



డిపాజిట్ బేస్ పటిష్టంగా ఉంది. రుణాల పోర్ట్‌ఫోలియోను భారీగా పెంచుకోవడంపై దృష్టి పెడుతోంది. బ్యాంక్ అసెట్ క్వాలిటీ, నిర్వహణ వ్యూహాలు మెరుగుపడుతుండటంతో రీ-రేటింగ్‌కు ఆస్కారం ఉందని అంచనా.

వెస్ట్‌లైఫ్ డెవలప్‌మెంట్
టార్గెట్ ధర: రూ. 870 ప్రస్తుత ధర: రూ. 749 వృద్ధి: 16%
ఈ ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్ల కంపెనీ నిర్వహణ మార్జిన్లు 14-15 శాతం శ్రేణిలో ఉంటాయని అంచనా. వేగంగా వృద్ధి చెందుతున్న ఫ్రైడ్ చికెన్ కేటగిరీలోకి ప్రవేశించడం, అధిక మార్జిన్లు ఉండే మెక్‌కేఫే వ్యాపారాన్ని పెంచుకుంటూ ఉండటం, వ్యయ నియంత్రణ చర్యలు, సరఫరా వ్యవస్థలను సమర్ధమంతంగా తీర్చిదిద్దుకుంటూ ఉండటం మొదలైనవి సానుకూలాంశాలు. భారీ పెట్టుబడి వ్యయాల అవసరం లేకుండా ఒకే స్టోరులో మూడు కేటగిరీలను అందించగలుగుతుండటం లాభించే అంశం.

ఐటీసీ
టార్గెట్ ధర: రూ. 380
ప్రస్తుత ధర: రూ. 345 వృద్ధి: 10%



ఐటీసీ సుమారు 4-5 శాతం డివిడెండ్ ఈల్డ్ అందిస్తోంది. మిగతా పోటీ కంపెనీలతో పోలిస్తే అత్యధిక సేఫ్టీ మార్జిన్ ఉంటోంది. సిగరెట్ వ్యాపారం రికవర్ కావడం .. సమీప భవిష్యత్తులో అగ్రి, హోటల్స్, పేపర్‌బోర్డ్ వంటివి పుంజుకోనుండటం వంటి అంశాల కారణంగా మొత్తం ఎఫ్‌ఎంసీజీ విభాగంలోనే ఐటీసీ ఆకర్షణీయంగా ఉంది.

సుందరం ఫైనాన్స్
టార్గెట్ ధర: రూ. 2,490
ప్రస్తుత ధర: రూ. 2,362 వృద్ధి: 5%



అనిశ్చితి సమయంలో రుణాల పోర్ట్‌ఫోలియోను భారీగా విస్తరించకుండా ఆచితూచి వ్యవహరించడం వల్ల అసెట్ క్వాలిటీపరమైన ఒత్తిళ్లను సమర్ధంగా ఎదుర్కొనగలిగింది. వైవిధ్యమైన సెక్యూర్డ్ రుణాలు, పటిష్టమైన అండర్‌రైటింగ్ విధానాలు, సముచిత స్థాయిలో పెట్టుబడులు ఉండటం మొదలైనవి సానుకూలాంశాలు.

అశోక్ లేల్యాండ్
టార్గెట్ ధర: రూ. 175 ప్రస్తుత ధర: రూ. 143 వృద్ధి: 22%



సంబంధిత పరిశ్రమ రికవరీతో కంపెనీకి గణనీయంగా ప్రయోజనాలు చేకూరవచ్చు. ముఖ్యంగా బస్సులు, అధిక టన్నేజ్ ట్రక్కుల విభాగంలో మరింత మార్కెట్ వాటా దక్కించుకోవచ్చు. రాబోయే త్రైమాసికాల్లో ముడి పదార్థాల ధరలపరమైన ఒత్తిళ్లు క్రమంగా తగ్గి మార్జిన్లు మరింత మెరుగుపడవచ్చని అంచనా.

బ్రోకరేజీ సంస్థ: జేఎం ఫైనాన్షియల్

అంబుజా సిమెంట్
టార్గెట్ ధర:రూ. 800
ప్రస్తుత ధర: రూ. 513
వృద్ధి: 56%
టెక్నికల్‌గా చూస్తే రూ. 445 దగ్గర మేజర్ బ్రేకవుట్ అయ్యింది. రోజువారీ చార్టుల ప్రకారం బుల్లిష్ ఫ్లాగ్ ప్యాటర్న్ ఏర్పడటం సానుకూలాంశం కాగలదు. రూ. 395ని స్టాప్ లాస్‌గా పెట్టుకోవచ్చు.

బజాజ్ ఫైనాన్స్
టార్గెట్ ధర: రూ. 10,000
ప్రస్తుత ధర: రూ. 7,192
వృద్ధి: 39%



వీక్లీ, డైలీ చార్టుల్లో బ్రేకవుట్ పరిస్థితి కనిపిస్తోంది. కంపెనీ షేరు కన్సాలిడేట్ అవుతుండటం ఇది మూడో నెల. ఫైనాన్షియల్స్ నిఫ్టీ పటిష్టంగా ఉండటంతో బ్రేకవుట్‌కు మంచి అవకాశాలు ఉన్నాయి. రూ. 6,200 స్టాప్ లాస్ పెట్టుకోవచ్చు.

ఇన్ఫోసిస్
టార్గెట్ ధర: రూ. 1,950
ప్రస్తుత ధర: రూ. 1,500
వృద్ధి: 30%



మధ్యకాలికంగా ఐటీ స్టాక్స్ మెరుగ్గా రాణించవచ్చని అంచనా. ప్రధానమైన దీర్ఘకాలిక మద్దతు జోన్ అయిన రూ. 1,355-1,370 వద్దకు కరెక్షన్ వచ్చింది. అక్కడి నుంచి స్థిరంగా పెరుగుతోంది. ప్రస్తుత స్థాయిల నుంచి తదుపరి ర్యాలీ చేయొచ్చు. రూ. 1,150 స్టాప్ లాస్ పెట్టుకోవచ్చు.

ఎల్ అండ్ టీ లిమిటెడ్
టార్గెట్ ధర: రూ. 2,650
ప్రస్తుత ధర: రూ. 1,875
వృద్ధి: 41%



ఈ ఏడాది ఆసాంతం క్యాపిటల్ గూడ్స్ రంగానికి కలిసి వచ్చింది. పటిష్టమైన ఇనిస్టిట్యూషనల్ కొనుగోళ్లతో ఎల్ అండ్ టీ మెరుగ్గా ఉంది. ఇదే ధోరణి ఇకపైనా కొనసాగవచ్చని అంచనా. మరోసారి జీవితకాల గరిష్టాలను దాటేసేయవచ్చు. రూ. 1,750-1,800 వద్ద మద్దతులు కనిపిస్తున్నాయి. రూ. 1,425 స్టాప్‌లాస్ పెట్టుకోవచ్చు.

బ్రోకరేజీ: హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్

యాస్టర్ డీఎం హెల్త్‌కేర్
టార్గెట్ ధర: రూ. 278
ప్రస్తుత ధర: రూ. 246
వృద్ధి: 13%



ఉత్పత్తుల మెరుగైన మేళవింపు, రేట్ల పెంపు, టాప్ నగరాల్లోకి విస్తరణ.. కంపెనీకి సానుకూలం. స్పెషాలిటీస్‌పై ఫోకస్ పెడుతుండటం వల్ల మెడికల్ వేల్యూ టూరిజంపరంగా కూడా లాభించవచ్చు.

భారత్ డైనమిక్స్
టార్గెట్ ధర: రూ. 1,022
ప్రస్తుత ధర: రూ. 956 వృద్ధి: 7%



భారీ టార్పిడోలు, కొత్త తరం ఎస్‌ఏఎంలు, ఏటీజీఎంలు మొదలైన వాటిని తయారు చేయడంపై దృష్టి పెడుతోంది. దీంతో ఆదాయాలు మెరుగుపడవచ్చు. పెద్ద సంఖ్యలో ఆర్డర్లు, భారీ ప్రాజెక్టులు, దేశీయంగా తయారీని.. అంతర్గత సామర్థ్యాలను పెంచుకుంటోంది.

భారత్ ఎలక్ట్రానిక్స్
టార్గెట్ ధర: రూ. 123
ప్రస్తుత ధర: రూ. 103
వృద్ధి: 19%



లాభదాయకత బాగుండటం, నికర రుణ భారం సున్నా స్థాయిలో ఉండటం, లిక్విడిటీ మెరుగ్గా ఉండటం మొదలైన అంశాలతో ఆర్థిక పరిస్థితి పటిష్టంగా ఉండటం సంస్థకు సానుకూలాంశాలు.

బిర్లా కార్పొరేషన్
టార్గెట్ ధర: రూ. 1,069
ప్రస్తుతం: రూ.901 వృద్ధి: 19%
వ్యయాలను తగ్గించుకునేందుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. క్లింకర్ సామర్థ్యాన్ని, క్యాప్టివ్ గనుల నుంచి బొగ్గు వెలికితీతను పెంచుకుంటోంది. ఇవన్నీ కలిసి ఆదాయం..మార్జిన్ వృద్ధికి దోహదపడగలవని అంచనా.

సిప్లా
టార్గెట్ ధర: రూ. 1,283
ప్రస్తుత ధర: రూ. 1,140
వృద్ధి: 13%



కంపెనీ ఆదాయంలో 45% భాగం వన్ ఇండియా (బ్రాండెడ్ జనరిక్స్, ట్రేడ్ జనరిక్స్) నుంచి, అమెరికా మార్కెట్ నుంచి 20%, దక్షిణాఫ్రికా తదితర మార్కెట్ల నుంచి 17% వాటా ఉంటోంది. విస్తృత శ్రేణి ఉత్పత్తులతో వివిధ దేశాల్లో విస్తరించడం వల్ల ప్రతికూలతలను తట్టుకోగలదు.

బంగారం @ రూ. 56,000: ఏంజెల్ బ్రోకింగ్

ద్రవ్యోల్బణానికి హెడ్జింగ్ సాధనంగా బంగారాన్ని పరిగణిస్తారు. అయితే, అంతర్జాతీయంగా అనిశ్చితి, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలు మొదలైన ప్రతికూల పరిణామాలు నెలకొన్నప్పటికీ 2022లో పసిడి ఇన్వెస్టర్లకు అంతగా కలిసి రాలేదు. అయినప్పటికీ మళ్లీ పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత రెండేళ్లుగా పసిడి రేట్ల తీరుతెన్నులు చూస్తే.. బంగారం ధరలు 2021లో 4 శాతం మేర తగ్గాయి. ఒక దశలో రూ. 43,320కి (పది గ్రాములు) పడిపోయాయి. అక్కణ్నుంచి సుమారు 28 శాతం ర్యాలీ చేసి 2022 మార్చిలో రూ. 55,558కి చేరాయి. దీన్ని బట్టి చూస్తే బంగారానికి దీర్ఘకాలిక ట్రెండ్ ఇంకా సానుకూలంగానే ఉంది. సాంకేతికంగా గత ఆర్థిక సంవత్సరంలో బంగారం ఆల్ టైమ్ గరిష్టమైన రూ. 56,191-ఇటీవలి కనిష్టమైన రూ. 43,320 స్థాయిల మధ్య తిరుగాడింది. ప్రస్తుతం సుమారు రూ. 51,000 స్థాయిలో ఉన్న పసిడి వచ్చే ఏడాది దీపావళి నాటికి రూ. 56,000కు చేరుకోవచ్చు. కాబట్టి తగ్గినప్పుడల్లా కొద్దికొద్దిగా కొనుగోలు చేయొచ్చు. టెక్నికల్‌గా చూస్తే రూ. 46,000-46,300 మద్దతుగా ఉంటుంది. దాన్ని కోల్పోతే రూ. 41,000కు తగ్గవచ్చు. మరోవైపు, రూ. 55,200-56,100 నిరోధ స్థాయిగా ఉండొచ్చు. దాన్ని దాటేస్తే రూ. 61,500 అటుపైన రూ. 66,000 వద్ద గట్టి నిరోధం ఎదురుకావచ్చు.



నేడు మూరత్ ట్రేడింగ్..

దీపావళి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు నేడు(సోమవారం) గంట పాటు ప్రత్యేక "మూరత్ ట్రేడింగ్" నిర్వహించనున్నాయి. ఇది సాయంత్రం 6.15 గంటలకు మొదలై 7.15 గంటలకు ముగుస్తుంది. బలిప్రతిపద సందర్భంగా బుధవారం మార్కెట్లకు సెలవు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-10-2022	
విశాఖ	500-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470-00
విజయవాడ	470-00
రిటైల్ ధర (డజను)	72.00
23-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	430-00
వరంగల్	432-00
రిటైల్ ధర	4.90

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 8,007 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ప్రస్తుత ఏడాది(2022-23) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 31 శాతం ఎగసి రూ. 8,007 కోట్లను తాకింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 37 శాతం జంప్‌చేసి రూ. 7,558 కోట్లకు చేరింది. గతేడాది (2021-22) ఇదే కాలంలో రూ. 5,511 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం 26% వృద్ధితో రూ. 14,707 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్లు 0.3% బలపడి 4.31%కి చేరాయి.

ఇతర ఆదాయం అప్

ప్రస్తుత సమీక్షా కాలంలో ఐసీఐసీఐ బ్యాంక్ వడ్డీయేతర ఆదాయం(ట్రెజరీమినహా) 17 శాతం పుంజుకుని రూ. 5,139 కోట్లను తాకింది. ట్రెజరీ ఆదాయం గత క్యూ2లో రూ. 397 కోట్లుకాగా.. ప్రస్తుతం రూ. 85 కోట్ల నష్టంగా నమోదైంది. ప్రొవిజన్లు రూ. 2,713 కోట్ల నుంచి రూ. 1,643 కోట్లకు వెనకడుగు వేశాయి. స్థూల మొండిబకాయిలు 4.82 శాతం నుంచి 3.19 శాతానికి తగ్గాయి. ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్-జూన్)లో నమోదైన 3.41 శాతంతో పోల్చినా మెరుగుపడ్డాయి. తాజా స్లిప్పేజీలు రూ. 4,300 కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుతం ఎండీ, సీఈవో సందీప్ బక్షి పదవీ కాలాన్ని మరో మూడేళ్లు పొడిగిస్తూ బోర్డు ఏకగ్రీవంగా అనుమతించినట్లు బ్యాంక్ తాజాగా పేర్కొంది.

అనుబంధ సంస్థలు ఇలా

బ్యాంక్ అనుబంధ సంస్థలలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ లాభం రూ.445 కోట్ల నుంచి రూ.199 కోట్లకు క్షీణించింది. ఐసీఐసీఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ లాభం 32% ఎగసి రూ.591 కోట్లను తాకింది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ లాభం 6 శాతం పుంజుకుని రూ.406 కోట్లయ్యింది. ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లాభం రూ. 51 కోట్లు తగ్గి రూ.300 కోట్లకు పరిమితమైంది.

మూన్‌లైటింగ్ ఆమోదయోగ్యం కాదు..

అలాంటి కొందరు ఉద్యోగులను తొలగించాం: హ్యాపీయెస్ట్ మైండ్స్

న్యూఢిల్లీ: మూన్‌లైటింగ్ (ఒకే సారి రెండు చోట్ల ఉద్యోగాలు చేయడం) అనేది ఉద్యోగ కాంట్రాక్టును ఉల్లంఘించడమేనని, ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని ఐటీ సంస్థ హ్యాపీయెస్ట్ మైండ్స్ స్పష్టం చేసింది. మూన్‌లైటింగ్ చేస్తున్నారని తేలిన 'కొందరు' ఉద్యోగులను గత 6-12 నెలల్లో ఉద్యోగాల నుంచి తొలగించినట్లు పేర్కొంది. అయితే, ఎంత మందిపై చర్యలు తీసుకుందో వెల్లడించలేదు. కంపెనీలో దాదాపు 4,581 మంది ఉద్యోగులున్నారు. ఈ విషయంలో మిగతా వారికి మరింత స్పష్టం ఇచ్చేందుకే.. మూన్‌లైటింగ్ చేస్తూ దొరికిన వారిని వెంటనే తొలగించినట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ జోసెఫ్ స్పష్టం చేశారు.



కోటక్ మహీంద్రా లాభం ప్లస్

క్యూ2లో రూ. 2,581 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రస్తుత ఏడాది(2022-23) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 21 శాతం పుంజుకుని రూ. 3,608 కోట్లను తాకింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 27 శాతం జంప్‌చేసి రూ. 2,581 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ. 8,408 కోట్ల నుంచి రూ. 10,047 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 27 శాతం బలపడి రూ. 5,099 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 5.17 శాతానికి చేరాయి. అయితే ఆటోమాటిక్ పద్ధతిన రుణాలపై మార్కెట్‌కు అనుసంధానమైన రేట్లతో మార్జిన్లు మెరుగుపడటం ఇందుకు దోహదం చేసినప్పటికీ భవిష్యత్‌లో 4.25-4.35 శాతం స్థాయిలో ఇవి కొనసాగగలవని బ్యాంక్ వివరించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.19 శాతం నుంచి 2.08 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 1.06 శాతం నుంచి 0.55 శాతానికి దిగివచ్చాయి. తాజా స్లిప్పేజీలు రూ. 983 కోట్లుగా నమోదయ్యాయి.

అనుబంధ సంస్థల తీరు ఇదీ...

కోటక్ బ్యాంక్ అనుబంధ సంస్థలలో లైఫ్ ఇన్సూరెన్స్ లాభం రూ. 155 కోట్ల నుంచి రూ. 270 కోట్లకు ఎగసింది. సెక్యూరిటీస్ లాభం రూ. 243 కోట్ల నుంచి రూ. 224 కోట్లకు తగ్గింది. కొటక్ ప్రైమ్ లాభం రూ. 18 కోట్లు తక్కువగా రూ. 222 కోట్లకు పరిమితమైంది. ట్రస్టీ విభాగం నుంచి రూ. 9 కోట్లు అధికంగా రూ. 106 కోట్లు లభించినట్లు కొటక్ బ్యాంక్ వెల్లడించింది. కోటక్ ఇన్వెస్ట్‌మెంట్స్ రూ. 11 కోట్లు తగ్గి రూ. 78 కోట్ల లాభం ఆర్జించింది. మైక్రోఫైనాన్స్ లాభం రూ. 8 కోట్ల నుంచి ఏకంగా రూ. 70 కోట్లకు దూసుకెళ్లింది. అయితే కోటక్ క్యాపిటల్ లాభం రూ. 58 కోట్ల నుంచి రూ. 22 కోట్లకు క్షీణించింది.